అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

మంగళవారం 26-3-2024

సమగ్ర తెలుగు దినపత్రిక



జై హింద్, భారత్ మాతా కీ జై

నినాదాల తొలి గళం ఇద్దరు ముస్లింలదే... వివరాలు 3లో

- 'సంఘ్' ఆ నినాదాలు వదిలేస్తుందా?: ప్రశ్నించిన కేరళ సీఎం విజయన్

సంపుటి : 10 సంచిక : 35 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

కమలంలో కల్లోలం

పార్టీవారిని మార్చి.. వలసనేతలకు టిక్కెట్లు

శ్రేణులను కలవరపెడుతున్న బీజేపీ ఐదో లిస్టు



సినీ నటులు, కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే పెద్ద పీట

- సొంత పార్టీ నాయకుల్లో ఆవేదన
- మోడీ, షా, నడ్డాలపై అసంతృప్తి

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎంపీ అభ్యర్థులకు సంబంధించి బీజేపీ విడుదల చేసిన ఐదో జాబితా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. 111 మంది అభ్యర్థులతో కూడిన ఈ లిస్ట్‌లో పలువురు మంత్రులు, సీనియర్ నాయకులు, సిట్టింగ్ ఎంపీలకు స్థానం దక్కలేదు. ఈ జాబితాలో ఇతర పార్టీల నుంచి వచ్చినవారు, నటులు, మాజీ కాంగ్రెస్ కీలక నాయకులేగాక.. అసలు పార్టీలో లేని వారికి సైతం టికెట్లు వచ్చాయి. కేంద్ర మంత్రులు అశ్విని కుమార్ చౌబె, వి.కె సింగ్, పిలిభిత్ ఎంపీ వరుణ్ గాంధీ వంటి కీలక నాయకులు చోటు దక్కనివారిలో ఉన్నారు. సినీ నటులు కంగనా రనౌత్, అరుణ్ గోవిల్ వంటి వారికి బీజేపీ ఈ సారి స్థానం కలిపించటం గమనార్హం.

కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి చేరిన పలువురు కీలక నాయకులకు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే బీజేపీ ఐదో జాబితాలో చోటు దక్కింది. ఐదో జాబితాలో చోటు దక్కని 37 మంది సిట్టింగ్ ఎంపీలలో యూపీ నుంచి తొమ్మిది, గుజరాత్ నుంచి ఐదు, ఒడిశా నుంచి నాలుగు, బీహార్, కర్నాటక, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు.

కర్నాటక నుంచి ఆరుసార్లు ఎంపీగా గెలిచిన వివాదాస్పద నాయకుడు అనంత కుమార్ హెగ్డేకు ఈ సారి బీజేపీ అవకాశం కల్పించలేదు. భారత రాజ్యాంగంపై ఆయన ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన విషయం విదితమే. ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి వచ్చిన వారికి కాషాయ అధిష్టానం టిక్కెట్లు కేటాయించటం గమనార్హం. ఇందులో సీతా సొరెన్, తపస్ రాయ్, ఎన్. కిరణ్ కుమార్ రెడ్డిలు ఉన్నారు. కాంగ్రెస్ నుంచి వచ్చి కాషాయ కండువా కప్పుకున్న నవీన్ జిందాల్‌కు కురుక్షేత్ర సీటు, జితిన్ ప్రసాదాకు పిలిభిత్ స్థానాన్ని బీజేపీ కేటాయించింది. కేరళ బీజేపీ అధ్యక్షుడు కె. సురేంద్ర.. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీపై పోటీ చేయనున్నారు.

వరుణ్‌గాంధీ ఔట్.. మేనకా గాంధీ ఇన్

ఇక తన వ్యాఖ్యలతో మతవిద్వేషాలు రెచ్చగొట్టే కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు ఈ జాబితాలో బీజేపీ టిక్కెట్ కేటాయించింది. ఆయన మళ్లీ బెగుసరాయ్ నుంచి బరిలో నిలవనున్నారు. కేంద్ర మాజీ మంత్రి ...3లో

ఏమి సేతురా..!

- బీజేపీని వెంటాడుతున్న బ్యాక్‌ఫుట్ భయం
- పోటీ చేయబోమంటున్న కొందరు
- ఏకంగా రాజకీయాల నుంచి నిష్క్రమిస్తున్న మరి కొందరు

3లో



ఐదు గ్యారంటీలే ఎజెండా

దేశమంతటా తెలంగాణ, కర్నాటక మోడల్

- మహిళలు, రైతులు, యువత టార్గెట్‌గా మ్యానిఫెస్టో
- ప్రజల ఆశీర్వాదం ఉంటుందన్న ధీమాలో కాంగ్రెస్



హోలీ పండుగ సందర్భంగా మనవడితో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించేందుకు వీలుగా కాంగ్రెస్ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలను మోడల్‌గా ఎంచుకుంది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు అవలంభించిన వ్యూహాన్నే దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ఆ పార్టీ రంగం సిద్ధం చేయడం గమనార్హం. ఐదు గ్యారంటీలతో రెండు రాష్ట్రాల ప్రజలను ఆకట్టుకున్న కాంగ్రెస్ ఐదు న్యాయాలు (పాంచ్ న్యాయ్) ఎజెండాతో దేశ ప్రజలను తన వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఆ ఎజెండాతో పాటు మ్యానిఫెస్టోలో మహిళలు, రైతులు, యువత ఓట్లను ఆకట్టుకునేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్ణాటక, తెలంగాణలో మ్యానిఫెస్టో రూపకల్పనకు ప్రజలు, మేధావులు, ...11లో

కాంగ్రెస్ ఆరో జాబితా విడుదల

- రాజస్థాన్‌లో నలుగురు, తమిళనాడులో ఒక స్థానానికి అభ్యర్థులు ఖరారు



న్యూఢిల్లీ : రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ఆరో జాబితాను విడుదల చేసింది. ఇందులో ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. దీంతో ఇప్పటి వరకూ కాంగ్రెస్ మొత్తంగా 190 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. సోమవారం ఆరో జాబితాలో రాజస్థాన్‌లో నాలుగు, తమిళనాడులో ఒక స్థానానికి అభ్యర్థులను ప్రకటించింది. అలాగే తమిళనాడులో ఉప ఎన్నిక జరగనున్న విలవంకొడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి కూడా కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించింది. ఆరో జాబితా ప్రకారం రాజస్థాన్‌లో కోటా లోక్‌సభ స్థానం నుంచి ప్రహ్లాద్ గుంజల్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపింది. బీజేపీ మాజీ ఎమ్మెల్యే అయిన ...11లో

ముగిసిన కవిత 10 రోజుల కస్టడీ

- నేడు మరోసారి కోర్టుకు..
- కస్టడీ పొడిగించాలని ఈడీ కోరే అవకాశం
- బెయిల్ పిటిషన్‌పై విచారణ కోరనున్న కవిత న్యాయవాదులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్స్ స్కాం మనీ లాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సంబంధించి మొత్తం పది రోజుల ఈడీ కస్టడీ ముగిసింది. దీంతో నేడు (మంగళవారం) ఉదయం 11 గంటలకు మరోసారి ఈడీ అధికారులు ఆమెను రౌస్ ఎవెన్యూ లోని సీబీఐ స్పెషల్ కోర్టులో హాజరుపరచనున్నారు. లిక్కర్ స్కాంకు సంబంధించి ఈనెల 15న హైదరాబాద్ లోని కవిత నివాసంలో ఈడీ సోదాలు చేపట్టింది. అనంతరం ఆమెను అరెస్ట్ చేసి, అదే రోజు రాత్రి ఢిల్లీకి తీసుకొచ్చారు. 16న సీబీఐ స్పెషల్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరిచి, ...11లో

30న మతోన్మాద వ్యతిరేక రాష్ట్ర సదస్సు

11 వామపక్ష పార్టీల ప్రకటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని 11 వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీలు విమర్శించాయి. ప్రజల దృష్టిని పక్కదోవ పట్టిస్తున్నదనీ, మతోన్మాద విధానాలను ముందుకు తెస్తున్నదనీ, నియంతృత్వ విధానాలను అమలు చేస్తున్నదని తెలిపాయి. బీజేపీ ప్రజా వ్యతిరేక, మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 30న ఉదయం పది గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహించాలని నిర్ణయించాయి.

ఈ మేరకు తమ్మినేని వీరభద్రం (సీపీఐఎం), కూనంనేని సాంబశివరావు (సీపీఐ), పోటు రంగారావు (సీపీఐఎంఎల్ మాస్‌లైన్), జెవి చలపతిరావు (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), సాదినేని వెంకటేశ్వరరావు (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), గాదగోని రవి (ఎంసీపీఐయూ), సిహెచ్ మురహరి (ఎస్‌యూసీఐసీ), జానకి రాములు (ఆరెస్పీ), బి సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), రమేష్‌రాజా (సీపీఐఎంఎల్ లిబరేషన్), ప్రసాదన్న (సీపీఐఎంఎల్) సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లోని గవర్నర్ వ్యవస్థను తమ స్వార్థ ప్రయోజనాలకోసం వాడుకుంటూ ఆయా ప్రభుత్వాలను బీజేపీ పడగొడుతున్నదని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కూడా ఈడీ, ఐటీ దాడులతో ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నదని ...11లో

గులాబీ పార్టీలో గుబులు..

ఇటు ఎమ్మెల్సీ ఎన్నిక.. అటు లోక్‌సభ... అయోమయంలో నాయకత్వం


- పాలమూరు జడ్పీటీసీ, ఎంపీటీసీలతో గోవాలో కేటీఆర్ క్యాంపు
- పార్లమెంటరీ పార్టీ నేత కేకే వ్యాఖ్యలతో మరింత హీటు
- ఈ గందరగోళం మధ్యే హైదరాబాద్ ఎంపీ సీటుకు గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేరు ఖరారు
- నేడు సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంపై సమీక్ష
- హాజరుకానున్న కేటీఆర్, పద్మారావు, తలసాని తదితరులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పరిస్థితి రోజురోజుకు మరింత ఇబ్బందికరంగా మారుతోంది. లోక్‌సభ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న వేళ... నేతలందరూ పార్టీని వీడుతుండటంతో ఏం చేయాలో పాలుపోని దుస్థితి ఆ పార్టీలో నెలకొంది. మరోవైపు ఈనెల 28న జరగబోయే మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక గులాబీ పార్టీలో గుబులు రేపుతోంది. అక్కడున్న జడ్పీటీసీలు, ఎంపీటీసీల్లో అత్యధిక మంది బీఆర్ఎస్‌కు చెందిన వారే. అయినా ఏదో తెలియని ఆందోళన. గతంలో నల్లగొండ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా ఎదురైన అనుభవాన్ని ఇప్పుడు నేతలు గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో ఆ జిల్లాలో జడ్పీటీసీలు, ఎంపీటీసీలందరూ బీఆర్ఎస్ వారే ఉన్నప్పటికీ... కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజయం సాధించారు. అంటే కారు పార్టీకి చెందిన స్థానిక ప్రజా ప్రతినిధుల్లో ఎక్కువ మంది హస్తానికి ఓటేశారన్నమాట. అలాంటి పరిస్థితే ఇప్పుడూ ఎదురవుతుందని బీఆర్ఎస్ అంచనా వేసింది. అందుకే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలందర్నీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గోవాకు తీసుకెళ్లి, గత రెండు రోజుల నుంచి అక్కడే క్యాంపు రాజకీయాలు నడిపినట్టు సమాచారం. ఈ క్యాంపునకు ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, బీఆర్ఎస్ నాగర్ కర్నూల్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఆ జిల్లా నేతలు మర్రి జనార్థన్‌రెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 1,394 మంది ఓటర్లు (స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు) ఉండగా, వీరిలో బీఆర్ఎస్‌కు 823, కాంగ్రెస్‌కు 396, బీజేపీకి 88, బీఎస్పీకి ఒకటి, సీపీఐకి 4, సీపీఐ(ఎం)కు ఇద్దరు, ఎంఐఎంకు ఆరుగురు ఓటర్లు ఉన్నారు. ఇండిపెండెంట్లు 13 మంది ఉన్నారు. ఈ సమీకరణాల నేపథ్యంలో ఎమ్మెల్సీ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోకూడదనే ఉద్దేశంతో కారు పార్టీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది.

మరోవైపు సాక్షాత్తూ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు యూట్యూబ్ ఛానళ్లలో తాజాగా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఆయన కూతురు, హైదరాబాద్ మేయర్ ...11లో



రైతులు బ్యాంకు అప్పులు కట్టొద్దు

ఎవరైనా ఒత్తిడి చేస్తే బీఆర్ఎస్ నేతలకు చెప్పండి

- ప్రభుత్వం బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలివ్వాలి : మాజీమంత్రి,ఎమ్మెల్యే టీ. హరీశ్‌రావు డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైతులు ఎవరూ బ్యాంకుల అప్పులు చెల్లించొద్దని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు అన్నారు. ఎవరైనా బ్యాంకర్లు అప్పులు కట్టమని ఒత్తిడి చేస్తే స్థానిక బీఆర్ఎస్ నేతలకు చెప్పాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీరు లేక పంటలు ఎండిపోయి రైతులు దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్నారనీ, ఇలాంటి సమయంలో అప్పులు కట్టాలని బ్యాంకర్లు వత్తిడి చేయడం భావ్యం కాదన్నారు. సోమవారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయాలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని విమర్శించారు. వరంగల్ జిల్లా దేవరుప్పుల మండలం లక్ష్మీబాయి తండాలో ఆదివారం క్షేత్ర స్థాయి పర్యటన చేశామనీ, ఒక్కో రైతు నాలుగైదు బోర్లు వేశామని చెప్పారనీ, తాగునీరు కూడా సక్రమంగా రావట్లేదని ఫిర్యాదులు చేశారన్నారు. రాష్ట్రంలో 180 రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే, రాష్ట్ర ప్రభుత్వం కనీసం క్షేత్రస్థాయికి అధికారుల బృందాన్ని కూడా పంపలేదని ఆరోపించారు. అందోల్ నియోజకవర్గం రేగోడ్ మండలంలో గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులు అనేక గ్రామాల్లో అప్పులు కట్టాలని రైతులకు నోటీసులు ఇస్తున్నారనీ, సీఎం రేవంత్‌రెడ్డి ఏం చెప్పారో తమకు సంబంధం లేదనీ, రుణాలు కట్టాల్సిందేనని బ్యాంకు అధికారులు గ్రామాల మీద ...11లో

హోలీ వేడుకల్లో విషాదం

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆరుగురు మృతి
- చావులోనూ వీడని స్నేహబంధం



(ఫైల్)


నవతెలంగాణ - కౌటాల, దండేపల్లి, ఆదిలాబాద్ రూరల్

హోలీ పండుగ ఆ కుటుంబాల్లో సంతోషం.. సరదా.. రంగుల జీవితాలను మాజం చేసింది. ఉదయం నుంచి స్నేహితులంతా కలిసి రంగుల చల్లుకుని కేరింతలు కొడుతూ సంతోషంగా గడిపిన వారు.. ఆ తర్వాత కొద్ది గంటల్లోనే విగతజీవివులుగా మారారు. స్నానానికెళ్లి నీటిలో మునిగి ఆరుగురు ప్రాణం కోల్పోయారు. దాంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కౌటాల మండలంలో నలుగురు, దండేపల్లి మండలంలో ఒకరు ప్రాణం కోల్పోయారు. కౌటాలలో హోలీ వేడుకల్లో కేరింతలు కొట్టి సరదా కోసం తాటిపెల్లి వార్దా నదిలో ఈతకు వెళ్లి నలుగురు యువకులు చనిపోయారు. నదీమాబాద్‌కు చెందిన పనాస కమలాకర్, ఉప్పుల సంతోష్, ఎలుములె ప్రవీణ్, ఆలం సాయి, నవీన్, సంతోష్ మొత్తం ఆరుగురు మిత్రులు రంగులు చల్లుకుని హోలీ ఆడారు. ఆ తర్వాత స్నానం చేసేందుకు మండలంలోని తాటిపెల్లి గ్రామ సమీపంలో ఉన్న వార్దా నదికి వెళ్లారు. అక్కడికి వెళ్లగానే నవీన్‌కు ఇంటి నుంచి ఫోన్ రావడంతో మళ్లీ వస్తానని కౌటాలకు వచ్చాడు. మిగతా ఐదుగురిలో పనాస కమలాకర్(23) ఉప్పుల సంతోష్(22), ఎలుములె ప్రవీణ్(23), ఆలం సాయి(20) నీటిలోకి దిగారు. సంతోష్ బయట వస్తువులు, బట్టల వద్ద కాపలాగా ...11లో

ప్రయివేటు కోచింగ్ సెంటర్లు..

డమ్మీ పాఠశాలలు

ప్రోత్సహిస్తున్న ఎన్సీఈఆర్టీ



- తగ్గించిన సిలబస్‌ను పునరుద్ధరించని వైనం
- పోటీ పరీక్షలకు సన్నద్ధం కాలేకపోతున్న విద్యార్థులు

న్యూఢిల్లీ : విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్సీఈఆర్టీ తన చర్యల ద్వారా ప్రయివేటు కోచింగును, డమ్మీ పాఠశాలలను ప్రోత్సహిస్తోంది. కోచింగ్ దందాకు అడ్డుకట్ట వేయడానికి కేంద్రం చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఎన్సీఈఆర్టీ ఈ చర్యకు పూనుకోవడం విమర్శలకు దారితీస్తోంది. అంతేకాదు...సిలబస్ తగ్గింపుపై కూడా విద్యావేత్తల నుండి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్సీఈఆర్టీ రూపొందించిన పాఠ్య పుస్తకాలను సీబీఎస్ఈ, పదిహేను రాష్ట్రాలకు చెందిన పాఠశాలల బోర్డులు ఉపయోగిస్తున్నాయి. అయితే కోవిడ్ కష్టకాలంలో 9 నుండి 12వ తరగతి వరకూ పాఠ్య పుస్తకాల సిలబస్‌ను ఎన్సీఈఆర్టీ తగ్గించింది. మూడు సంవత్సరాలు గడిచినా దానిని ఇప్పటికీ పునరుద్ధరించలేదు. దీనిపై విద్యావేత్తలు పెదవి విరుస్తున్నారు.

సిలబస్ తగ్గించడంతో విద్యార్థులు కోచింగ్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎందుకంటే నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి పోటీ పరీక్షలకు హాజరు కావడానికి ఈ సిలబస్ సరిపోవడం లేదు. ఎన్సీఈఆర్టీ తీసుకుంటున్న ఈ చర్యలు ప్రయివేటు కోచింగులకు వ్యతిరేకంగా 2020 నాటి జాతీయ విద్యా విధానం తీసుకున్న వైఖరికి భిన్నంగా ఉన్నాయి. 2020లో మొత్తం సిలబస్‌ను ఎన్సీఈఆర్టీ 40% మేర తగ్గించింది. కోవిడ్ కారణంగా పాఠశాల విద్యకు ఆటంకం ఏర్పడడంతో విద్యార్థులపై భారం పడుతోందని, అందుకే సిలబస్‌ను తగ్గించామని అప్పుడు ఎన్సీఈఆర్టీ వివరణ ఇచ్చుకుంది. ప్రస్తుతం విద్యా సంస్థలన్నీ మామూలుగానే నడుస్తున్నప్పటికీ పాత సిలబస్‌ను మాత్రం ఎన్సీఈఆర్టీ పునరుద్ధరించలేదు.

వ్యూహాత్మక అడుగులు

సిలబస్ తగ్గింపులో కూడా బీజేపీ ప్రభుత్వం వ్యూహాత్మకంగానే వ్యవహరించిందన్న విమర్శలు వచ్చాయి. కాషాయ పార్టీ సిద్ధాంతాలకు దృష్టిలో పెట్టుకొని సిలబస్‌ను కుదించారు. మొఘలుల పాలన, అంతర్జాతీయ ఇస్లాం చరిత్ర, కుల వివక్ష చరిత్ర, మహాత్మా గాంధీ హత్యానంతరం ఆర్ఎస్ఎస్‌పై ...11లో

స్వేచ్ఛపై దాడి

- మేధావులు, రచయితలపై అసభ్యంగా ట్రోలింగ్
- మహిళలే టార్గెట్‌గా వేధింపులు :చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలు సంఘాలు, వేదికల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ ఆలోచనలు, అభిప్రాయాలను సమాజంతో పంచుకునే ప్రగతిశీల మేధావులు, రచయితలు, జర్నలిస్టులు, ఉద్యమకారులు, కళాకారులను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియా వేదికగా మతోన్మాద మూకలు దాడులకు పాల్పడుతున్నాయని ప్రజాస్వామిక సంస్థలు, వేదికలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు వారు సోమవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా మహిళలను టార్గెట్ చేస్తూ తమ అసహనాన్ని వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. దేశంలో ఏర్పడుతున్న మత, రాజకీయ పరిణామాల గురించి ఆలోచించడం, తమ భావాలను వ్యక్తపరచడం ఈ అప్రజాస్వామిక, సంప్రదాయ వాద మూకలకు నచ్చక దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. స్త్రీలు తమ ఇష్టాలకు అనుగుణంగా కట్టు, బొట్టు, వేష, భాష ధారణలు చేసినప్పుడల్లా ఈ అరాచకులు రంగంలోకి దిగి, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ బెదిరింపులకు పూనుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్రీలు వంటింటి కుందేళ్ళగానే జీవించాలనే వీరి ఆలోచనలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు వెల్లడించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ) ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యాన్ని హరించినట్టేనని పేర్కొన్నారు. ఫలాన విధంగా అభిప్రాయాలు వ్యక్తపరచకూడదనీ, ఫలానా విధంగానే బతకాలని శాసించడం రాజ్యాంగ విరుద్ధమని గుర్తు చేశారు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్న శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో లక్ష్మయ్య(పౌరహక్కుల సంఘం), జీవన్ కుమార్ (మానవ హక్కుల వేదిక), అరసవిల్లి కృష్ణ, రివేరా (విప్లవ రచయితలసంఘం, విజయ భండారు (హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరమ్), హైదరాబాద్ విమెన్ స్టడీ సర్కిల్, పసునూరి రవీందర్, కన్వీనర్ (సాముహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్) కె. శ్రీనివాసాచారి (హైదరాబాద్ హ్యూమనిస్ట్ మీట్) రేణుకా అయోల, తుముచర్ల రాజారాం - సంతకం సాహిత్యవేదిక, ఐకా బాలాజీ (మంచి సినిమా గ్రూపు), బి. గిరిజ (వాయిస్ ఫర్ జెండర్ జస్టిస్) కొండవీటి సత్యవతి (భూమిక), అనురాధ (రెయిన్ బో) అమరేంద్ర దాసరి (సాహితీవేదిక డిల్లీ), డా. బైరి నరేష్ జాతీయ అధ్యక్షుడు మూఢనమ్మకాల నిర్మూలన సంఘం, మహిళా, ట్రాన్స్ జండర్ల ఐక్య కార్యాచరణ వేదిక, ఖలీదా పర్వీన్, ఉష (సన్నిహిత), సంధ్య (పీవోడబ్ల్యూ) సజయ, సుమిత్ర (అంకురం), వంగపల్లి పద్మ (వాయస్ ఆఫ్ ద పీపుల్), వల్లభాపురం జనార్ధన, కె.ఆనందాచారి (తెలంగాణ సాహితి) అఫ్సర్, నారాయణ స్వామి, విమల, ప్రసాదమూర్తి, ఘంటశాల నిర్మల, అరణ్య కృష్ణ, అరసవిల్లి కృష్ణ, వెంకటకృష్ణ, దొంతాల చరణ్, నరేష్ సూఫీ, అరుణాంక్ లత, ఓల్గా, అక్కినేని కుటుంబరావు, పి .సత్యవతి, ఉదయమిత్ర, ఎ.కే ప్రభాకర్, నల్లూరి రుక్మిణి, తేళ్ళ అరుణ, అపర్ణ తోట, శివ లక్ష్మి , భండారు విజయ, సుహాసిని, కత్తి పద్మ, మెర్సీ మార్గరేట్, అమరవాది నీరజ, గుత్తా జ్యోస్న, చల్ల సరోజినీ దేవి, బెల్లం అనురాధ, జయంతి, చలం జీ.ఎస్, దుర్గా డింగరి, తులసి చందు, పైడిమర్రి గిరిజ, జయలక్ష్మి, రాజ్యలక్ష్మి శ్రీదేవి, గీతాంజలి,నాంపల్లి సుజాత, కాత్యాయిని కె, సంధ్య కె, వివి జ్యోతి, రూపారుక్మిణి, సురేఖ, శీలా సుభద్రా దేవి, శిలాలోలిత, ఆశాలత, అంబిక, రత్నా సుమతి, రుక్మిణీ రావు, మీరా సంఘమిత్ర, రచన, వైజయంతి, ఇందిర, జహాఆరా, వసుధ, కల్పనా కన్నాబిరాన్, హేమలలిత, సావిత్రి కోల, కన్నెగంటి రవి(రైతు స్వరాజ్యవేదిక) , మానస ఎండ్లూరి, కష్టకుమారి, ఝాన్సీ, అనసూయ, సుజాత తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ పాలన అంటే హిందూవులపై దాడులా: వీహెచ్‌పీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇందిరమ్మ పాలన అంటే హిందూవులపై దాడులు చేయడమేనా అని వీహెచ్‌పీ ప్రశ్నించింది. ఈ మేరకు సోమవారం వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, సహాయ కార్యదర్శి భానుప్రసాద్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఒక ప్రకటన విడుదల చేశారు. పిట్టల బస్తీని ఖాళీ చేయించేందుకు పథకం ప్రకారమే దాడులు జరిగాయని ఆరోపించారు. గర్భిణీలపై దాడులు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. దాడులకు పాల్పడిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. బాధితులను వీహెచ్‌పీ బృందం పరామర్శించిందని తెలిపారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో ముగ్గురిని.. హత్య చేసిన మావోయిస్టులు

- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులను ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు పట్టపగలు హత్య చేశారు. బాసగూడ క్యాంపు నుంచి 100 మీటర్ల దూరంలో సోమవారం ఈ ఘటన జరిగింది. బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాసగూడకు చెందిన చంద్రియా మోడియం, అశోక్ భండారీ, కారం రమేష్‌ను ఇన్‌ఫార్మర్లుగా భావించిన మావోయిస్టులు.. వీరిపై గొడ్డలితో దాడి చేశారు. వారిలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించారు. విచారణ అనంతరం పూర్తి సమాచారం అందిస్తామని ఎస్పీ తెలిపారు. ఇది ఇలా ఉండగా, బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు ఒక పోలీస్ కానిస్టేబుల్‌పై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. అతన్ని బీజాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నిషేధిక 'అల్ప్రాజోలం' పట్టివేత

- కొత్తూరులో ఎస్‌ఓటీ పోలీసుల దాడులు
- రూ.13 లక్షల విలువ చేసే మత్తుమందుతో పాటు మూడు సెల్‌ఫోన్లు, ఒక కారు స్వాధీనం



నవతెలంగాణ-కొత్తూరు

మత్తు కోసం కల్లులో కలిపే నిషేధిత ఆల్ప్రాజోలం మందును రాష్ట్రమంతా సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురు వ్యక్తులను రంగారెడ్డి జిల్లా కొత్తూరు పట్టణ కేంద్రంలో ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. కొత్తూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం వెలికిచర్ల గ్రామానికి చెందిన అనిల్‌గౌడ్, మహబూబ్‌నగర్ పట్టణ ప్రాంతానికి చెందిన సుధాకర్, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం నేరేళ్లపల్లి గ్రామానికి చెందిన శరత్ బాబు ఓ ముఠాగా ఏర్పడి అక్రమ సంపాదనే ధ్యేయంగా నిషేధిక ఆల్ప్రాజోలంను రాష్ట్రమంతా తిరుగుతూ రవాణా చేస్తున్నారు. కాగా, వీరు సోమవారం కొత్తూరు పట్టణ కేంద్రంలోని విజయలక్ష్మి ఇండస్ట్రియల్ ఏరియా నందు నిషేధిత ఆల్ప్రాజోలంను తరలిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి సుమారు కేజీ విలువచేసే మత్తుమందును స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ. 13 లక్షలు ఉంటుందని అంచనా. అలాగే మూడు సెల్‌ఫోన్లు, నిందితులు ఉపయోగిస్తున్న కారును స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. లుగా గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి విచారించగా నాగర్‌కర్నూల్, జడ్చర్ల, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో సరఫరా చేస్తున్నట్టు ఒప్పుకున్నారు. తదుపరి విచారణ జరుగుతున్నట్టు కొత్తూరు సీఐ నరసింహారావు తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో

ముగ్గురు అధికారుల కస్టడీ కోసం స్పెషల్ టీమ్ నేడు పిటిషన్

- సాఫ్ట్‌వేర్ టెక్నికల్ నిపుణుడు రవిపాల్ పాత్ర పైనా లోతుగా ఆరా
- క్యాన్సర్ వైద్యం కోసం అమెరికా వెళ్లానంటూ ప్రభాకర్‌రావు సమాచారం
- ప్రభాకర్‌రావు విచారణ తర్వాతే పొలిటికల్ పెద్దల హస్తంపై ప్రత్యేక బృందం దృష్టి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో సంచలనం రేపిన ప్రతిపక్ష రాజకీయ ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన ముగ్గురు పోలీసు అధికారులను కస్టడీలోకి తీసుకొని విచారించటానికి మంగళవారం ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు నాంపల్లి కోర్టులో పిటిషన్ వేయనున్నారు. రెండ్రోజుల క్రితం ఈ కేసులో అరెస్ట్ చేసిన మహబూబాబాద్ అదనపు ఎస్పీ బుజంగరావు, ఎస్ఐబీ అదనపు ఎస్పీ తిరుపతన్నలతో పాటు ఇప్పటికే వారం రోజుల పాటు విచారణ జరిపిన డీఎస్పీ ప్రణీత్‌రావులను కలిపి విచారించటం కోసం కస్టడీ పిటిషన్ వేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటి వరకు జరిపిన విచారణలో ఈ ముగ్గురు అధికారులు గత ఎన్నికల్లో ప్రతిపక్షానికి చెందిన రాజకీయ ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్‌లు చేయటంతో పాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, బంగారు నగల వ్యాపారులతో పాటు మరికొందరు ప్రయివేటు వ్యక్తుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసి, వారవిని బెదిరించినట్టు కూడా వెలుగు చూసింది. ముఖ్యంగా, 36 మందికి పైగా బంగారు నగల వ్యాపారులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ఫోన్లను ట్యాపింగ్ చేసి, వాటిని సదరు వ్యాపారులకు వినిపించి మరీ బ్లాక్‌మెయిల్ చేసి భారీ మొత్తంలో డబ్బులను దండుకున్నారని తెలుస్తున్నది. ఈ బ్లాక్‌మెయిలింగ్ ద్వారా అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీకి భారీ మొత్తంలో నిధులను కూడా వ్యాపారుల నుంచి సమీకరించారని కూడా ప్రత్యేక బృందం దర్యాప్తులో వెల్లడైనట్టు తేలింది. ఈ విషయంలో కొందరు అప్పటి ప్రభుత్వ బీఆర్ఎస్ ప్రముఖుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వీరు నడుచుకున్నారని తెలిసింది.

ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని విదేశాల నుంచి తేవటంలో రవిపాల్ అనే ప్రయివేటు



సాఫ్ట్‌వేర్ సాంకేతిక నిపుణుడు అప్పటి ఎస్ఐబీ ఐజీ ప్రభాకర్‌రావుకు సహకరించినట్టు విచారణలో వెలుగు చూసింది. సాఫ్ట్‌వేర్ నిపుణుడైన రవిపాల్ ప్రభుత్వ సెక్యూరిటీ విభాగాలకు కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే, ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన ఈ పరికరాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియకుండా వీరు రాష్ట్రానికి ఇజ్రాయెల్ నుంచి ఎలా తీసుకొచ్చారనే కోణంలో కూడా స్పెషల్ టీమ్ దర్యాప్తు సాగిస్తున్నది. ఈ పరికరాల కొనుగోలుకు అవసరమైన కోట్ల రూపాయలను ఎస్ఐబీ ఇంటెలిజెన్స్ విభాగం సమకూర్చిందా? లేక అప్పటి ప్రభుత్వానికి చెందిన కొందరు రాజకీయ ప్రముఖులు ఆ భారాన్ని భరించారా? లేక ఈ అధికారులు ఇతర మార్గాలను అన్వేషించారా? అనే కోణంలో కూడా సీరియస్‌గా దర్యాప్తును సాగిస్తున్నారు. ఈ విషయంలో మరిన్ని వివరాలను రాబట్టటానికి రవిపాల్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించటానికి స్పెషల్ టీమ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా, ప్రణీత్‌రావు, బుజంగరావు, తిరుపతన్నలను తిరిగి విచారించటం ద్వారా వారు జరిపిన ఫోన్‌ట్యాపింగ్ అకృత్యాలపై మరింత సమాచారం రాబట్టటానికి అధికారులు సిద్ధమవుతున్నారని సమాచారం.ఇదిలాఉంటే, ప్రణీత్‌రావు ధ్వంసం చేసిన పదిహేడు కంప్యూటర్ల హార్డ్ డిస్క్‌లను నాగోల్ వద్ద మూసీ నది పరివాహక ప్రాంతం నుంచి స్వాధీనపర్చుకున్న అధికారులు.. వాటి నుంచి మరిన్ని ఆధారాలను సేకరించటానికి ప్రయత్నం చేస్తున్నారు. హార్డ్ డిస్క్‌లు ధ్వంసం కావటం వల్ల కొత్తగా సమాచారాన్ని రాబట్టటం కష్టమే అయినా.. వీరు అక్రమంగా ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడినట్టు హార్డ్‌డిస్క్‌లపై ఉండే పాస్‌వర్డ్‌లు కీలకమైన ఆధారాలుగా మారాయని ఒక పోలీసు ఉన్నతాధికారి తెలిపారుఈ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ ఐజీ ప్రభాకర్‌రావును భారత్‌కు తీసుకురావటానికి అధికారులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మరోవైపు, తనకున్న క్యాన్సర్ వ్యాధికి చికిత్స కోసం అమెరికాకు వచ్చాననీ, జూన్, జులైలో తాను హైదరాబాద్‌కు వస్తానంటూ ప్రభాకర్‌రావు హైదరాబాద్‌లో ఒక పోలీసు ఉన్నతాధికారికి సమాచారమందించినట్టు తెలుస్తున్నది. అయితే, ఈ సమాచారాన్ని కేసు దర్యాప్తు జరుపుతున్న అధికారులు ధృవీకరించటం లేదు.



ఈ పోలీసు అధికారుల ద్వారా ఫోన్‌ట్యాపింగ్‌లకు గురైన బాధిత నగల వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులలో ఎవరైనా ఫిర్యాదు చేయటానికి వస్తే వాటిని తీసుకొని విచారించటానికి తాము సిద్ధంగా ఉన్నామని ఒక పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. కాగా, ఈ ఫోన్ ట్యాపింగ్‌ల వెనక అప్పటి ప్రభుత్వానికి చెందిన కొందరు పెద్దల హస్తముందనే ఆరోపణలపై దర్యాప్తు అధికారులు ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా, ఆ ప్రముఖులు ఎవరనే విషయమై ఇప్పటి వరకు జరిపిన దర్యాప్తులో కొన్ని వివరాలు బయటపడినప్పటికీ.. ఈ విషయంలో తొందరపడకుండా పూర్తి ఆధారాలు సేకరించి చర్యలకు దిగాలని స్పెషల్ టీం అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ప్రభాకర్‌రావు, మరో మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులను అదుపులోకి తీసుకొని విచారించిన తర్వాతే అప్పటి రాజకీయ పెద్దల పాత్రపై కార్యాచరణకు దిగటం మంచిదని దర్యాప్తు అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది.

ఓట్ల వేట

గంపగుత్త ఓట్ల కోసం బేరసారాలు

- కాలనీలు, డివిజన్ల నాయకులతో అభ్యర్థుల సమావేశాలు
- మొదటి దఫా ప్రచారంలోనే మద్దతు కూడగట్టుకోవడంలో నిమగ్నం
- క్షేత్ర స్థాయి పర్యటనలో 'మల్కాజిగిరి' అభ్యర్థులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగే అభ్యర్థులను ప్రకటించిన ప్రధాన పార్టీలు.. ఇక ఓట్ల వేట కోసం ప్రణాళికలు రచిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే బీజేపీ అభ్యర్థిని ప్రకటించగా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఇటీవలే అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో వీరు ప్రజా క్షేత్రంలోకి వెళ్తున్నారు. గెలుపు కోసం ఇప్పటి నుంచే తంటాలు పడుతున్నారు. మొదటి దఫా ప్రచారంలో గంపగుత్తగా ఓట్లు సాధించే అంశాలపై దృష్టి సారించారు. అన్ని నియోజకవర్గాలు, మండలాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో పర్యటనలు చేస్తున్నారు. ఎన్నికల్లో కీలకమైన నేతలను, ఆయా సంఘాల నాయకులను కలుస్తున్నారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పార్టీ ఇన్‌చార్జీలు, కీలక ప్రజాప్రతినిధులతో వరుస భేటీ అవుతున్నారు.

చేరికలపై ప్రయత్నాలు

బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఆరు గ్యారంటీలు, వంద రోజుల పాలనపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ అభ్యర్థి సునితా మహేందర్‌రెడ్డి సమావేశాల పేరిట ముఖ్య నేతలను కలుసుకుంటూనే నియోజకవర్గం మొత్తం చుట్టేస్తున్నారు. ప్రధాని మోడీ చరిష్మాపై ఆధారపడిన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మార్నింగ్ వాక్, కాలనీలు, డివిజన్లు, ముఖ్యమైన ప్రాంతాల్లో పర్యటిస్తూ మద్దతు కూడగట్టుకునే పనిలో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కూడా సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుస్తూ నియోజకవర్గంలోని ఆయా కాలనీల నేతలతో సమావేశమవుతున్నారు.

మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు నవీన్‌రావు, శంభీపూర్ రాజును ఒక విడత కలిశారు. మండలాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. మరోవైపు ఆయా నియోజకవర్గాల్లో కుల సంఘాల నాయకులతో మమేకం అవుతున్నారు. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆయా తరగతులు, సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కంటోన్మెంట్ తదితర చోట్ల అభ్యర్థులు సన్మానం, చేరికల కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

భిన్న 'ఎన్నికల' వాతావరణం

లోక్‌సభ ఎన్నికలు అసెంబ్లీ ఎలక్షన్స్‌కు భిన్నంగా ఉంటాయి. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి తక్కువగా ఉండటంతో అభ్యర్థులు ఓటర్లను ప్రత్యక్షంగా కలిసేందుకు వీలుండేది. ఇంటింటికీ తిరిగి నేరుగా ఓటర్లతో మమేకం అవుతుంటారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇలా ప్రచారం చేయడానికి వీలు పడదు. లోక్‌సభ నియోజకవర్గం పరిధి విస్తృతంగా ఉంటుంది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం మేడ్చల్-మల్కాజిగిరి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఈ నేపథ్యంలో ఓటర్లను ప్రత్యక్షంగా కలవడం సాధ్యం కాదు. దీంతో గంపగుత్త ఓట్లు సాధించడం కోసం అభ్యర్థులు ప్రత్యేక దృష్టి పెట్టారు. మండలాలు, కాలనీల ముఖ్య నేతలతో సమావేశమై ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

రేపటి నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ

- ఫీజు పెంపుపై అభ్యర్థుల ఆగ్రహం
- తగ్గింపుపై నేడు విద్యాశాఖ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో బుధవారం నుంచి ప్రారంభం కానుంది. వాటి సమర్పణకు తుది గడువు వచ్చేనెల పదో తేదీ వరకు ఉన్నది. ఈనెల 22న టెట్ పూర్తిస్థాయి నోటిఫికేషన్‌ను విద్యాశాఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే టెట్ దరఖాస్తు ఫీజును భారీగా పెంచడం పట్ల అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక పేపర్ రాస్తే రూ.వెయ్యి, రెండు రాయాలనుకుంటే రూ.రెండు వేలు చెల్లించాలని విద్యాశాఖ ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. గతంలో ఒక పేపర్‌కు రూ.200, రెండు పేపర్లు రాస్తే రూ.300 ఉన్నదాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. టెట్ దరఖాస్తు ఫీజును పెంచడాన్ని విద్యార్థి, యువజన సంఘాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి.

ఈ నిర్ణయాన్ని పునరాలోచన చేసి నిరుద్యోగ అభ్యర్థులపై భారం లేకుండా చూడాలని కోరుతున్నాయి. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి పలువురు అభ్యర్థులతోపాటు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు తీసుకెళ్లారు. దీంతో టెట్ దరఖాస్తు ఫీజుపై పునరాలోచన చేసి తగ్గించాలని విద్యాశాఖ అధికారులను సీఎం ఆదేశించినట్టు సమాచారం. అందులో భాగంగానే మంగళవారం దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిసింది. ఇప్పటికే ఈ దిశగా విద్యాశాఖ అధికారులు సమాలోచన చేస్తున్నట్టు సమాచారం. మే 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఫీజు తగ్గించాకే దరఖాస్తులను స్వీకరించాలి : డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించిన తర్వాతే దరఖాస్తులను స్వీకరించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఉన్నట్టుగానే దరఖాస్తు ఫీజు పేపర్‌కు రూ.200 నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాతపరీక్షలకు ఫీజులుండబోవని ప్రకటించి టెట్ ఒక పేపర్‌కు రూ.వెయ్యి నిర్ణయించడం అభ్యర్థులను మోసం చేయడమేనని విమర్శించారు. ఫీజును భారీగా పెంచిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గోదావరిలో క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం

- మిషన్ భగీరథ ఇంటెక్ వెల్ వద్ద మూడు అడుగులు తగ్గితే నీటి ఎద్దడే
- ప్రస్తుతం 48.8గా ఉన్న నీటిమట్టం



నవతెలంగాణ-అశ్వాపురం

వేసవి సమీపిస్తుండటంతో గోదావరిలో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారి పల్లి పంచాయతీ, కుమ్మరిగూడెం ఆనకట్ట సమీపంలో గోదావరి నదిపై నిర్మించిన మిషన్ భగీరథ ఇంటెక్ వెల్ వద్ద క్రమంగా గోదావరి నీటిమట్టం తగ్గుతోంది. దాంతో ఏప్రిల్, మే నెలలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీటికి కొరత ఉండొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఇంటెక్ వెల్ వద్ద 48.8 మీటర్ల మేరకు నీటి నిల్వలున్నాయి. మరో 3 అడుగులు తగ్గితే మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతుందన్న అంచనాలో సంబంధిత అధికారులు ఉన్నారు. ఈ గోదావరి నదిపై నిర్మించిన మిషన్ భగీరథ పంప్ హౌస్ ద్వారా తొలుత రథం గుట్ట దగ్గర ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్ల వద్ద శుద్ధి చేసిన నీటిని పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని 345 గ్రామాలకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం 2.70 కోట్ల లీటర్ల తాగునీటిని అందిస్తున్నారు. అదేవిధంగా ఇదే గోదావరి నుంచి పైపు లైన్ ద్వారా పాల్వంచ మండలంలోని తోగూడెం గుట్ట వరకు పంపింగ్ చేసి అక్కడ ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్ల వద్ద నీటిని ప్యూరిఫైడ్ చేసి మరో 19 మండలాలకు తాగినీటిని సరవరా చేస్తున్నారు. కుమ్మరిగూడెం గ్రామ సమీపంలోని ఆనకట్ట ఎగువ భాగంలో నిర్మించిన ఈ ఇన్‌టెక్ వెల్ నుంచి మొత్తం ఉమ్మడి జిల్లాలోని 26 మండలాలకు ప్రతిరోజూ 14 కోట్ల లీటర్ల తాగునీటిని గోదావరి జలాల ద్వారా తరలిస్తున్నారు.

ఏప్రిల్, మే నెలలో నీటికి కటకటేనా..?


ప్రస్తుతం గోదావరిలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ రానున్న కాలంలో ఈ గోదావరి పర్ణశాల వైపు ఒకటి, కుమ్మరిగూడెం వైపు మరొకటి రెండు పాయలుగా చీలితే ఏప్రిల్, మే నెలలో మిషన్ భగీరథ నీటి సరవరాకు కటకట ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టుల ద్వారా నీరు విడుదల కానట్లయితే ఈ భగీరథ నీటి సరఫరా పరిధిలో ఉన్న వేలాది గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. అయితే అధికారులు మాత్రం మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేసే తాగునీటికి ఎటువంటి ఆటంకం కలగకుండా స్థానిక అధికారులు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదికలు పంపుతున్నట్టు తెలుస్తోంది.

నీటి నిల్వలు తగ్గితే భారజలానికి ముప్పే

గోదావరి పాయలుగా చీలి కుమ్మరిగూడెం వైపు నీటిపారుదల తగ్గితే మిషన్ భగీరథతో పాటు బారజల కర్మాగారానికి నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలున్నాయి. గతంలోనూ గోదావరిలో నీళ్ల పూర్తిగా అడుగంటి పోవడంతో హెవీ వాటర్ ప్లాంట్ నిలిచిపోయిన సందర్భాలున్నాయి.

గురుకాశీ యూనివర్సిటీ(బటిన్డా పంజాబ్)లో మెరుగైన విద్య

- అందుబాటులో అగ్రికల్చర్ బీఎస్సీ సీట్లు
- దేశంలోనే ప్రత్యేక గుర్తింపు మా సొంతం
- మాస్ట్రో డైనామిక్ (సిరి టవర్స్ అమీర్‌పేట) సీఈఓ వీఎస్ భావన్‌రెడ్డి ఈశ్వరవక



నవతెలంగాణ-హైదరాబాద్

గురుకాశీ యూనివర్సిటీ(బటిన్డా పంజాబ్)లో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తు న్నామని మాస్ట్రో డైనామిక్ సీఈఓ వీఎస్ భావన్‌రెడ్డి ఈశ్వరవక తెలిపారు. మాస్ట్రో డైనామిక్ సౌత్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులు గురుకాశీ యూనివర్సిటీలో సీట్లు పొందవచ్చని చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 200 ఎకరాల్లో ఈ యూనివర్సిటీ క్యాంపస్ ఉందన్నారు. బీఎస్సీ అగ్రికల్చర్‌లో అడ్మిషన్స్ జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో అగ్రికల్చర్‌కు సంబంధించిన సుమారు 150 కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇందులో ముఖ్యంగా వ్యవసాయ విద్య, టెక్నికల్ ఎడ్యుకేషన్ అందుబాటులో ఉందన్నారు. బయో కంప్యూటర్ సైన్స్, బయో టెక్నాలజీ, పెట్రోలియం, ఇంజనీరింగ్, మెడికల్ రంగంలో నర్సింగ్, పారా మెడికల్, ఫీజియోథెరపీ, ఇవే కాకుండా లా, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ కాలేజీ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎంతో మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. పర్సంటేజ్ బాగున్న వారికి ప్రత్యేక స్కాలర్‌షిప్ అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ యూనివర్సిటీకి ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు ఉన్నా యని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆసక్తి గల విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని కోరారు. పూర్తి వివరాలకు 9573314444 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

లాస్య హత్య నిందితులను.. వెంటనే శిక్షించాలి

- ఐద్వా నిజామాబాద్ జిల్లా కమిటీ డిమాండ్




నవతెలంగాణ-ఆర్మూర్

లాస్యపై లైంగికదాడి చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన లాస్య కుటుంబాన్ని సోమవారం నిజామాబాద్ జిల్లా ఐద్వా నాయకులు పరామర్శించారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. హత్య చేసిన నిందితుడు.. హత్య జరిగి మూడు రోజుల్లో అవుతున్నా ఇప్పటివరకు నిందితుల ఆచూకీ దొరకకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తన ఐ ఫోన్‌తో పాటు హత్యకు ఉపయోగించిన చాకును ఘటనా స్థలంలోనే వదిలినప్పటికీ ఇప్పటికీ నిందితుడిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు.

లాస్యకు ఎనిమిది నెలల పాప కూడా ఉందని, కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్టు తెలిపారు. మహిళలకు ఇంట్లో కూడా రక్షణ లేని పరిస్థితి నేటి ఆధునిక సమాజంలో ఉందని, ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ అవి కొంతమందికి చుట్టాలుగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుండగులకు గుణపాఠం చెప్పే విధంగా పోలీస్ వ్యవస్థ ప్రత్యేక దృష్టి పెట్టి నిందితులను అదుపులో తీసుకొని లాస్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే న్యాయం జరిగే వరకు ఆందోళనలు చేపడతామని స్పష్టంచేశారు. పరామర్శించిన వారిలో పట్టణ అధ్యక్షురాలు అరుణ జ్యోతి, స్వప్న తదితరులు ఉన్నారు.

హున్సాలో ఉత్కంఠగా పిడిగుద్దులాట

- ఉపిరి బిగపట్టి తిలకించిన జనం



నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలోని హున్సాలో ప్రతేడాది హోలీ వేడుకల్లో భాగంగా పిడిగుద్దులాట సోమవారం సైతం ఉత్కంఠగా సాగింది. గ్రామం నడిబొడ్డున రెండు దుంగలను ఏర్పాటు చేసి తాడును కట్టారు. గ్రామస్తులు రెండు గ్రూపులుగా విడిపోయి తాడుకు ఇరువైపులా చేరుకున్నారు. సమయం సోమవారం సాయంత్రం ఆరు గంటలు కాగానే ఒకరిపై ఒకరు ఒక్కసారిగా పిడిగుద్దుల వర్షం కురిపించారు. ఒక చేత్తో తాడును పట్టుకొని మరో చేత్తో హోరాహోరీగా గుద్దుకున్నారు. పది నిమిషాలు కాగానే అందరూ శాంతించి ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. పిడిగుద్దులాటను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.



మహిళల భద్రతకు ప్రాధాన్యత

విద్వేష రాజకీయాలను విద్యార్థులు తిప్పికొట్టారు

వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం : జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ధనంజయ్

న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థి సంఘానికి జరిగిన ఎన్నికల్లో వామపక్ష కూటమి క్లీన్‌స్వీప్ చేసిన విషయం తెలిసిందే. సెంట్రల్ ప్యానల్‌లోని మొత్తం నాలుగు స్థానాలూ ఈ కూటమికే దక్కాయి. అధ్యక్ష పదవిని గెలుచుకున్న ధనంజయ్ బీహార్‌లోని గయకు చెందిన వారు. 1996-97లో గెలుపొందిన బట్టీలాల్ బైర్వా తర్వాత వామపక్ష కూటమి నుంచి విజయం సాధించిన తొలి దళిత అధ్యక్షుడు ఆయనే. జేఎన్‌యూ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నికైన ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) నేత ధనంజయ్ పీటీఐ వార్తా సంస్థతో ముచ్చటించారు. ఈ విజయం జేఎన్‌యూ విద్యార్థులు ఇచ్చిన తీర్పు అని ఆయన వ్యాఖ్యానించారు. విద్వేష, హింస రాజకీయాలను విద్యార్థులు తిరస్కరించారని చెప్పారు. వారు తమపై మరోసారి విశ్వాసాన్ని ఉంచారని, దానిని నిలబెట్టుకుంటామని, వారి హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని, విద్యార్థులకు సంబంధించిన అంశాలపై కృషి చేస్తామని తెలిపారు.

'క్యాంపస్‌లో మహిళల భద్రత, నిధుల కోత, స్కాలర్‌షిప్పుల పెంపు, మౌలిక సదుపాయాలు, నీటి సంక్షోభం వంటి అంశాలకు విద్యార్థి సంఘం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. ఆయా సమస్యల పరిష్కారానికి ముందుగా చర్యలు చేపడతాం' అని ధనంజయ్ చెప్పారు. కాగా లాల్ సలామ్, జై భీమ్ నినాదాల మధ్య విజేతలైన నేతలను మద్దతుదారులు అభినందించారు. తాము బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడంతో ఆనందంతో ఎరుపు, తెలుపు, నీలం పతాకాలను ఎగరేశారు. ఎస్ఎఫ్ఐకి చెందిన అవిజిత్ ఘోష్ ఉపాధ్యక్షుడుగా, వామపక్ష కూటమి మద్దతుతో పోటీ చేసిన బిర్సా అంబేద్కర్ పూలే స్టూడెంట్స్ యూనియన్ (బాప్సా) అభ్యర్థి ప్రియన్షి ఆర్యా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన వామపక్ష కూటమి అభ్యర్థి స్వాతి సింగ్ నామినేషన్‌ను ఎన్నికల కమిటీ రద్దు చేయడంతో ఆ కూటమి బాప్సా అభ్యర్థి ఆర్యకు మద్దతు ప్రకటించింది. సంయుక్త కార్యదర్శి పదవిని లెఫ్ట్ అభ్యర్థి మహమ్మద్ సాజిత్ గెలుచుకున్నారు.

ఈ విజయంతో జేఎన్‌యూ వామపక్షాలకు కంచుకోట అని మరోసారి రుజువైంది. కౌంటింగ్ ప్రారంభంలో వామపక్ష కూటమికి, బీజేపీ అనుబంధ ఏబీవీపీకి మధ్య హోరాహోరీ పోరు సాగింది. సెంట్రల్ ప్యానల్‌లోని నాలుగు పదవుల్లోనూ ఏబీవీపీ అభ్యర్థులే ఆధిక్యత కనబరిచారు. అయితే ఆ తర్వాతి రౌండ్లలో వామపక్ష కూటమి పుంజుకొని విజయభేరి మోగించింది. యునైటెడ్ లెఫ్ట్ ప్యానల్‌లో ఏఐఎస్ఏ, డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ భాగస్వాములుగా ఉన్నాయి. గత 12 సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా ఈ ఎన్నికల్లో 73శాతం ఓట్లు పోలయ్యాయి. 2019లో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐకి చెందిన అయిష్ ఘోష్ అధ్యక్షుడుగా విజయం సాధించిన విషయం తెలిసిందే.

వీడని మిస్టరీ

నష్టాలు వచ్చినా విరాళాలు ఎలా ఇచ్చారు?

- దాడులు చేసిన తర్వాతే బాండ్లు ఎందుకు కొన్నారు?
- కాంట్రాక్టుల కోసమే నజరానాలు ముట్టచెప్పారా?
- దర్యాప్తు జరిపించాలని కోరుతున్న విశ్లేషకులు



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తొలుత ఎస్‌బీఐ, ఆ తర్వాత ఎన్నికల కమిషన్ అందజేసిన సమాచారం ప్రధాన రాజకీయ పార్టీల ఖాతాల్లో చేరిన విరాళాలకు సంబంధించి అనైతిక ఉద్దేశాలను బయటపెట్టింది. ఈ సమాచారం ప్రజలకు బహిర్గతం చేయడం అవసరమే. అయితే ఈ వివరాలు అవినీతి, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. దీనిపై మరింత విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాంటి విచారణను పర్యవేక్షించాల్సిన బాధ్యత సుప్రీంకోర్టు పైనే ఉంది. అది కూడా సాధ్యమైనంత త్వరగా జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రధానంగా ఏడు అంశాలపై విచారణ జరిపి, తదుపరి చర్యలకు ఉపక్రమించాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నష్టాల ఊబిలో ఉన్నా...

నష్టాలు మూటకట్టుకున్న కంపెనీలు ఎన్నికల బాండ్ల కొనుగోలు ద్వారా పెద్ద ఎత్తున రాజకీయ పార్టీలకు విరాళాలు అందించాయి. కొన్ని కంపెనీలు అయితే తాము ఆర్జించిన లాభాలకు అనేక రెట్లు ఎక్కువగా విరాళాలు ముట్టచెప్పాయి. 2013వ సంవత్సరపు కంపెనీల చట్టానికి, ఫైనాన్స్ చట్టానికి ప్రభుత్వం చేసిన కొన్ని సవరణలు ఈ తరహా విరాళాలకు గేట్లు తెరిచాయి. ఇలాంటి విరాళాలు రాజ్యాంగ విరుద్ధం. రాజకీయ విరాళాలు అందించడానికి వీలుగా షెల్ కంపెనీలను దుర్వినియోగం చేశారు. ఇది ఆయా కంపెనీల వాటాదారులను మోసం చేయడమే అవుతుంది.

కొత్త కంపెనీలు కూడా...

ఇలాంటి కంపెనీలే కాదు...కొత్తగా ఏర్పడిన కంపెనీలు, కొద్ది నెలల క్రితం మాత్రమే ఏర్పడిన కంపెనీలు కూడా ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ విరాళాలు సమర్పించుకున్నాయి. ఉదాహరణకు 2018లో లేదా ఆ తర్వాత ఆవిర్భవించిన 43 కంపెనీలు కొద్ది కాలానికే రూ.384.5 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశాయి. వీటిలో నాలుగు కంపెనీలు గత సంవత్సరమే హైదరాబాదులో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత కొద్ది నెలల వ్యవధిలోనే కోట్లాది రూపాయల విలువ కలిగిన బాండ్లను కొన్నాయి. కోవిడ్ కష్టకాలంలో అంటే 2020లో 9, 2021లో 11 కంపెనీలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత ఒకటి రెండు సంవత్సరాలకే సుమారు రూ.100 కోట్ల బాండ్లు కొనుగోలు చేశాయి. కేవలం రాజకీయ పార్టీలకు విరాళాలు అందించడానికే ఇవి ఏర్పడ్డాయా లేదా అనే దానిపై విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

దాడుల తర్వాత కొనుగోళ్లు

కొన్ని కంపెనీలు ఎన్నికల బాండ్లు కొనడానికి ముందో లేదా కొనుగోలు చేసిన తర్వాతో ప్రభుత్వ కాంట్రాక్టులు దక్కించుకున్నాయి. ఈ వ్యవహారం వెనుక క్విడ్‌ప్రోకో జరిగిందా లేదా అనే విషయంపై అవినీతి నిరోధక చట్టం కింద విచారణ జరపాల్సి ఉంది. కాగా ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థల దాడులు ఎదుర్కొన్న తర్వాతే కొన్ని కంపెనీలు ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చాయి. ఆయా కంపెనీలపై పెట్టిన కేసులు బాండ్లు కొనుగోలు చేసిన తర్వాత నిలిచిపోయాయి. కొన్ని కేసులను ఉపసంహరించుకోవడం కూడా జరిగింది. ఫిబ్రవరిలో జరిపిన ఓ దర్యాప్తు ప్రకారం ఈడీ, ఐటీ విచారణలు ఎదుర్కొన్న 30 కంపెనీలు బీజేపీకి రూ.335 కోట్ల విరాళం అందించాయని తేలింది. సందేహాస్పద కంపెనీలుగా ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) నిర్ధారించిన సంస్థలు పాలక పక్షానికి గణనీయమైన మొత్తంలో విరాళాలు అందజేశాయి. ఆ తర్వాత సందేహాస్పద కంపెనీల జాబితా నుండి వాటి పేర్లు అదృశ్యమయ్యాయి.

గడువు తీరినా సరే

ఆశ్చర్యకరమైన విషయమేమంటే గడువు తీరిన తర్వాత కూడా ఎన్నికల బాండ్లను ఓ పార్టీ నగదుగా మార్చుకుంది. కాలదోషం పట్టిన రూ.10 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను బీజేపీ సొమ్ము చేసుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం అధికారిక నిబంధనలను ఉల్లంఘించింది. 2018లో జరిగిన కర్నాటక శాసనసభ ఎన్నికలకు ముందు ఈ ఉదంతం చోటు చేసుకుంది.

ఈసీ పిల్లిమొగ్గలు

బాండ్ల విషయంలో ఎన్నికల కమిషన్ కూడా పిల్లిమొగ్గలు వేసింది. తొలుత ఈ పథకాన్ని తప్పుపట్టిన కమిషన్, ఆ తర్వాత అంతా బాగానే ఉందని కితాబు ఇచ్చింది. సుప్రీంకోర్టు చారిత్రక నిర్ణయాన్ని ప్రకటించిన తర్వాత కూడా ఈసీ మౌనం వహించింది.

ఎస్‌బీఐ తీరుపై అనుమానాలు

సుప్రీంకోర్టులో సీబీఐ చేసిన వాదనలపై కూడా విచారణ జరపాల్సిన అవసరం ఉంది. తన వద్ద మ్యాచింగ్ సమాచారం లేదని, సమాచారాన్ని అందించడానికి జూన్ 30వ తేదీ వరకూ గడువు ఇవ్వాలని ఎస్‌బీఐ వాదించింది. దేశంలోనే అతి పెద్దదైన ప్రభుత్వ రంగ బ్యాంక్ ఇలాంటి వాదనను ముందుకు తేవడం వెనుక ఉద్దేశమేమిటో తెలియాల్సి ఉంది. తన వద్ద ఉన్న సమాచారాన్ని ఎస్‌బీఐ ఎన్నికల కమిషన్‌కు అందజేయడానికి ముందు మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లవాసా లేవనెత్తిన ప్రశ్నలపై కూలంకషంగా విచారణ జరపాల్సి ఉంది. ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి ఎస్‌సీ గార్గ్ కూడా ఎస్‌బీఐ తీరుపై అనుమానాలు వ్యక్తం చేశారు. బ్యాంక్ చర్య చట్టవిరుద్ధమని, దానిని ఎవరూ ఊహించలేదని ఆయన చెప్పారు. సందేహాలు, అనుమానాలకు ఎస్‌బీఐ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.



త్రిపుర బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సీపీఐ(ఎం) ప్యానెల్ ఘన విజయం

అధికార బీజేపీ ప్యానెల్‌కు పరాభవం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



త్రిపుర బార్ అసోసియేషన్ ఎన్నికలలో సీపీఐ(ఎం) ప్యానెల్ ఘన విజయం సాధించింది. బీజేపీ ప్యానెల్ ఓటమి పాలైంది. సీపీఐ(ఎం), కాంగ్రెస్ కి చెందిన న్యాయవాదుల బృందం 'సంవిధాన్ బచావో మంచ్' (సేవ్ కాన్‌స్టిట్యూషన్ ఫోరమ్), అధికార బీజేపీ మద్దతుగల 'ఆంజీబీ ఉన్నయన్ మంచ్'ను ఓడించి విజయం సాధించిరిటర్నింగ్ అధికారి, సీనియర్ న్యాయవాది సందీప్ దత్తా చౌదరి పర్యవేక్షణలో గత ఎన్నికల్లో 416 మంది సభ్యులతో పోలిస్తే, ఈసారి 500 మంది సభ్యులతో జరిగాయి. బార్ అసోసియేషన్ ఎన్నికలకు 15 నామినేషన్లు సమర్పించగా నలుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత రిటర్నింగ్ అధికారి, న్యాయవాది సందీప్ దత్తా చౌదరి విలేకరులతో మాట్లాడుతూ "త్రిపుర బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా న్యాయవాదులు మృణాల్ కాంతి బిస్వాస్, సుబ్రతా దేబ్‌నాథ్, కౌశిక్ ఇందు ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా న్యాయవాదులు అమర్ దెబ్బర్మ, ఉత్పల్ దాస్ ఎన్నికయ్యారు. 500 మంది ఓటర్లలో 463 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు" అని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, న్యాయవాది సమీర్ రంజన్ బర్మన్, న్యాయవాది శంపా దాస్ తమ ఓటు హక్కును రిమోట్‌తో వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి సందీప్ దత్తా చౌదరి తెలిపారు. త్రిపుర ప్రతిపక్ష నేత, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి సేవ్ కాన్‌స్టిట్యూషన్ ఫోరమ్‌ను అభినందిస్తూ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. "త్రిపుర బార్ అసోసియేషన్ ఎలక్షన్-2024 ఎన్నికలలో ఘనవిజయం సాధించినందుకు సేవ్ కాన్స్టిట్యూషన్ ఫోరమ్‌కు నా హృదయపూర్వక అభినందనలు. ఇది కేవలం ఐదు వందల మంది న్యాయవాదుల ఎన్నికగా మాత్రమే కాదు, మన రాజ్యాంగ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేస్తున్న మన దేశ పాలక వ్యవస్థపై విపరీతమైన కోపంతో ఉన్న ప్రజానీకానికి ప్రతిబింబం" అని అన్నారు. బార్ అసోసియేషన్ ఎన్నికల తీర్పు లోక్‌సభ ఎన్నికలకు ముందు "సామాన్య ప్రజల సమిష్టి సంకల్పానికి నిర్ణయాత్మక సంకేతం" అని చౌదరి అన్నారు.

"ముందున్న కర్తవ్యం కేవలం కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి, కొత్త కార్యక్రమాలను అమలు చేయడానికి అభ్యర్థి/పార్టీకి ఓటు వేయడం మాత్రమే కాదు. రాజ్యాంగనిర్మాణం, దాని లౌకిక స్వరూపాన్ని, బహుళత్వాన్ని, ప్రజాస్వామ్య రాజకీయాలు, సమాఖ్యను కాపాడటం ఒక పౌరుని దేశభక్తి విధి. నిరంకుశ, మతోన్మాద, విభజన, విభజన శక్తులకు వ్యతిరేకంగా రానున్న రామ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలతో పాటు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో లౌకిక, ప్రజాతంత్ర శక్తుల భారీ విజయాలు సాధించేందుకు త్రిపురలోని సామాన్య ప్రజానీకాన్ని పునరుజ్జీవింపజేయడంలో ఈ ఫలితం ఖచ్చితంగా సహాయపడుతుంది" అని చౌదరి అన్నారు.



ఏమి సేతురా..!

బీజేపీని వెంటాడుతున్న బ్యాక్‌ఫుట్ భయం

- పోటీ చేయమంటున్న కొందరు
- ఏకంగా రాజకీయాల నుంచి నిష్క్రమిస్తున్న మరి కొందరు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయాల్లో శరవేగంగా మార్పులు వస్తున్నాయి. బీజేపీలో నేతలు పోటీ నుంచి తప్పుకుంటున్నారు. మరికొంత మంది నేతలు రాజకీయాల నుంచే నిష్క్రమిస్తున్నారు. బీజేపీలో గత కొన్నేళ్లుగా మోడీ, షా ద్వయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు పోటీకి వెనుకడుగు వేస్తున్న వారు, రాజకీయాల నుంచే నిష్క్రమిస్తున్న వారు ..ఆ ద్వయాన్ని సహించలేకపోతున్నారు. ఇంకొంత మంది బీజేపీలో ఉన్నప్పటికీ ఆ ద్వయం పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. అయితే వారు బయటపడలేక లోలోన కుమిలిపోతున్నారు.

400 ప్లస్..అంటున్న ప్రధాని

ప్రధాని మోడీ ఎక్కడికెళ్లినా "ఈ సారి 400కుపైనే" అంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 370 స్థానాలు, ఎన్డీయేకి 400కుపైగా స్థానాలు ఇవ్వాలని ప్రజలను కోరుతున్నారు. అయితే బీజేపీ టికెట్ ఇచ్చినా, ఎన్నికల బరిలో దిగడానికి చాలా మంది ఇష్టపడటం లేదు. 'వ్యక్తిగత కారణాలు' అంటూ పోటీ నుంచి వైదొలుగుతున్నారు. సరిగ్గా పోలింగ్ దగ్గరపడుతున్న సమయంలో ఈ పరిణామాలు ఆ పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారాయి.

పోటీ నుంచి వెనక్కి తగ్గిన నేతలు

గుజరాత్‌లోని వడోదర నుంచి పోటీ చేసేందుకు బీజేపీ టికెట్ పొందిన రంజన్‌బెన్ భట్ వ్యక్తిగత కారణాలను చూపుతూ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఆమె రెండుసార్లు ఎంపీగా గెలిచారు. ఈసారి కూడా ఆమెకు టికెట్ దక్కినా.. పోటీ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నారు. అయితే తాను బీజేపీలోనే కొనసాగుతానని, అధిష్టానం ఎవరికి అవకాశం ఇచ్చినా, వారి విజయం కోసం కృషి చేస్తానని చెప్పారు.

గుజరాత్‌లోని శబర్‌కాంత నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అవకాశం దక్కించుకున్న బీజేపీ నేత భికాజీ ఠాకూర్ కూడా కాడి కింద పడేశారు. వ్యక్తిగత కారణాలను చూపుతూ, పోటీ చేయడం తనకు ఇష్టం లేదని చెప్పారు. ఆయన మాజీ విశ్వ హిందూ పరిషత్ కార్యకర్త, ఓబీసీ నేత, 34 ఏండ్ల నుంచి బీజేపీలో ఉన్నారు. లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఆయనకు మొదటిసారి లభించింది. ఇక మెహసానా లోక్‌సభ నియోజకవర్గం నుంచి తనకు టికెట్ ఇవ్వాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్ మొదట కోరారు. కానీ ఆ తర్వాత ఎటువంటి కారణం చూపకుండానే తాను పోటీ చేయబోనని ప్రకటించారు. ఈ స్థానం నుంచి పోటీ చేసేవారి పేరును బీజేపీ ప్రకటించడానికి ముందే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ లోక్‌సభ నియోజకవర్గానికి అభ్యర్థిగా భోజ్‌పురి గాయకుడు, నటుడు పవన్ సింగ్‌ను బీజేపీ ప్రకటించింది. ఈ స్థానానికి ప్రస్తుతం టీఎంసీ నేత,శతృఘ్న సిన్హా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే తాను అసన్‌సోల్ నుంచి పోటీ చేయలేనని పవన్ సింగ్ ప్రకటించారు. ఉత్తర ప్రదేశ్‌లోని బారాబంకీ నియోజకవర్గం అభ్యర్థిగా ఎంపీ ఉపేంద్ర సింగ్ రావత్‌ను బీజేపీ ప్రకటించింది. మరుక్షణంలోనే ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఓ మహిళతో అభ్యంతరకర పరిస్థితిలో ఉన్నట్టు ఈ వీడియోలో కనిపించింది. దీంతో తాను నిర్దోషినని నిరూపణ అయ్యే వరకు తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని రావత్ ప్రకటించారు. తాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయబోనని కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ వికె సింగ్ ప్రకటించారు. ఘజియాబాద్ నుంచి రెండుసార్లు ఎన్నికైన ఆయన.. ఈ సారి పోటీలో నుంచి తప్పుకుంటున్నట్టు వెల్లడించారు. కాన్పూర్ బీజేపీ ఎంపీ సత్యదేవ్ పచౌరీ కూడా లోక్‌సభ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు.

రాజకీయాలకు స్వస్తి

ఢిల్లీకి చెందిన బీజేపీ ఎంపీ హర్షవర్థన్ రాజకీయాల నుంచి తప్పుకున్నట్టు ప్రకటించారు. జార్ఖండ్‌కు చెందిన మాజీ మంత్రి, ఎంపీ జయంత్ సిన్హా సైతం రాజకీయాలకు స్వస్తి పలికారు. అలాగే కర్నాటకకు చెందిన సదానంద్ గౌడ్ కూడా రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. మళ్లీ యూటర్న్ తీసుకొని రాజకీయాలు కొనసాగిస్తానని అన్నారు. ఇలా ఎన్నికల బరిలోంచి తప్పుకుంటున్న వాళ్లు, రాజకీయాలకు స్వస్తి చెపుతున్న వారి సంఖ్య బీజేపీలో రోజు రోజుకి పెరుగుతున్నారు.

కమలంలో కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

రవి శంకర్ ప్రసాద్.. పాట్నా సాహిబ్ నుంచి పోటీలో ఉండనున్నారు. బీజేపీపై ఇటీవల పలు సందర్భాల్లో నిరసన గళం వినిపించిన పిలిభిత్ ఎంపీ వరుణ్ గాంధీకి ఆ పార్టీ టికెట్ నిరాకరించింది. వరుణ్ తల్లి, కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ తిరిగి సుల్తాన్‌పూర్ స్థానం నుంచి పోటీ చేయనున్నారు.

యూపీలోని ఘజియాబాద్ నుంచి రెండు సార్లు ఎంపీగా గెలిచిన వి.కె సింగ్ స్థానంలో అతుల్ గార్గ్‌కు బీజేపీ అధిష్టానం టికెట్ కేటాయించింది. వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌కు సైతం కమలం పార్టీ పోటీకి అవకాశం కల్పించింది. ఆమె తన సొంత నియోజకవర్గమైన హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి నుంచి బరిలో నిలవనున్నారు. కంగనా బీజేపీలో చేరక ముందే ఆ పార్టీ ఆమెకు టికెట్‌ను కేటాయించటం గమనార్హం. 1980 దశకం చివరలో ప్రసారమైన రామాయణం టీవీ సీరియల్‌లో రాముడి పాత్రను పోషించిన అరుణ్ గోవిల్ యూపీలోని మీరట్ నుంచి పోటీ చేయనున్నారు. ఈయన 2021లో బీజేపీలో చేరారు.

జార్ఖండ్‌లోని అధికార కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)ను వీడిన ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరెన్ సమీప బంధువు సీతా సొరెన్ కొన్ని రోజుల క్రితమే బీజేపీలో చేరారు. ఆమె దుమ్కా లోక్‌సభ స్థానం నుంచి బరిలో ఉండనున్నారు.

2023 కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నాయకుడు జగదీశ్ షెట్టర్‌కు బెలగావ్ సీటును కేటాయించింది. కాంగ్రెస్‌లో తొమ్మిది నెలల ప్రయాణం అనంతరం ఈ ఏడాది జనవరి 25న జగదీశ్ తిరిగి బీజేపీ గూటికి చేరారు. కాంగ్రెస్‌లో చేరకముందు వరకు కూడా ఆయన బీజేపీలోనే ఉన్నారు. కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ్ పశ్చిమ బెంగాల్‌లోని తమ్లుక్ స్థానం నుంచి అదృష్టాని పరీక్షించుకోనున్నారు..

కొత్తవారికి టికెట్ల కేటాయింపు బీజేపీలో చిచ్చురేపుతున్నది. తమను కాదని ఇలా పార్టీలోకి కొత్తగా వచ్చినవారికి టికెట్లను కేటాయించటం పట్ల పలువురు బీజేపీ నాయకులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

పార్టీని నమ్ముకొని పని చేసిన తమని కాదని వలసనేతలను పోటీలోకి దింపటం తమను అవమానించటమేనని ఆ పార్టీ కార్యకర్తలతో పాటు టికెట్ దక్కని నేత మద్దతుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోడీ, షా, నడ్డా ల నియంతృత్వ వైఖరి పార్టీకి చేటు కలిగిస్తుందని ఆరోపిస్తున్నారు.



'జై హింద్, భారత్ మాతా కీ జై'

నినాదాల తొలి గళం ఇద్దరు ముస్లింలదే...

- 'సంఘ్' ఆ నినాదాలు వదిలేస్తుందా?
- ప్రశ్నించిన కేరళ సీఎం విజయన్

తిరువనంతపురం : 'భారత్ మాతా కీ జై', 'జై హింద్' నినాదాలను మొదట చేసింది ఇద్దరు ముస్లింలనీ, ఇప్పుడు ఆ నినాదాలను వదిలేయడానికి సంఘ పరివార్ సిద్ధంగా వుందా అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రశ్నించారు. ముస్లింలు ఎక్కువగా వుండే ఉత్తర కేరళ జిల్లాలో ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లిం పాలకులు, సాంస్కృతిక ప్రముఖులు, అధికారులు గణనీయ పాత్ర పోషించారన్నారు. ఇందుకు సంబంధించి చరిత్రలోని ఉదాహరణను ఆయన చెప్పారు. అజీముల్లా ఖాన్ అనే ముస్లిం తొలుత భారత్ మాతా కీ జై అనే నినాదం చేశారని గుర్తు చేశారు. "ఇక్కడకు వచ్చిన సంఘ పరివార్ నేతలు తమ ముందు కూర్చున్నవారిని చూసి భారత్ మాతా కీ జై అని నినదించమంటున్నారు. అసలు ఎవరు ఈ నినాదం ఇచ్చారు? ఈ నినాదం మొదట చేసింది ముస్లిం అని, ఆ వ్యక్తి పేరు అజీముల్లా ఖాన్ అని సంఘ పరివార్‌కు తెలుసో లేదో నాకు తెలియదు." అని విజయన్ వ్యాఖ్యానించారు. ముస్లిం అని తెలిస్తే వారు ఈ నినాదం చేయడం ఆపేస్తారేమో మరి అది కూడా తెలియదని అన్నారు.

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) నిర్వహిస్తున్న ర్యాలీల్లో భాగంగా సోమవారం నిర్వహించిన నాల్గవ ర్యాలీలో ఆయన మాట్లాడారు. ప్రాచీన దౌత్యవేత్త అబిద్ హసన్ అనే వ్యక్తి తొలుత జై హింద్ అనే నినాదం చేశారన్నారు. మొఘల్ పాలకుడు షాజహాన్ కుమారుడు దారా షికోహ్ సంస్కృతంలో నుంచి పర్షియన్ భాషలోనికి 50 ఉపనిషత్‌లను అనువాదం చేశారని, ప్రపంచవ్యాప్తంగా వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేశారని విజయన్ పేర్కొన్నారు. ముస్లింలు భారత్ నుంచి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలని వాదిస్తున్న సంఘ పరివార్ నేతలు, కార్యకర్తలందరూ ఈ చారిత్రక నేపథ్యం గురించి తెలుసుకోవాలన్నారు. ఇతరులందరితో కలిసి ముస్లింలు కూడా ఈ దేశ స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

అమెరికా ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం

- హాంకాంగ్ ఆర్డినెన్స్ ఆమోదంపై బ్లింకెన్ విమర్శలను ఖండించిన చైనా

బీజింగ్ : హాంకాంగ్ ప్రత్యేక పాలనా ప్రాంతం (హెచ్ఎస్ఏఆర్)లో శనివారం నుండి అమల్లోకి వచ్చిన జాతీయ భద్రతా ఆర్డినెన్స్ పరిరక్షణపై అమెరికా పదే పదే దుష్ప్రచారం చేస్తూ, తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని చైనా తీవ్రంగా విమర్శించింది. తాజాగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈ చట్టంపై తీవ్రంగా విమర్శలు, వ్యాఖ్యలు చేస్తూ ప్రకటన జారీ చేయడంపై చైనా విదేశాంగ శాఖ తీవ్ర అసంతృప్తిని, వ్యతిరేకతను వ్యక్తం చేసింది. ఈ ప్రకటన రాజకీయ అవకతవకలకు పాల్పడడం, బూటకపు, నయవంచనతో కూడిన ద్వంద్వ ప్రమాణాలను అనుసరించడం తప్ప మరొకటి కాదని స్పష్టం చేసింది. జాతీయ భద్రతను పాటిస్తూ, హక్కులు, స్వేచ్ఛలను పరిరక్షించడానికి, ఆర్థికాభివృద్ధి కొనసాగింపునకు మధ్య సమతుల్యతను పాటించడానికే ఈ ఆర్డినెన్స్ తీసుకువచ్చామని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ సోమవారం ఒక పత్రికా సమావేశంలో పేర్కొన్నారు. ఇతర దేశాల నుండి ముఖ్యంగా ఉమ్మడి న్యాయ వ్యవస్థలు కలిగిన దేశాల అనుభవాల నుండి దీన్ని రూపొందించామని చెప్పారు. హక్కులను పూర్తిగా గౌరవిస్తూ, రక్షిస్తూ, నేరాల మూలాలను స్పష్టంగా నిర్వచిస్తూ, ఏది నేరం, ఏది కాదు అని స్పష్టంగా తెలియచేస్తూ ఈ ఆర్డినెన్స్‌ను రూపొందించామని జియాన్ చెప్పారు.

దీనివల్ల హాంకాంగ్ ఉన్నత స్థాయి స్వయంప్రతిపత్తి ఏ మాత్రమూ దెబ్బతినదన్నారు. అలాగే హాంకాంగ్ పెట్టుబడిదారీ వ్యవస్థను, జీవిత సరళినికూడా మార్చదన్నారు. హాంకాంగ్‌కు గల విశిష్టవైఖరిని, అవకాశాలను మరింత మెరుగ్గా ఉపయోగించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఇతర దేశాలు, ప్రాంతాలతో మార్పిడులను మరింతగా చేసుకోవడానికి, సహకరించుకోవడానికి ఉపకరిస్తుందన్నారు. అంతర్జాతీయ ఆర్థిక, షిప్పింగ్, వాణిజ్య కేంద్రంగా తన హోదాను మరింత సంఘటితపరుచుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. బేసిక్ చట్టంలోని 23వ అధికరణ కింద జాతీయ భద్రతా చట్టాన్ని హాంకాంగ్ అధికారులు ఆమోదించడం పట్ల తాము తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు బ్లింకెన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశారు.

సంపాదకీయం

‘ఉడ్తా తెలంగాణా’!



ఒకటా రెండా! ఎన్నో కేసులు!! ఇంటర్, డిగ్రీ చదువుతున్న యువతీ యువకులే కాదు.. రాష్ట్రంలో బడి పిల్లలు సైతం గంజాయికి బానిసలవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రానురానూ తెలంగాణ రాష్ట్రం డ్రగ్స్ అడ్డాగా మారుతోంది. బడిపిల్లల నుండి వర్సిటీ స్టూడెంట్ల దాకా.. రోజు కూలీ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరకు... వైద్యులు, వ్యాపారవేత్తలతోపాటు సినీ ప్రముఖులు... ఇలా వాళ్లూ వీళ్లూ అన్న తేడా లేకుండా ఎందరో ఈ మత్తు మహమ్మారికి బలైపోతున్నారు. పోలీసులు ఎన్నో చర్యలు తీసుకుంటున్నా మంటున్నా, ఎంత నిర్బంధం విధిస్తున్నా.. వాళ్ల ఎత్తులను చిత్తుచేస్తూ...డ్రగ్ పెడ్లర్స్ మరింత రెచ్చిపోతున్నారు. తెలంగాణలో మత్తులో జోగుతున్న వారు 29 లక్షల మంది అని 'సామాజిక న్యాయం, సాధికారత'పై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీసంఘం నివేదిక చెబుతోంది. అప్పుడెప్పుడో 2016లో పంజాబ్‌లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోతోందన్న కథాంశంతో వచ్చిన 'ఉడ్తా పంజాబ్' సినిమా నేటి మన రాష్ట్ర పరిస్థితికి అద్దం పడుతోందంటే అతిశయోక్తి కాదేమో!

> విద్యావ్యవస్థలో లోపాలు, విద్యార్థులపై ఒత్తిడి, క్షీణిస్తున్న సామాజిక విలువల ఫలితంగానే భావితరం దారి తప్పుతున్నది. చెడు లక్షణాలేవి ఒక్కసారితో అబ్బవు. కుటుంబ సమస్యలు, విద్యా ఉద్యోగ సమస్యలు, పేదరికం పరిష్కరించుకోలేక వీటికి బానిసలవుతున్నారు. కేవలం సంఘటనలు జరిగినప్పుడే ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం మేల్కొంటున్న తీరు సమాజానికి సిగ్గుచేటు. ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? యువతకు ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలు వారు "మత్తు"లో తూలడమే మేలనుకుంటున్నాయా?

అప్పటివరకు అద్భుతంగా చదివే పిల్లలు అంతలోనే అధ:పాతాళంలోకి జారిపోతున్నారు. గంజాయి కొనడానికి డబ్బులివ్వలేదని కన్నవారినే కడతేర్చే స్థితికి చేరుకుంటున్నారు. గంజాయి దొరకడం లేదని, గంజాయి మత్తు నుంచి బయట పడలేకపోతున్నామనే వేదనతో ప్రాణాలు తీసుకుంటున్నవారి సంఖ్యా పెరుగుతోంది. మధ్యతరగతి ప్రజానీకమే లక్ష్యంగా పోలీసుల కన్నుగప్పి, అంతరపంటగా గంజాయిని సాగుచేయడం, దాన్ని యువతరానికి అలవాటు చేసి, ఆ తర్వాత ఖరీదైన మత్తు మందులకు బానిసలను చేస్తున్నారు. జగిత్యాలలో జరిగింది అదే. హైస్కూలులో చదువుకునే అన్నెం పున్నెం ఎరుగని అమాయక ఆడపిల్లలకు గంజాయి అలవాటు చేసి, తర్వాత వారిని డ్రగ్స్‌కు బానిసలుగా చేసి, వారితో సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్న తీరు ఘోరం, దారుణాతి దారుణం. పక్కాప్లాన్ ప్రకారం యువకులకు, చిన్నారులకు నిదానంగా ఈ మత్తుకు అలవాటు చేస్తున్నారు. ఆ ప్రణాళికలో భాగంగా.. తొలుత నిషా తక్కువగా ఉండే ప్రాంతాల్లోని పాఠశాల విద్యార్థులకు గంజాయితో చేసిన చాక్లెట్లను, కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థులకు.. సిగరెట్లను తక్కువ ధరకు అందుబాటులో ఉంచుతున్నారు. ఒడిషా నుంచి వచ్చిన ముగ్గురు సభ్యుల ముఠా రంగారెడ్డి జిల్లా కొత్తూరులో ఇలాంటి దందాకు పాల్పడి దొరికిపోయిన ఘటనే ఇందుకు ఒక ఉదాహరణ. అదృష్టవశాత్తూ ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వారి ప్రవర్తన చూసి, అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ముఠా గుట్టు రట్టయ్యింది. అలా జరగని సందర్భాలెన్నో!

తెలుగు రాష్ట్రాల్లో ఈమధ్య చోటుచేసుకుంటున్న పరిణామాలు మరింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. లక్షల కోట్ల విలువైన 25 వేల కిలోల మాదక ద్రవ్యాలు విశాఖ పోర్టుకు దిగుమతి అయ్యాయన్న సంగతి కాక రేపుతోంది. డ్రగ్స్‌కు పుట్టినిల్లుగా పేరుపడిన బ్రెజిల్ లోని శాంటోస్ పోర్టు నుంచి కాకినాడకు చెందిన ఒక ఆక్వా ఎక్స్‌పోర్టు సంస్థకు ఇవి సరఫరా అవుతున్నట్టు సిబిఐ గుర్తించింది. ఇక హైదరా బాద్ శివార్లలో ఏకంగా రసాయనాల తయారీ ముసుగులో మాదకద్రవ్యాల తయారీయే గుట్టుగా సాగిపోతోందన్నది వాస్తవం. కేంద్రంలో బీజేపీ పెద్దలు అధికారంలోకి వచ్చిన తరువాత పోర్టులను, ఎయిర్ పోర్టులను ప్రయివేటుకు ధారాదత్తం చేశాక.. అందులో పనిచేసే అధికారులు వారి తొత్తులయ్యాక... ఇలాంటి పరిస్థితులను అడ్డుకునేదెవరు? అదానీకి చెందిన ముంద్రాపోర్టులో రూ.3వేల కోట్ల డ్రగ్స్ పట్టుబడ్డ తీరే నిదర్శనం.

విద్యావ్యవస్థలో లోపాలు, విద్యార్థులపై ఒత్తిడి, క్షీణిస్తున్న సామాజిక విలువల ఫలితంగానే భావితరం దారి తప్పుతున్నది. చెడు లక్షణాలేవి ఒక్కసారితో అబ్బవు. కుటుంబ సమస్యలు, విద్యా ఉద్యోగ సమస్యలు, పేదరికం పరిష్కరించుకోలేక వీటికి బానిసలవుతున్నారు. కేవలం సంఘటనలు జరిగినప్పుడే ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం మేల్కొంటున్న తీరు సమాజానికి సిగ్గుచేటు. ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? యువతకు ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలు వారు "మత్తు"లో తూలడమే మేలను కుంటున్నాయా? దీనికి తోడు మతోన్మాదం, కులోన్మాదమూ మత్తును మరింత దట్టిస్తోంది. అప్రజాస్వామిక విధానాలను, వైఫల్యాలను ప్రశ్నించకుండా "మత్తు"లో జోకొడుతోంది.

డ్రగ్స్‌ను అరికట్టే విషయంలో రాజకీయాలను, స్వప్రయోజనాలను పక్కన బెట్టి కార్యాచరణకు నడుం బిగించినప్పుడే ఫలితం సిద్ధిస్తుంది. తెలంగాణలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను బలోపేతం చేసి, మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపడతామనడం ముదావహం. కానీ, ఇవి కేవలం మాటలకే పరిమిత మయితే... మత్తులో చిత్తు అయిన 'యువత'తో రాష్ట్రం నిర్వీర్యమైపోయే ప్రమాదం పొంచి ఉంది... తస్మాత్ జాగ్రత్త!

అనారోగ్యాలకు కారణం అవిద్య, పేదరికమేనా..?

ప్రపంచవ్యాప్తంగా మార్చి 26న 'ప్రపంచ మూర్ఛ రోగ అవగాహన దినం లేదా వరల్డ్ ఎపిలెప్సీ అవేర్‌నెస్ డే'ను పాటి స్తున్నాం. ఎపిలెప్సీ లేదా మూర్ఛ రోగం లేదా కాకిసోమాల వ్యాధి పట్ల సామాన్య ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ రోజు ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా 65 మిలియన్ల ఎపిలెప్సీ రోగులున్నారని, వీరిలో 80 శాతం



అభివృద్ధి చెందుతున్న, మధ్య ఆదాయ దేశాల్లోనే ఉన్నారని తేలింది. ప్రతి 26 అమెరికన్లలో ఒకరికి తన జీవిత కాలంలో ఎపిలెప్సీ వచ్చే అవకాశం ఉందని తేలింది. అయితే ఎపిలెప్సీ రుగ్మతగల స్త్రీపురుషులు పూర్తి జీవితాన్ని అనుభవించే అవకాశాలే ఎక్కువ. కొన్ని కేసుల్లో అకాల మరణాలు కూడా చోటు చేసుకోవచ్చు. మూర్ఛ రోగ లక్షణాలుగా అసాధారణ ప్రవర్తన, స్పృహ కోల్పోవడం, తాత్కాలిక గందరగోళం, నిశ్చేష్టంగా చూడడం, కాళ్ళు చేతులు నియంత్రణ కోల్పోయి కదలడం, భయపడడం, ఉద్రేక పడడం లాంటివి కలిగి ఉంటారు. అధిక జ్వరం, తలకు గాయాలు, రక్తంలో షుగర్ లెవల్స్ పడిపోవడం, ఆల్కహాల్ అలవాటును ఒక్కసారిగా మానడం లాంటి సందర్భాలలో మూర్ఛలు బయటపడతాయి. సరైన చికిత్స అందుబాటులో లేని ఎపిలెప్సీ రుగ్మత చిన్న పిల్లలు, వృద్ధులలో అధికంగా కనిపిస్తుంది. మహిళల కన్న పురుషుల్లో దీని ప్రభావం ఎక్కువ.

కేంద్ర నాడీమండలంతో పాటు మెదడు సంబంధ రుగ్మతల్లో మూర్ఛ రోగం నాలుగో ముఖ్య వ్యాధిగా గుర్తించబడి అనాదిగా మిలియన్ల ప్రజలను పట్టి పీడిస్తున్నది. భారత్‌లో 10

> మూర్ఛ రోగం పట్ల కుటుంబ పెద్దలు, యువత సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. ఎలాంటి అపోహలకు తావు లేకుండా, రోగులకు ధైర్యాన్ని అందిస్తూ ఎపిలెప్సీ రుగ్మతల కట్టడికి కృషి చేయాలి. పేదరికం, అధిక జనాభా, నిరక్షరాస్యత లాంటి తీవ్ర సమస్యలు ఉన్న భారత్ లాంటి దేశాల్లో మూర్ఛరోగం బహుభారంగా నిలుస్తున్నది. ఇలాంటి ఎపిలెప్సీ రుగ్మత పట్ల ముప్పేట సమూహిక దాడి చేసి, ఆరోగ్య భారత నిర్మాణ యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలి.

మిలియన్ల మూర్ఛరోగులున్నారని అంచనా (జనాభాలో దాదాపు ఒక శాతం). మన దేశంలో పేదరికం, సాంప్రదాయ నమ్మకాలు, మూఢ విశ్వాసాలు, ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో లేక పోవడం, సుశిక్షితులైన ఆరోగ్య సిబ్బంది కొరత, యాంటీ-ఎపిలెప్సీ ఔషధాల పట్ల అవగాహన లోపించడం లాంటి కారణాలతో మూర్ఛ రోగుల సంఖ్య పెరుగుతోంది. ఎపిలెప్సీ అనబడే మెదడుకు సంబంధించిన రుగ్మత (మెదడుకు గాయం, బ్రేయిన్ ట్యూమర్స్, మెదడుకు సూక్ష్మ జీవులు సోకడం)గా భావిస్తారు.

ఎపిలెప్సీల్లో 25 శాతం నివారించదగినవే అని నమ్మాలి. తలకు గాయాలు కాకుండా చూసుకోవడం, గర్భంలోని శిశువుల సంరక్షణ, జ్వరం వచ్చినపుడు శరీర ఉష్ణోగ్రత పెరగకుండా చూడడం, బిపి/షుగర్/ స్థూల కాయాలను నియం త్రించు కోవడం, పొగాకు/ ఆల్కహాల్ వాడకం తగ్గించుకోవడం, మెదడుకు సూక్ష్మజీవులు సోక కుండా జాగ్రత్త పడడం లాంటి చర్యలతో ఎపి లెప్సీని నివారించవచ్చని తెలుసుకోవాలి.

మూర్ఛ రోగం పట్ల కుటుంబ పెద్దలు, యువత సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. ఎలాంటి అపోహలకు తావు లేకుండా, రోగులకు ధైర్యాన్ని అందిస్తూ ఎపిలెప్సీ రుగ్మతల కట్టడికి కృషి చేయాలి. పేదరికం, అధిక జనాభా, నిరక్షరాస్యత లాంటి తీవ్ర సమస్య లు ఉన్న భారత్ లాంటి దేశాల్లో మూర్ఛ రోగం బహుభారంగా నిలుస్తు న్నది. ఇలాంటి ఎపిలెప్సీ రుగ్మత పట్ల ముప్పేట సమూహిక దాడి చేసి, ఆరోగ్య భారత నిర్మాణ యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలి.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
సెల్: 9949700037.

పేదరికపు గణాంకాల గురించి మరోకసారి..



ఈ మధ్య నీతి ఆయోగ్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి ఒక 'అద్భుతమైన' ప్రకటన చేశారు. 2022-23 వినిమయ ఖర్చు సర్వే వెల్లడించిన వివరాల ప్రకారం మన దేశంలో పేదరికం ఐదు శాతం కన్నా దిగువకు పడిపోయిందట! దీనికి ప్రాతి పదిక ఏమిటి? సురేశ్ టెండూల్కర్ కమిటీ నిర్దేశించిన దారిద్ర్య రేఖ (2011-12 సంవత్సరం ప్రమాణంగా)ను వినిమయ ధరల సూచీలో వచ్చిన పెరుగుదల ప్రకారం తాజా పరిస్థితికి అనుగు ణంగా సవరించి దానితో పోల్చితే 2022-23లో దేశ జనాభాలో ఆ రేఖ కన్నా దిగువన 5 శాతం కన్నా తక్కువే ఉన్నారట!

టెండూల్కర్ కమిటీ 2011-12 సంవత్సరానికిగాను దారిద్ర్యరేఖను నిర్ణయించినదానికి ప్రమాణాలు లేదా ప్రాతిపదిక ఏమిటి? కనీసం ఒక కుటుంబానికి ఏయే సరుకులు, సేవలు ఏయే మేరకు అవసరమవుతాయి, ఒక వ్యక్తి కనీసం ఎన్ని క్యాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని రోజూ తీసుకోవాలి వంటి ప్రమాణాలు ఏవీ పరిగణించలేదు. ఏకపక్షంగా ఆ దారిద్ర్య రేఖను నిర్ణయించారు. దానిని కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు వినిమయ ధరల సూచీకి అనుగుణంగా సవరించారు. ఈ వినిమయ ధరల సూచీ విద్య, వైద్యం వంటి సేవలు ప్రైవేటీకరించబడిన వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోవు. అందుచేత వాస్తవ పెరుగుదలను అవి పూర్తిగా ప్రతిబింబించవు. ఇక 2022-23లో చేపట్టిన వినిమయ సర్వే అంతకు పూర్వపు సర్వేల విధానాన్నే అనుసరించి వుంటే పోల్చడానికి వీలుండేది. కానీ అంతకు ముందరి సర్వేలకు భిన్నంగా ఈ సర్వే జరిగింది. అందుచేత ఈ సర్వేలో వచ్చిన వివరాలను అంతకు పూర్వపు సర్వేలతో సరిపోల్చడానికి సాధ్యం కాదు. పైగా ఈ తాజా సర్వే వివరాలు పూర్తిగా ఇంకా వెల్లడి కాలేదు. అందుచేత నిటి ఆయోగ్ ప్రకటించినట్టు పేదరికం జనాభాలో ఐదు శాతం కన్నా తక్కువ అని నిర్ధారించడానికి తగిన ఆధారాలు లేవు. పైగా దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి మనకు లభిస్తున్న తక్కిన సమాచారంతో పోల్చి చూసినప్పుడు పేదరికం తగ్గిపోయిందన్న ప్రచారం ఎన్నికల సమయంలో ప్రభుత్వం చేసుకోడానికి వీలుగా ఈ ప్రకటన వెలువడిందన్న నిర్ధారణకు రాక తప్పదు. ఆ ఇతర సమాచారం ఏమిటో చూద్దాం.

2017-18లో చేపట్టిన వినిమయ సర్వే వెల్లడించిన వివరాలు ఎంత దయనీయ పరిస్థితిని వెల్లడించాయంటే ఆ సర్వే వివరాలను ప్రభుత్వం బహిరంగ పరచడానికి సిద్ధపడలేదు. వాటిని వెనక్కి తీసేసుకున్నారు. ఈ లోపు మనకు పొక్కిన సమాచారాన్ని బట్టి కనీస పౌష్టికాహారం (ప్లానింగ్ కమిషన్ అప్పుడు నిర్ధారించిన ప్రకారం రోజుకు 2100 క్యాలరీలు పట్టణాలలో. అదే గ్రామాల్లోనైతే రోజుకు 2200 క్యాలరీలు) పొందలేకపోతున్నవారు 1993-94లో 57 శాతం ఉంటే అది 2017-18 నాటికి 60 శాతానికి పెరిగింది. ఇది పట్టణాలలోని పరిస్థితి. ఇక గ్రామీణ ప్రాంతాలకు వస్తే 1993-94లో 57 శాతం, 2011-12లో 65 శాతం ఉన్నది కాస్తా 2017-18కి 80 శాతానికి అమాంతం పెరిగిపోయింది. అంటే పేదరికం 2011-12 నుంచి 2017-18 మధ్య కాలంలో బాగా పెరిగిపోయింది. ఆ తర్వాత మనం కరోనా మహమ్మారి బారిన పడ్డాం. దానికి లాక్‌డౌన్ తోడైంది. దాంతో ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. కరోనాకు మునుపు ఉన్న నిరుద్యోగం కన్నా ఎక్కువగా నేడు నిరుద్యోగం తాండవమాడుతోంది. 2017-18 నాటి పరిస్థితినైనా అధిగమించగలిగామా లేదా అన్నదే సందేహాస్పదంగా ఉంది. అటువంట ప్పుడు 2011-12 నాటి పరిస్థితిని కూడా అధిగమించి పేదరికాన్ని ఏకంగా 5 శాతం కన్నా తక్కువకి తగ్గించేశామని చెప్పుకోవడం ఏ మాత్రమూ విశ్వసనీయంగా లేదు.


ప్రభాత్ పట్నాయక్

ఎన్ని క్యాలరీల శక్తినిచ్చే ఆహారం తీసుకుంటున్నారు అన్నదే పేదరికానికి కొలబద్ద కాజాలదు అని వాదించేవారున్నారు. వారి వాదన ఒక పొరపాటు అవగాహన మీద ఆధారపడి వుంది. కేవలం క్యాలరీల ప్రాతిపదికను ఒక్కదానిని మాత్రమే పేదరికాన్ని అంచనా వేయడానికి కొలబద్దగా తీసుకోవాలన్నది కాదు ఇక్కడ మనం చెప్పేది. నికర ఆదాయాల్లో పెరగుదల వచ్చిన ప్పుడు తీసుకునే ఆహారపు క్యాలరీల విలువ కూడా పెరగాలి అన్నదే ఇక్కడ మన వాదన. ఒకవైపు ఆదాయం పెరిగినా తీసుకునే ఆహారపు క్యాలరీల విలువ తగ్గవచ్చు అన్న వాదన పూర్తిగా తప్పు. కేవలం నిజ వేతనాలు తగ్గిపోయినప్పుడు మాత్రమే తీసుకునే ఆహారపు కేలరీల విలువ తగ్గిపోతుంది. ప్రపంచ దేశాల గణాంకాలను పరిశీలించినప్పుడు తలసరి ఆదాయం పెరుగుదలకు, తలసరి ఆహార ధాన్యాల వినియోగం పెరుగుదలకు ప్రత్యక్ష సంబంధం ఉంది అని స్పష్టంగా నిర్ధారణ అయింది.

మన దేశంలో ఆదాయాలు ఎంతెంత వస్తున్నాయి అన్నదానికి సంబంధించిన గణాంకాలేవీ లేవు. కేవలం విని మయానికి చేస్తున్న ఖర్చుల గణాంకాలు మాత్రం లభ్యమౌతున్నాయి. ఈ ఖర్చులను ఒక దీర్ఘకాలంలో పోల్చి చూడాలంటే ధరల సూచీ ఆధారంగా వాటిని సవరించడం ఒక్కటే మార్గం. కాని ఆ ధరల సూచికలకున్న లోపాల దృష్ట్యా అవి ఆదాయాల పెరుగుదలను సక్రమంగా అంచనా వేయడానికి తోడ్పడవు. ఇక తీసుకునే ఆహారపు క్యాలరీల విలువను బట్టి పోల్చి చూడడం ఒక్కటే మన ముందున్న నమ్మదగిన విధానం. దానిని బట్టి చూస్తే 2017-18 వరకూ మన దేశంలో పేదరికం పెరుగుతూనే వచ్చింది. ఇక ఆ తర్వాత వివరాలే లేవు. తాజాగా 2022-23కు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన వినిమయ సర్వే వివరాలను ప్రభుత్వం వెల్లడి చేస్తే దేశంలో పేదరికం పరిస్థితిని మనం తాజాగా అంచనా వేయగలుగుతాము. అంతవరకూ మనం ఇతరత్రా లభిస్తున్న వివరాల మీద ఆధారపడక తప్పదు.

అటువంటి పరోక్ష ఆధారాలలో మొదటిది జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే. 2019-21 వరకూ ఉన్న కాలానికి సంబంధించిన 5వ సర్వే ప్రకారం 2015-16తో పోల్చితే 2019-21 నాటికి రక్తహీనతతో బాధపడే మహిళలు (15 నుంచి 49 సం. మధ్య వయస్కులు) 53 శాతం నుండి 57 శాతానికి పెరిగారు. 2015-16లో 50 శాతం కన్నా ఎక్కువ జనాభా రక్తహీనతతో బాధపడే మహిళలు ఉన్న రాష్ట్రాలు 21 ఉంటే 2019-21 నాటికి వాటి సంఖ్య 25కి పెరిగింది. సంపన్న దేశాల మహిళలకు ఉపయోగించే ప్రమాణాలనే ఇక్కడ కూడా ఉపయోగించడం సరైనది కాదని వాదిస్తున్న వారున్నారు. కాని ఇక్కడ ప్రమాణాలేమిటి అన్నది కాదు ప్రధానం. అవే ప్రమాణాలను గతంలోను, ఇప్పుడు ఉపయోగిస్తున్నాం. అయినా గతంలో పోల్చితే ఇప్పుడు రక్తహీనత పెరిగింది. అదీ ప్రధానం.

రెండవ పరోక్ష ఆధారం ప్రపంచ ఆకలి సూచిక. ప్రపంచ ఆకలి సూచిక అట్టడుగున్న ఉన్న 125 దేశాలను పరిశీలి స్తుంది. అందులో మన దేశం 2023లో 111వ స్థానంలో ఉంది. ఆకలి సూచికను లెక్కిస్తున్న విధానం సక్రమంగా లేదని మన ప్రభుత్వం అభ్యంతరం పెడుతోంది. ఆ విధానంలోని లోపాల మాట ఎలా ఉన్నా, వారు ఒకటే విధానాన్ని కొనసాగిస్తున్నారు. అటువంట ప్పుడు తలసరి ఆదాయాలు గణనీయంగా పెరిగిపోతున్నా యంటూ చెప్పుకుంటున్న మన దేశం ఆకలి సూచికలో దిగజారవలసిన పరిస్థితి ఎందుకొచ్చింది? దారిద్ర్య రేఖకు దిగువన ఉండేవారి సంఖ్య బాగా తగ్గిపోయిందని చెప్పుకుం టున్న ప్రభుత్వం ఆకలి సూచికలో మన దేశం స్థానం దిగజారిపోడానికి కారణం ఏమిటో చెప్పగలదా?

కేవలం ఆకలి సూచిక ఒక్కటే కాదు. తగినంత శక్తి లేని పిల్లలు, వివిధ లోపాలతో జన్మించే పిల్లలు, పెరుగుదల లేకుండా నిలిచిపోయిన పిల్లలు, చిన్న పిల్లల మరణాలు-ఇవన్నీ కూడా కొన్ని ప్రమాణాలే. వాటిని బట్టి చూసినా 2008తో పోల్చిన ప్పుడు 2023 నాటికి మన పరిస్థితి ఘోరంగా దిగజారిపో యింది. అందుచేత అల్పాదాయ వర్గాల ఆదాయాలు పెరిగాయి అని చెప్పుకుంటున్న దానిలో ఏమాత్రమూ వాస్తవం లేదు. ఇక తల్లిపాలు తప్ప వేరే ఇతర ఆహారం ఏదీ పొందలేని చిన్న పిల్లలు (6 నెలల నుండి 23 నెలల వయస్సు ఉండే చిన్న పిల్లలు) 67 లక్షలమంది 2023లో ఉన్నారు. ఈ వయస్సు పిల్లలకు తల్లిపాలతోబాటు ఇతరత్రా అదనపు ఆహారం కూడా అందాలి. కాని అలా పొందలేనివారు ఆ వయస్సుగల మొత్తం పిల్లల్లో 19.3 శాతం ఉన్నారంటే అది మన పేదరికానికి అద్దం పడుతుంది. ఈ విషయంలో మనకన్నా కేవలం రెండే రెండు దేశాలు వెనకబడివున్నాయి. అవి గినీ (21.8 శాతం), మాలి (20.5 శాతం). మన ప్రభుత్వం చెప్పుకుంటున్న గొప్పలు ఎంత బూటకమో దీనిని బట్టే చెప్పవచ్చు.

మన ప్రభుత్వం ఎన్ని గొప్పలు చెప్పుకుంటున్నా, యావత్ ప్రపంచానికీ మన దేశం పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న సంగతి బాగా తెలుసు. ఐరాస నివేదిక ప్రకారం ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎవో) దక్షిణాసియా దేశాలకు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పౌష్టికాహారం పొందలేకపోతున్నవారు భారత దేశంలో 74 శాతం ఉన్నారు. ఇది చేదు నిజం.

(స్వేచ్ఛానుసరణ)

> 2017-18లో చేపట్టిన వినిమయ సర్వే వెల్లడించిన వివరాలు ఎంత దయనీయ పరిస్థితిని వెల్లడించాయంటే ఆ సర్వే వివరాలను ప్రభుత్వం బహిరంగ పరచడానికి సిద్ధపడలేదు. వాటిని వెనక్కి తీసేసుకున్నారు. ఈ లోపు మనకు పొక్కిన సమాచారాన్ని బట్టి కనీస పౌష్టికాహారం (ప్లానింగ్ కమిషన్ అప్పుడు నిర్ధారించిన ప్రకారం రోజుకు 2100 క్యాలరీలు పట్టణాలలో. అదే గ్రామాల్లోనైతే రోజుకు 2200 క్యాలరీలు) పొందలేకపోతున్నవారు 1993-94లో 57 శాతం ఉంటే అది 2017-18 నాటికి 60 శాతానికి పెరిగింది. ఇది పట్టణాలలోని పరిస్థితి. ఇక గ్రామీణ ప్రాంతాలకు వస్తే 1993-94లో 57 శాతం, 2011-12లో 65 శాతం ఉన్నది కాస్తా 2017-18కి 80 శాతానికి అమాంతం పెరిగిపోయింది.

> రెండవ పరోక్ష ఆధారం ప్రపంచ ఆకలి సూచిక. ప్రపంచ ఆకలి సూచిక అట్టడుగున్న ఉన్న 125 దేశాలను పరిశీలి స్తుంది. అందులో మన దేశం 2023లో 111వ స్థానంలో ఉంది. ఆకలి సూచికను లెక్కిస్తున్న విధానం సక్రమంగా లేదని మన ప్రభుత్వం అభ్యంతరం పెడుతోంది. ఆ విధానంలోని లోపాల మాట ఎలా ఉన్నా వారు ఒకటే విధానాన్ని కొనసాగిస్తున్నారు. అటువంటప్పుడు తలసరి ఆదాయాలు గణనీయంగా పెరిగిపోతున్నాయంటూ చెప్పుకుంటున్న మన దేశం ఆకలి సూచికలో దిగజారవలసిన పరిస్థితి ఎందుకొచ్చింది? దారిద్ర్య రేఖకు దిగువన ఉండేవారి సంఖ్య బాగా తగ్గిపోయిందని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆకలి సూచికలో మన దేశం స్థానం దిగజారిపోడానికి కారణం ఏమిటో చెప్పగలదా?

హిట్లర్ దహనభూమి ఆదేశం

అడాల్ఫ్ హిట్లర్ ఆస్ట్రియాలో పుట్టి వలస వచ్చిన జర్మన్ రాజకీయుడు. మొదటి ప్రపంచయుద్ధ సిపాయి. 1933నుండి 1945లో స్వీయహత్య చేసుకునే వరకు జర్మన్ నియంత. 1939లో రెండవ ప్రపంచ యుద్ధాన్ని రగిలించిన జాత్యహంకార సామ్రాజ్యవాది. 1933-45 మధ్య హిట్లర్ నియంత్రణలో నాజి పార్టీ పాలిత జర్మనీని నాజి జర్మనీ, జర్మన్ రీచ్, గ్రేటర్ జర్మన్ రీచ్ అంటారు. పంటలు, పశువులు, పక్షులు, భవనాలు, రైలు, రోడ్డు రహదారులు, వంతెనలు, బావులు ఇతర మౌలిక సౌకర్యాలతో సహా యుద్ధ నిర్వహణలో శత్రువుకు ఉపయోగ పడగల ప్రతి దాన్నీ ధ్వంసంచేసే సైనిక ఎత్తుగడ దహన భూమి విధానం. పర్షియన్ సామ్రాజ్యంతో చేసిన యుద్ధంలో నేడు దక్షిణ సైబీరియాగా పిలవబడే పురాతన సిథియా ఈ విధానాన్ని మొట్టమొదట అమలు చేసిన ఆనవాళ్లున్నాయి. మానవత్వం, ప్రకృతి విధ్వంసాల రీత్యా యుద్ధనీతిలో ఇది ఘోర నేరం.


సంగిరెడ్డి హనుమంత రెడ్డి

1944-1945 తొలినాళ్ళకే రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ పరిస్థితి నిరాశాజనకంగా మారింది. అది ఆక్రమించిన దేశాలు, ప్రాంతాలన్నిటినీ మిత్రరాజ్యాల సైన్యాలు విడుదల చేశాయి. లేదా తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. 16డిసెంబర్1944 నుంచి 25జనవరి1945 వరకు జరిగిన అతి పెద్ద ఆక్రమణ యుద్ధం బల్జ్‌లో జర్మనీ విఫలమైంది. మిత్రరాజ్యాల సైన్యం తూర్పు పడమరల నుండి జర్మనీలో చొరబడింది. అయినా హిట్లర్ లొంగిపోడానికి ఇష్టపడలేదు. పెట్టుబడిదారి అమెరికా-పాశ్చాత్య దేశాల, కమ్యూనిస్టు సోవియట్ రష్యాల మధ్య తేడాలను హిట్లర్ గమనించాడు. వాటి మధ్య సయోధ్య కొనసాగదని నమ్మాడు. సోవియట్ విచ్ఛిన్నానికి అమెరికా, పాశ్చాత్య దేశాలు తన సహాయాన్ని కోరతాయని వంకరగా ఆలోచించాడు. నిజానికి ఈ తర్కం సరయినదే. తన పెర్ల్ ఓడ రేవుపై జపాన్ దాడిచేసినంత వరకు అమెరికా రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొనలేదు. అమెరికా, పాశ్చాత్య దేశాలు జర్మని దాడిలో సోవియట్ యూనియన్ నాశనమవుతుందని, కాగల కార్యం గంధర్వులు తీరుస్తారని వేచిచూశారు. అయితే తమను నలగదొక్కడానికి తమవైపునకు దూసుకువస్తున్న జర్మన్ ముళ్ళపళ్ళ చక్రం అమెరికా పాశ్చాత్య దేశాలు, రష్యాల మధ్య మైత్రిని నిలిపింది. ఉమ్మడి శత్రువు జర్మన్ వారి మధ్య అపోహలను తొల గించింది. 1945 మార్చి ప్రారంభానికి మిత్ర రాజ్యాల సైన్యాలు జర్మనీ అంతటా చొరబడ్డాయి. హిట్లర్ వెయ్యేళ్ళ పాలన కల చెదిరింది. (మన అమిత్ షాకు కూడా ఆ కల ఉంది.)

శత్రు దళాలకు ఉపయోగపడకూడదన్న ఉద్దేశంతో జర్మనీ మౌలిక సదుపాయాలన్నిటిని నాశనం చేయమని, శత్రువుకు కాలిననేల మాత్రమే మిగలాలని, 19మార్చి 1945న హిట్లర్ ఆదేశించాడు. 'ప్రభుత్వ భూభాగాల కూల్చివేత ఆదేశం' దాని అధికార శీర్షిక. తర్వాత రోమన్ చక్రవర్తి నీరో పేరుతో నీరో డిక్రీ అని అప్రసిద్ధిచెందింది. నీరో చక్రవర్తి 18జులై1964న రోమ్ నగరాన్ని నేర్పుగా ఉద్దేశపూర్వకంగా తగలబెట్టించాడని, 9 రోజులపాటు రోమ్‌ను బూడిదచేసిన ఆ ఘోర అగ్ని ఆహుతిని చూచి ఫిడేల్ వాయిస్తూ వినోదించాడని విస్తృత ప్రచార కథనం.

"రవాణా, ప్రసార సౌకర్యాలను, పారిశ్రామిక సంస్థలను, సరఫరా కేంద్రాలను నాశనం చేయకపోయినా, తాత్కాలికంగా పని చేయకుండా చేసినా వాటిని స్వాధీనపర్చుకున్న వాటిని మనకు వ్యతిరేకంగా ఉపయోగించుకోలేడని భావించడం పొరబాటు. ప్రజల చావులను లెక్కచేయకుండా శత్రువు మనలను కాల్చిపారేస్తాడు. అందువలన



వీటితో పాటు సైనిక, ఇతర విలువయిన వ్యవస్థలను, శత్రువు వెనువెంటనే లేదా సమీప భవిష్యత్తులో, యుద్ధంలో ఉపయోగించగల వాటిని అన్నిటినీ ధ్వంసం చేయమని ఆదేశిస్తున్నాను." ఇది హిట్లర్ విధ్వంస ఆదేశం. ఈ ఆదేశ అమలుకు ఎవరెవరు ఏయే విధులు నిర్వహించాలో కూడా హిట్లర్ ఆజ్ఞాపించాడు. ఈ ఆదేశం సైనిక అవసరమని హిట్లర్ సమర్థించుకున్నాడు. కాని తన ఓటమికి కారణమైన జర్మన్ ప్రజల్ని శిక్షించాలన్నది అసలు ఉద్దేశం.

ఓడిపోయే ముందు మౌలిక సదుపాయాల విధ్వంస చర్యలకు దిగడం హిట్లర్‌కు ఇది మొదటిసారి కాదు. రష్యన్ సైన్యాలను ముందుకు కదలకుండా ఆపడానికి జర్మన్ సైన్యం దహనభూమి విధానాన్ని ఉపయోగించింది. జర్మనీ 22జూన్1940లో పారిస్‌ను ఆక్రమించింది. 19ఆగష్టు1944న మొదలైన విముక్తి యుద్ధంలో 25 ఆగష్టు 1944న పారిస్‌ను జర్మనీ నుండి విముక్తి చేశారు. ఈ విముక్తికి ముందు హిట్లర్ ఐఫిల్ టవర్ వంటి పారిస్ చారిత్రక స్థలాలలో, రవాణా కేంద్రాలలో పేలుడు మందు పదార్థాలను పెట్టమని ఆదేశించాడు. మిత్రరాజ్య సైన్యాలు ఆ ప్రదేశాలకు చేరుకున్నప్పుడు సైన్యాధికారి జనరల్ డీట్రిచ్ హుంగొ హెర్మన్ వాన్ కోల్టిట్జ్ ఆ బాంబులను పేల్చాలి. దీంతో శత్రుసైన్యంతో పాటు పారిస్ కూడా బూడిదవుతుంది. కోల్టిట్జ్ హిట్లర్ ఆదేశాన్ని పాటించలేదు. మిత్రరాజ్యాలకు లొంగి పోయాడు. హిట్లర్ పిచ్చివాడయ్యాడని ఆరోపించాడు. కోల్టిట్జ్‌ను పారిస్ రక్షకుడని కీర్తించారు. నెదర్లాండ్స్‌ను మిత్ర రాజ్యాలు తిరిగి స్వాధీనం చేసుకుంటున్న సమయంలో 1944 చివరలో నెదర్లాండ్స్‌ను శ్మశానంగా మార్చమని హిట్లర్ ఆదేశించాడు. ఆక్రమిత నెదర్లాండ్స్‌లో జర్మనీ ప్రభుత్వ ప్రతినిధిగా నెదర్లాండ్స్ అధికారిగా ఉన్న ఆర్థర్ సీస్ ఇన్క్వార్ట్ హిట్లర్ ఆదేశాల అమలును అడ్డుకున్నారు.

బెర్తోల్డ్ కోన్రాడ్ హెర్మన్ అల్బర్ట్ స్పీర్ జర్మన్ వాస్తుశిల్పి. హిట్లర్‌తో దగ్గరి సంబంధాలు కలవాడు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాజి జర్మనీ ఆయుధాల, యుద్ధ వ్యవహారాల మంత్రి. నాజి పాలన ముగియనున్న ముందు రోజుల హిట్లర్ విధ్వంస ఆదేశ అమలు బాధ్యత స్పీర్ పై పడింది. ఆయన దిగ్భ్రాంతి చెందాడు. ఫ్యూరర్ (నాయకుడు-హిట్లర్)పై నమ్మకం కోల్పోయాడు. హిట్లర్ సర్వ వినాశక ఆదేశాన్ని వ్యతిరేకిస్తూ స్పీర్ హిట్లర్‌కు ఒక నివేదికను సమర్పించాడు. హిట్లర్ దాన్ని తిరస్కరించాడు. స్పీర్ మరోసారి తన వ్యతిరేకతను వ్యక్తపర్చాడు. అయినా లాభం లేక పోయింది. ఆదేశాన్ని అమలు చేయమని హిట్లర్ ఆజ్ఞాపించాడు. కొన్ని నెలల క్రితం పారిస్‌లో కోల్టిట్జ్ లాగే జర్మనీలో స్పీర్ హిట్లర్ విధ్వంసక ఆదేశాన్ని కావాలనే అమలుచేయదల్చుకోలేదు. ఈ ఆజ్ఞ అమలుకు (హిట్లర్ నుండి) ప్రత్యేక అధికారాలను కోరాడు. సైన్యాధికారులను, నాజి పార్టీ ప్రాంతీయ నాయకులను హిట్లర్ ఆదేశాన్ని పట్టించుకోకుండా ఒప్పించడానికి హిట్లర్ ఇచ్చిన ఆ అధికారాలను చాకచక్యంగా వినియోగించుకున్నాడు.

యుద్ధం ముగిసిందాకా హిట్లర్‌కు ఈ విషయం తెలియదు. చివరిసారి 22 ఏప్రిల్ 1945న బెర్లిన్‌లో భూగర్భ రక్షక సొరంగం (బంకర్)లో హిట్లర్‌ను కలిసిన ప్పుడు కావాలనే ఆదేశాన్ని అమలు చేయలేదని స్పీర్ అంగీకరించాడు. హిట్లర్‌కు స్పీర్‌పై పట్టరాని కోపం వచ్చినా ఏమీ చేయలేక వదిలేశాడు.

దహనభూమి ఆదేశాన్నిచ్చిన 42 రోజులకు 30ఏప్రిల్1945న హిట్లర్, ఆరోజే పెళ్ళిచేసుకున్న ప్రియురాలితో పాటు, స్వీయహత్య చేసుకున్నాడు. 7మే1945న నాజి జర్మనీ సైన్యాధికారి జనరల్ ఆల్ఫ్రెడ్ జోసెఫ్ ఫెర్డినాండ్ జోడ్ల్ జర్మన్ సైనిక లొంగుబాటు పత్రాలపై సంతకం చేశాడు. అమెరికా సైన్యాధికారి జనరల్ డ్వైట్ ఐసన్హోవర్ ఆదేశాల మేరకు హిట్లర్ తర్వాతి జర్మన్ అధినేత గ్రాండ్ అడ్మిరల్ కార్ల్ డోనిట్జ్, జర్మన్ తాత్కాలిక ప్రభుత్వ అధికారులతో పాటు స్పీర్‌ను 23 మే 1945న అరెస్టుచేశారు. దాదాపు 20 మందికి ఉరిశిక్ష, స్పీర్‌కు యావజ్జీవం విధించారు.

సెల్: 94902 4545

> "రవాణా, ప్రసార సౌకర్యాలను, పారిశ్రామిక సంస్థలను, సరఫరా కేంద్రాలను నాశనం చేయకపోయినా, తాత్కాలికంగా పని చేయకుండా చేసినా వాటిని స్వాధీనపర్చుకున్న వాటిని మనకు వ్యతిరేకంగా ఉపయోగించుకోలేడని భావించడం పొరబాటు. ప్రజల చావులను లెక్కచేయకుండా శత్రువు మనలను కాల్చిపారేస్తాడు. అందువలన వీటితో పాటు సైనిక, ఇతర విలువయిన వ్యవస్థలను, శత్రువు వెనువెంటనే లేదా సమీప భవిష్యత్తులో, యుద్ధంలో ఉపయోగించగల వాటిని అన్నిటినీ ధ్వంసం చేయమని ఆదేశిస్తున్నాను." ఇది హిట్లర్ విధ్వంస ఆదేశం. ఈ ఆదేశ అమలుకు ఎవరెవరు ఏయే విధులు నిర్వహించాలో కూడా హిట్లర్ ఆజ్ఞాపించాడు. ఈ ఆదేశం సైనిక అవసరమని హిట్లర్ సమర్థించుకున్నాడు. కాని తన ఓటమికి కారణమైన జర్మన్ ప్రజల్ని శిక్షించాలన్నది అసలు ఉద్దేశం.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
మంగళవారం | మార్చి 26, 2024 | www.navatelangana.com



పాడి రైతులకు పోషణ భారం

- పశుగ్రాసం కొరతతో అల్లాడుతున్న పశువులు
- పంటలు సాగు నామమాత్రమే
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ- కల్లూరు

వాతావరణం అనుకూలించక ఖరీఫ్‌లో పంటలు సాగు పూర్తిస్థాయిలో లేకపోవడం, దీనికి తోడు రబీ పంట అసలు సాగే లేకపోవడం వెరసి ఈ ఎండాకాలంలో పశువుల మేత దొరికే పరిస్థితి కనిపించడం లేదు. మార్చి నెలలోనే ఎండలు విపరీతంగా ఉండటంతో పశుగ్రాసం కొరత ఏర్పడి పశువులకు మేత కరువై అల్లాడిపోతున్నాయి. ప్రతి ఏడాది మండలంలో సుమారు 31వేల ఎకరాల్లో రబీ, ఖరీఫ్‌లో పుష్కలంగా వరి పంట సాగు చేసేవారు. దీంతో కల్లూరు మండలం నుండే ఇతర మండలాలకు టన్నులు కొద్ది వరిగడ్డి రైతులు అమ్మేవారు. ప్రస్తుతం కల్లూరు మండలంలో పశుగ్రాసం దొరక్క బయట పచ్చటి మేత దొరక్క పాడిపశువుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.వ్యవసాయంలో వచ్చే ఆటుపోట్లు తట్టుకునేందుకు ప్రతి రైతు తమ స్తోమత కొద్దీ పాడి పశువుల పెట్టుకొని ఆర్థిక ఇబ్బందులు లేకుండా పాడి వల్ల ఎంతో కొద్దిగా రైతుకు తోడ్పడుతుంది. మండలంలో మొత్తం 30 వేల పశువులు ఉండగా అందులో 24 వేలు పాడిపశులు ఉన్నాయి. 6 వేలు ఆవులు ఉన్నాయి. ఖరీఫ్‌లో అరకొరగా పండిన పంట అందులో వరి కోత మిషన్‌తో కోయటం వల్ల వరిగడ్డి పూర్తిస్థాయిలో రైతులు చేతికి రావడం లేదు. ప్రస్తుతం మండలంలో వరిగడ్డి కట్ట 120 రూపాయలుపై గానే పలుకుతుంది. అంతపెట్టి కొని పాడిపశువులను పోషణ చేయటం రైతుకు తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వం పశు గ్రాసం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం పాడి రైతులకు శాపంగా మారింది.

పశుగ్రాస విత్తనాలు జాడే లేదు

ప్రతి ఏడాది వేసవికాలం వస్తుందంటే ప్రభుత్వం పశుగ్రాస సాగు చేయడం కోసం 90 శాతం రాయితీపై రైతులకు పశుగ్రాస విత్తనాలు సరఫరా చేసేది. దీంతో అవకాశం ఉన్న రైతులందరూ తమకున్న భూమిలో పశుగ్రాసం సాగు చేసి పశు పోషణకు దోహదపడేది . అలాంటిది ఈ ఏడాది ఎండాకాలం కంటే మార్చి నెలలోనే విపరీతమైన ఎండలు రావడం పశువుల కూడా బయట తాగునీరు దొరికే పరిస్థితి లేదు. దీనికి తోడు ప్రభుత్వం పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు గ్రాసం విత్తనాలు సరఫరా చేయాల్సి ఉండగా నేటి వరకు పశుగ్రాసం విత్తనాల ఊసే లేదు. ఈ మండలంలో ఎండాకాలం మూడు నెలల పాటు పశువులకు మేత అందించాలంటే కనీసం వెయ్యి టన్నుల పశు గ్రాసం అవసరం ఉంటుందని పశువైద్య శాఖ అంచనా వేసింది. పశుగ్రాసం విత్తనాలు సరఫరా చేసిన నీటి వనరు ఉన్న రైతులు పశుగ్రాసం సాగు చేసే అవకాశం ఉండేది. ఇప్పటికైనా ప్రభుత్వం పశుగ్రాసం విత్తనాలు పూర్తిస్థాయి సబ్సిడీలో సరఫరా చేయాలని మండల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నా కొడుకును చంపేశారు..!

- ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు...
- పలుమార్లు దాడి చేశారు...
- మా కుటుంబాన్ని వేధిస్తున్నారు..
- పోలీసులు చర్యలు తీసుకోవాలి..
- ఓ నిరుపేద తల్లి ఆవేదన



నవతెలంగాణ- ఖమ్మం

తన కుమారుడు హరివెంకటనారాయణ (గుండు) (19)ను చిత్ర హింసలకు గురిచేసి చంపివేశారని, ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరిస్తున్నారని ఖమ్మం నెహ్రూనగర్‌లోని మేకలబండపార్కు ఏరియాకు చెందిన దేవత్ జ్యోతి వాపోతోంది. తాము నివసించే ప్రాంతంలోనే ఉండే తాజనోత్ భద్రం, తాజనోత్ భరత్ గతంలో తన కుమారుడిపై పలుమార్లు దాడికి పాల్పడ్డారని తెలిపారు. తాము ఇంట్లో ఎవరూ లేని సమయంలో వచ్చి గుండును హతమార్చి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. హరివెంకటనారాయణ మరణానికి ముందు పలుమార్లు వీరు, వీరి గ్యాంగ్ దాడి చేసిందని తెలిపారు. ఈ మేరకు ఖమ్మం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అయినా ఆత్మహత్యగా కేసు నమోదు చేశారని జ్యోతి వాపోతున్నారు. తమ కుమారుడి ప్రమేయం లేకున్నా ప్రేమ వ్యవహారంలోకి లాగి దాడికి పాల్పడినప్పుడు కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. బీజేపీకి చెందిన తాజనోత్ భద్రం తనకున్న రాజకీయ పరపతిని ఉపయోగించి కేసు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని జ్యోతి వాపోయింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం...

పూర్వాపరాల్లోకి వెళ్తే...

దేవత్ జ్యోతి, అంధుడైన తన భర్త రవి (49), అత్త నాగమణి, కుమారులు హరి వెంకటనారాయణ, మధు (15) కలిసి మేకలబండ పార్క్ ప్రాంతంలో జీవిస్తోంది. స్థానికంగా ఓ హెూటల్‌లో పనిచేస్తోంది. ఆమె కుమారుడు గుండు టీఎస్‌ఆర్టీసీ కార్గోలో పనిచేస్తున్నాడు. వీరి ఇంటికి సమీపంలోనే వరుసకు బాబాయి అయ్యే దేవత్ రవి, లక్ష్మి పిల్లలతో కలిసి ఉండేవారు. రవి కూతుళ్లలో ఒకరు ఓ కుర్రాడితో ప్రేమలో పడింది. ఈ వ్యవహారంలో హరి ప్రమేయం ఉందని భావించి తాజనోత్ భద్రం, భరత్ ఆయన భార్య భరణి మరికొందరు కలిసి హరిని ఫిబ్రవరి 5వ తేదీన కిడ్నాప్ చేశారు. స్థానికంగా ఉన్న ఓ క్వరీ పాయింట్‌లో తీవ్రంగా కొట్టి చిత్రహింసలకు గురిచేశారు. ప్రైవేట్ పార్ట్స్‌లో కారం కుక్కారు. విషయాన్ని బయటకు చెప్పొద్దని ఒట్టు వేయించుకున్నారు. ప్రాణభయంతో హరి విషయాన్ని తన తల్లికి తెలపాడు. బయటకు చెపితే చంపివేస్తామని బెదిరించడంతో చేసేది లేక రఘునాథపాలెం మండలం జీకే బంజరలోని తన తమ్ముడి ఇంటికి కుమారున్ని పంపించింది జ్యోతి. ఈనెల 5వ తేదీన తిరిగి ఖమ్మం వచ్చిన హరిపై 6వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో తాజనోత్ సాయి తమ ఇంటికి వచ్చి దుర్భాషలాడుతూ దాడి చేస్తుండగా స్థానికంగా ఉన్న కొందరు యువకులు అడ్డుపోయారు. ఆ సమయంలో దుంగ్రోత్ విక్రమ్‌కు తీవ్ర గాయమైంది. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా సాయి తన చేతిపై తానే గాయం చేసుకుని గొడవలో తనను గాయపరిచినట్లుగా ఆరోపించాడు. పోలీసులు ఇరువర్గాలకు రాజీ కుదిర్చారు. అయినప్పటికీ హరిని వెంబడిస్తూ ఈనెల 13న తాము ఎవరిమి ఇంట్లో లేని సమయంలో భద్రం, భరత్ వచ్చి హరిని ఉరివేసి హతమార్చారని, ఆపై ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని జ్యోతి వాపోయింది. 5.8 అడుగుల ఎత్తు ఉండే తమ కుమారుడి కాళ్లు కింద ఆనుతున్నా పోలీసులు ఆత్మహత్యగా కేసు నమోదు చేశారని తెలిపింది. తన కుమారుడి మరణానికి కారణమైన తాజనోత్ భద్రం, భరత్, సాయి, తాజనోత్ ధరణిలపై కేసు నమోదు చేసి...విచారించాల్సిందిగా జ్యోతి కోరుతోంది.



రంగుల హోలీ... సరదాల కేళి...

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మండలంలోని అన్ని గ్రామాల్లో హెూలీ వేడుకలను యువ కులు, చిన్నారులు, మహిళలు సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. పెద్దతండా కేబీఆర్ నగర్‌లో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో హెూలీ పండుగ నిర్వహించారు. రంగులు చల్లుకొని ఆడిపాడారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేనా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బానోత్ కిషన్ నాయక్ మాట్లాడారు. గిరిజన, బంజార సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా సోదరభావంతో, ఇతరుల పట్ల అనురాగంతో కలిసి మెలసి జీవించడమే హెూలీ ప్రత్యేకత అని వివరించారు. కార్యక్రమంలో రాజ్ కుమార్, రామ్మూర్తినాయక్, దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. గొల్లగూడెం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి హెూలీ సంబురాలు చేశారు. విద్యార్థులు రంగులు చల్లుకొని ఉత్సాహంగా కేరింతలు కొట్టారు.

13న శ్రీవేణుగోపాలస్వామి వారి కల్యాణం

మాజీ ఎంఎల్‌ఏ సండ్రకు ఆహ్వానం



నవతెలంగాణ-సత్తుపల్లి

వచ్చేనెల 13వ తేదీన సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జవహర్‌నగర్ శ్రీకృష్ణమందిరంలో నిర్వహించనున్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణానికి ఆ ఆలయ కమిటీ బాధ్యులు సోమవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు ఆహ్వాన పత్రికను అందించారు. స్థానిక పాత సెంటరులో గల సండ్ర క్యాంపు కార్యాలయంలో కలిసిన కమిటీ బాధ్యులు ఆహ్వానం పలికి సండ్రను సాదరంగా ఆహ్వానించారు.

తూతూమంత్రంగా అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్

- ఉపయోగంలేని చోట ఏర్పాటు
- అబాసుపాలవుతున్న అధికారుల తీరు

నవతెలంగాణ - బోనకల్



బోనకల్‌లో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్

పార్లమెంట్ ఎన్నికల ప్రకటించడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న బోనకల్, వత్సవాయి గ్రామాల మధ్య అంతర్ రాష్ట్ర చెక్ పోస్టును అధికారులు ఇటీవల హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేశారు. అయితే వైరా ఏసిపి ఆదేశాలతో అక్కడ నుంచి చెక్ పోస్టును స్థానిక శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలెస్ సమీపానికి మార్చారు. ఇక్కడకు ఈ చెక్ పోస్ట్ మార్చడంతో తూతూమంత్రంగా మారింది. రెండు రాష్ట్రాల నుంచి దర్జాగా ప్రవేశించేందుకు బోనకల్ బ్రాంచ్ కెనాల్ రహదారి ఉంది. ఇక్కడ చెక్ పోస్టును ఏర్పాటు చేయకుండా అధికారులు బోనకల్లో ఏర్పాటు చేశారు. బోనకల్లులో ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్ పోస్ట్ నవ్వుల పాలవుతుంది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులుగా ఉండటంతో బోనకల్ గ్రామం ప్రాంతం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి దర్జాగా ప్రవేశించేందుకు వత్సవాయి, పెంటేలవారిగూడెం మీదుగా తెలంగాణ రాష్ట్రంలోని చొప్పకట్లపాలెం, ముష్టికుంట మీదుగా ఖమ్మం దర్జాగా వెళ్ళవచ్చు. ఇది దూరం కావటంతో ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే వాహనాలు బోనకల్ వత్సవాయి గ్రామాల మధ్య గల బోనకల్ గ్రామ సమీపంలో బోనకల్ బ్రాంచ్ కెనాల్ ఉంది. ఈ బోనకల్ బ్రాంచ్ కెనాల్ రహదారి నుంచి ఇరు రాష్ట్రాలకు చెందిన వాహనాలు దర్జాగా రాకపోకలు సాగించవచ్చు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారులు తొలుత, ప్రస్తుతం ఏర్పాటు చేసిన స్థలంలోనే అంతర్ రాష్ట్ర చెక్ పోస్టను అధికారులు ఏర్పాటు చేశారు. చెక్ పోస్టుకు సమీపంలోనే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉంది. బ్యాంకుకు వెళ్లేవారు, బ్యాంకు నుంచి నగదు తెచ్చుకునే వారిని సైతం అక్కడ చెక్ పోస్ట్ సిబ్బంది తనిఖీ చేసి పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. బ్యాంకు ఖాతాదారుల ఇబ్బందులను, ఉపయోగం లేని చోట అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ ఏర్పాటు అంటూ 'నవ తెలంగాణ' కథనాలను ప్రచురించింది. దీంతో మండల, జిల్లా ఎన్నికల అధికారులు వెంటనే రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న బోనకల్ బ్రాంచ్ కెనాల్ వద్దకు అంతర్ రాష్ట్ర చెక్ పోస్టను మార్చారు. దీంతో వాహనాలు దొంగ చాటుగా వెళ్లకుండా నిరోధించగలిగారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వలన దర్జాగాళ్ళకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ప్రస్తుతం ఎన్నికల లేకపోవడంతో పెద్దగా వాహనాలు బోనకల్ బ్రాంచ్ కెనాల్ రహదారి నుంచి వెళ్ళటం లేదు. ఎన్నికల సమయంలో అక్రమంగా నగదు, ఇతర వస్తువులు తరలించకుండా ఉండేందుకే అంతర్ రాష్ట్ర చెక్ పోస్టను ఏర్పాటు చేసినప్పటికీ దాని లక్ష్యం నెరవేరే పరిస్థితి లేదు. బోనకల్లులో ఏర్పాటుచేసిన అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ పేరుకు మాత్రమే కొనసాగుతుంది. దీనివలన జరిగే ఉపయోగం ఏమీ లేదని మండల ప్రజలు అంటున్నారు. ఏర్పాటు చేయవలసిన స్థలంలో అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేయకుండా అవసరము లేని చోట అంతర్ రాష్ట్ర చెక్పోస్టును ఏర్పాటు చేశారని మండల ప్రజలు అంటున్నారు. దీంతో ఈ చెక్‌పోస్ట్ నవ్వుల పాలవు తుంది. ప్రస్తుతం కొన్ని దొంగ వాహనాలు అప్పుడప్పుడు బోనకల్ బ్రాంచ్ కెనాల్ రహదారి గుండా వెళ్తున్నాయని స్థానికులు అంటున్నారు. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన వాహనాలు మాజీ జెడ్పిటిసి మంద బాబురావు స్తూపం నుంచి బోనకల్లులోని దళిత కాలనీ నుంచి ఆళ్ళపాడు - బోనకల్ రోడ్డు ద్వారా, అదేవిధంగా శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలెస్ వరకు చేరుకొని వైరా, ఖమ్మం వైపు దర్జాగా వెళు తున్నారు. దీంతో ఈ అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ నామమాత్రపు వాహనాల తనిఖీ కేంద్రంగా మారిందని స్థానికులు నుంచి విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత స్థలంలో ఏర్పాటు చేసిన ఈ అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ వలన జీరో ఉపయోగమని, అధికారులు తెలిసి ఏర్పాటు చేశారా? లేక ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేయాలి కాబట్టి తూతూ మంత్రంగా ఏర్పాటు చేశారా అనే విమర్శలు పెద్ద ఎత్తున విని పిస్తున్నాయి. బోనకల్ చెక్ పోస్ట్ వద్ద సిబ్బంది నిత్యం వాహనాలు తనిఖీ చేస్తున్నప్పటికీ నేటికీ ఒక్క పైసా అక్రమ నగదు దొరకక పోవటం విశేషం. ఈ చెక్ పోస్ట్ వద్ద అధికారులు వాహనాల తనిఖీ చేయక తప్పడం లేదని, కాని ఉపయోగం లేకపోవడం మరో విశేషం. ఇప్పటికైనా సంబంధిత ఎన్నికల అధికారులు వాస్తవ పరిస్థితులను గమనించి వెంటనే అవసరం ఉన్నచోట కు ప్రస్తుతం ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను మార్చాలని దీనివలన ఎన్నికల అధికారుల ఉద్దేశం, లక్ష్యంతో పాటు అక్రమ నగద రవాణా అరికట్టాలని ఉద్దేశం నెరవేరుతుందని స్థానికులు అంటున్నారు.



రెండు రాష్ట్రాలకు దర్జాగా ఉన్న రహదారి

ముగిసిన రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పూటీ పందాలు

నవతెలంగాణ -ఎర్రుపాలెం




మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో ఉన్న శ్రీ అంకమ్మ తల్లి, అక్కమ్మ పేరంటాల రామలింగేశ్వరస్వామి తిరుణాళ్ళ మహెూత్సవం సందర్భంగా శనివారం రెండు రాష్ట్రాల స్థాయి ఖమ్మం, ఆంధ్ర రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు జిల్లాల స్థాయిలో ఎడ్ల పూటీ పందాలు ఘనంగా ముగిసాయి. ఈ పోటీలో 20 జతల ఎడ్లు పాల్గొన్నట్లు కమిటీ వారు తెలిపారు. ఈ పోటీలో ఖమ్మం జిల్లా బనిగండ్లపాడు గ్రామానికి చెందిన తల్లపురెడ్డి అంకాల్ రెడ్డి ఎడ్లు 2,601 అడుగులు లాగి ప్రథమ బహుమతిని (రూ.30వేలు) గెలుపొందారు. ఆంధ్ర రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల గ్రామానికి చెందిన షేక్ హజ్మీయ ఎడ్లు 2,285 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి (25వేలు), ఖమ్మం జిల్లా బనిగండ్లపాడు గ్రామానికి చెందిన తల్లపురెడ్డి రామిరెడ్డి ఎడ్లు 2,229 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతి బహుమతి (20వేలు), ఖమ్మం జిల్లా మధిర గ్రామానికి చెందిన మోహన్ ఎడ్లు 2,225 అడుగుల దూరం లాగి చతుర్థ బహుమతి (15,116) సాధించారు. ఈ బహుమతులను ఆలయ కమిటీ సభ్యులు, దాతలు వీఎస్‌కె కంస్ట్రక్షన్స్ అధినేత వేజెండ్ల సాయికుమార్, యన్నం సత్యనారాయణరెడ్డి, నీలం రవికుమార్, మాజీ కృష్ణారెడ్డి, శీలం నరేందర్‌రెడ్డి, బిందెల వెంకటనారాయణ, యరమల శ్రీనివాస్‌రెడ్డి, షేక్ సలాం, కంచేటి భద్రయ్య, శీలం వెంకటేశ్వర్‌రెడ్డి, శీలం సత్యనారాయణరెడ్డి, శీలం అక్కిరెడ్డి, బాణాల శ్రీనివాసరావు, శెట్టిపల్లి కృష్ణారెడ్డి, కొప్పుల శివ నాగరాజు, ఆలయ పూజారి వేమిరెడ్డి వెంకటరెడ్డి, గ్రామ పురోహితులు, అర్చకులు బ్రహ్మశ్రీ కాశావఝుల నరసింహమూర్తి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వ్యకాస మండల కార్యదర్శికి సతీవియోగం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు గామాసు జోగయ్య సతీమణి నారాయణమ్మ(36) రెండు రోజుల నుండి జ్వరంతో బాధపడుతూ సోమవారం మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని మండల పరిధిలోని నరసింహాపురంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, మధిర టౌన్ కమిటీ సభ్యులు పడకండి మురళి, బుచ్చిరెడ్డిపాలెం మాజీ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎర్రమల శ్రీనివాసరెడ్డి, మండల కమిటీ సభ్యులు గొల్లపూడి కోటేశ్వరరావు, నల్లమోతు హనుమంతరావు, జార్జి టెన్సన్, షేక్ లాల, ఆంగోత్ వెంకటేశ్వర్లు, రామిశెట్టి సురేష్, బేతి శ్రీనివాసరావు, గొర్రాజు రాములు, కూడలి నాగేశ్వరరావు, తాళ్లూరి వెంకటనారాయణ, కాలేశ్వరరావు, సుబ్బారెడ్డి, కోలారాములు, కిషోర్, ప్రతాపరెడ్డి, అనుమోలు కోటేశ్వరరావు, నాగులవంచ వెంకట్రామయ్య, సగ్గుర్తి సంజీవరావు,షేక్ నాగుల మీరా తదితరులు సందర్శించి నివాళ్లర్పించారు.





తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు విశ్వశాంతి విద్యార్థుల దరఖాస్తు

- రికార్డ్స్ సంస్థ నుంచి విద్యార్థులకు లభించిన అనుమతి

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి విశ్వశాంతి పాఠశాలలో చదువుతున్న 63మంది విద్యార్థులు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు ఇటీవల కాలంలో దరఖాస్తు చేసుకున్నారు. సదరు సంస్థ నుంచి దరఖాస్తు చేసుకున్న 63మంది విద్యార్థులకు అనుమతి లభించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు తెలిపారు. 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న ఈ 63మంది విద్యార్థులు 63రకాల శాస్త్రీయ వాస్తవాలు (సైంటిఫిక్ ఫ్యాక్ట్స్) గురించి 2గంటల పాటు నిరంతరం విశ్లేషణ చేయనున్నట్లు నాగేశ్వరరావు చెప్పారు. ప్రతిభగల విద్యార్థులను వివిధ సంస్థల రికార్డుల్లో పేరు నమోదు చేయించడంలో అనుభవం గడించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు బొల్లేపల్లి మధుసూదనరాజు, తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సీఈవో బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి శాస్త్రీయ వాస్తవాలు- వివరణ కార్యక్రమానికి సిద్ధమవుతున్న విద్యార్థులతో సోమవారం ఆ పాఠశాలలో సమావేశమయ్యారు. వారి ప్రతిభను పరిశీలించారు. రికార్డ్స్ నమోదు సందర్భంగా టీబీఆర్ సంస్థ నిర్వహించనున్న చివరి పరీక్షలో నెగ్గేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వారు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విశ్వశాంతి యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో పెద్దమండవ మున్నేరు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 4 ట్రాక్టర్లను సోమవారం సువర్ణాపురం వద్ద ఎస్సై గజ్జల నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకొని సీజ్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.నరేష్ తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నరేష్ హెచ్చరించారు.

రైతు బీమా.. కుటుంబాలకు ధీమా



నవతెలంగాణ- కూసుమంచి

రైతు బీమా.. రైతు కుటుంబాలకి ధీమాగా మారింది. బాధిత రైతు కుటుంబానికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వచ్చింది. రైతులకు అత్యంత ప్రయోజనంగా నిలిచిన, రైతు బీమా పథకం కొనసాగేందుకు కొత్త ప్రభుత్వం మొగ్గు చూపింది. ఇటీవల జరిగిన రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో రైతు బీమాకు నిధులు కేటాయించడంతో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రైతన్నలకు, రైతు కుటుంబాలకు బీమా పథకంపై ధీమా ఏర్పడింది.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి...

రైతన్నల కుటుంబంలో ఇంటి పెద్ద దిక్కు చనిపోతే భార్య, పిల్లలను ఆర్థికంగా ఆదుకునేందుకు 2018 సంవత్సరం ఆగస్టు 20 నుండి రాష్ట్రంలో రైతు బీమా పథకాన్ని అమలు తీసుకొచ్చారు. వార్షిక ప్రీమియం ప్రభుత్వం చెల్లించేలా ఎల్ఐసితో ఒప్పందం కొనసాగుతుంది. ఆగస్టు 19, 2023 సంవత్సరం వరకు చెల్లించినప్పటికీ, ఈ ఆగస్టులో ప్రీమియం చెల్లించాల్సి ఉంది. తాజాగా ప్రభుత్వం మారడంతో ఈ పథకం కొనసాగిస్తారా..? లేదా..? అనే సందిగ్ధం రైతన్నల్లో నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని కొనసాగించేలా నిధులు కేటాయింపుపై స్పష్టత ఇవ్వడంతో రైతన్నలు ఊపిరి పీల్చుకున్నారు .

రూ.5 లక్షల సహాయం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 18 నుండి 59 సంవత్సరాల వయసులోపు ఉన్న వారు ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. రైతు అకాల మరణం చెందితే ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతాతో పాటు నామిని పత్రాలు సమర్పిస్తే, రూ.5 లక్షల పరిహారం వారి ఖాతాలో పడే విధంగా క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు ప్రక్రియ చేపడుతారు.

2023-24లో 125 మంది రైతులు మృతి

2023-2024 సంవత్సరానికి గానూ కూసుమంచి మండలంలో 34 మంది, నేలకొండపల్లి మండలంలో 32 మంది, తిరుమలాయపాలెం మండలంలో 31 మంది, ఖమ్మంరూరల్ మండలంలో 28 మంది రైతులు మృతి చెందారు. పాలేరు నియోజకవర్గం వ్యాప్తంగా 125 మంది రైతులు మృతిచెందగా వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రైతు బీమా నగదు చెల్లించారు.

పరిహారంతో రైతు కుటుంబాల్లో ఊరట

ఏడిఎ విజయచంద్ర

ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకం రైతు కుటుంబాలకు భరోసానిస్తుంది. రైతులు ఏదైనా కారణాలతో అకారణంగా మృతి చెందటం బాధాకరమైనప్పటికీ, ప్రభుత్వం ఆ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించి వారి కుటుంబాలకు ఊరట కలిగిస్తుంది.


తిరుమలాయపాలెంలో..

విద్యుద్ఘాతంతో మహిళ మృతి



నవతెలంగాణ-కొణిజర్ల

కూతురు, కూమారుడుతోపాటు బంధువులతో కలిసి హోలీ జరుపుకుని రంగులు పూసుకుంటూ సరదాగా సంతోషంగా ఉన్న ఆ కుటుంబంలో పెను విషాదం చోటుచేసుకుంది. మండల పరిధిలోని సీంగరాయపాలెం గ్రామానికి చెందిన సురభి రాజశేఖర్ గీత దంపతులు ఖమ్మంలో నివసిస్తున్నారు. రాజశేఖర్ తల్లి ఆనారోగ్యానికి గురికావడంతో భార్య గీత (25) పిల్లలతో కలసి సీంగరాయపాలెం ఆదివారం వచ్చింది. సోమవారం ఉదయం హోలీ పండుగ కావడంతో పిల్లలు బంధువులతో కలిసి రంగులు పుసుకున్నారు. ఈ క్రమంలో బట్టలు దండెంపై ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గీతకు భర్త రాజశేఖర్, కూతురు దీక్ష (12) కూమారుడు దార్విక్ (6) పిల్లలు ఉన్నారు. గీత మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గీత మృతదేహం వద్ద పిల్లలు, కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. గీత భర్త రాజశేఖర్, అత్త లక్ష్మి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పంచనామా నిర్వహించారు.

నేడు ఈజీఎస్ సామాజిక తనిఖీ పై అంతర్గత సమావేశం

నవతెలంగాణ-కారేపల్లి

జాతీయ ఉపాధీ హామీ పథకం సామాజిక తనిఖి పై 26వ తేది మంగళవారం అంతర్గత విచారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇంచార్జీ ఎంపీడీవో పర్వీన్ క్రైసర్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో 15వ విడుత సామాజిక తనిఖీపై ఎంపీడీవో కార్యాలయంలో ఇన్నర్ ఫోరం జరపటానికి ఉన్నతాధికారులు అదేశించినట్లు ఆమె తెలిపారు. కారేపల్లి మండలంలోని 41 గ్రామపంచాయతీలలో జాతీయ ఉపాధీ హామీ పథకంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులను మార్చి 13వ తేది నుండి 25వ తేది వరకు అధికారులు తనిఖీ చేసి నివేదికలను తయారు చేశారు. దీనిపై ఓపెన్ ఫోరం నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల దృష్ట్యా దానిని ఇన్నర్ ఫోరంగా మార్చారు.

కమలాపురం అంకమ్మ తిరునాళ్లు ప్రారంభం

నవతెలంగాణ-ముదిగొండ

మండలంలోని కమలాపురంలో అంకమ్మ, మహాలక్ష్మి మద్దిరావమ్మ దేవాలయంలో సోమవారం అంకమ్మ తిరునాళ్ల ప్రారంభమైంది. అంకమ్మ జాతర ఐదు రోజులపాటు కొనసాగుతుంది. ఈ జాతరలకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, భక్తులుతోపాటు, నేలకొండపల్లి, చింతకాని మండలాల వాసులు అధికసంఖ్యలో హాజరవుతారు. ఈ సందర్భంగా సంస్కృతిక కార్యక్రమాలు దేవాలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈనెల 29తో జాతర ముగియనున్నది.



కనకదుర్గ గుడి నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-కల్లూరు

పట్టణ పరిధిలోని పెద్ద చెరువుకట్ట మీద గల శ్రీ శివ ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో కనకదుర్గ అమ్మ వారి దేవాలయం నిర్మాణనికి సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సోమవారం శంకుస్థాపన చేశారు. కనకదుర్గ అమ్మవారి గుడి నిర్మాణం పొట్రూ కృష్ణయ్య చేపట్టనున్నారు. శివ ఆంజనేయ స్వామి గుడిలో పూజా కార్యక్రమంలో వారు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం చిట్లూరి నాగేశ్వరరావు గృహంలో హెూలీ పండుగ సందర్భంగా నిర్వహించిన శ్రీకృష్ణుని కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు చోట్ల ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రావు, భాగం ప్రభాకర్ చౌదరి, బైర్ల కాంతారావు, ఉబ్బన గోపాలస్వామి, బుర్రి వీరయ్య, బొప్పన శ్రీనాథ్, కాంగ్రెస్ కల్లూరు పట్టణ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కోదండ రామాలయంలో ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని పినపాక శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలను సోమవారం ప్రారంభించారు. రాములవారికి పంచామృతంతో చందనాది అభిషేకం, పసుపు కొట్టుట, వసంతోత్సవం కార్యక్రమం నిర్వహించారు. అర్చక స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి కల్యాణం

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ గ్రామంలో ఉన్న శ్రీ రుక్మిణి సమేత సంతాన వేణుగోపాలస్వామి వారి కళ్యాణం మహెూత్సవం సోమవారం రాత్రి నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, మంగళ తోరణాలంకరం, పంచామృతాభిషేకములు, 10 గంటలకు జోగి, గోపూజ, సాయంత్రం ఐదు గంటలకు కళ్యాణమూర్తుల గ్రామ ఉత్సవం కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కంచర్ల సతీష్ శర్మ పూజా కార్యక్రమం నిర్వహించారు.

హోలీ...రంగుల కేళీ...


సత్తుపల్లిలో...

నవతెలంగాణ-సత్తుపల్లి

రంగుల పండుగ హోలీ సంబురాలను సోమవారం సత్తుపల్లిలో ఉత్సాహంగా జరుపుకున్నారు. రాజస్థాన్ నుంచి సత్తుపల్లి వచ్చి ఇక్కడ వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్న మార్వాడీలంతా కలిసి పట్టణంలోని వేంసూరు రోడ్డులో ఉన్న శ్రీమెట్టాంజనేయస్వామి ఆలయంలో ఈ సంబురాలను డీజే సౌండ్స్ నడుమ పాటలు, నృత్యాలు చేసుకుంటూ హెూలీ సంబురాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా ఈ హెూలీ సంబురంలో వాళ్లతో కలిసి పాల్గొన్నారు. వాళ్ల సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యే దంపతులకు మార్వాడీలు తలపాగాలు కట్టి గౌరవించారు. ఈ సందర్భంగా మార్వాడీలతో కలిసి ఎమ్మెల్యే దంపతులు డ్యాన్స్ వేశారు. మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని రాజస్థానీయులతో పాటు కాంగ్రెస్ నాయకులు కొత్తూరు ప్రభాకరరావు, మానుకోట ప్రసాద్, కమల్‌పాషా, సందీప్, డ్యాన్స్ మాస్టర్ గణేశ్, డీఎస్. చారి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు, శ్రీనివాస్, ఆలయ కమిటీ బాధ్యులు మానుకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో...

ఖమ్మం : పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సమక్షంలో పోలీసు సిబ్బంది రంగులు జల్లుకుంటూ సందడి చేశారు. పోలీస్ బ్యాండ్ చప్పుళ్లతో హెడ్ క్వార్టర్స్ దద్దరిల్లిపోయింది. పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఎదుట ఉన్న కవాతు మైదానంగా అధికారులు, సిబ్బంది కలిసి నృత్యాలు చేశారు. ఈ ఉత్సవాల్లో అడిషనల్ డీసీపీ నరేష్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ప్రసన్న కుమార్, ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్ సింగ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కామరాజు, శ్రీశైలం, సురేష్, అప్పలనాయుడు, సిఐలు రమేష్, శ్రీహరి, ఇతర అధికారులు చేతులు కలిపి ఉత్సాహంగా సందడి చేశారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో....

ఖమ్మం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం హెూలీ సంబురాలు జరుపుకున్నారు. జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లు ఆటాపాటలతో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. హెూలీ పండుగను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

కామేపల్లి : మండలంలో హోలీ సంబరాలు అంబరానంటాయి. సోమవారం ప్రజలు రంగులు చల్లుకోని అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పిల్లల నుండి పెద్దల వరకు రంగులు పూసుకోవడంతో రహదారులు సైతం రంగుల మాయమయ్యాయి. దీంతో గ్రామాలలో సందడి నెలకొన్నది. వేసవి కాలం కావడంతో అనంతరం రంగులు


ఖమ్మం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో....

చల్లుకున్న వారందరూ దగ్గరలో ఉన్న బోరు బావులు, చెరువుల వద్దకు వెళ్లి ఈతలు కొట్టి కేరింతలు కొట్టుకుంటూ ఆనందంగా గడిపారు. దీంతో హెూలీ సంబరాలు అంబరాన్నంటాయి.

కల్లూరు : మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో హోలీ పండగ సందర్భంగా సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తండాల్లో గిరిజనులు అంతా ఒక చోటకు చేరి ఒకరికొకరు రంగులు పూసుకుంటూ డాన్సులు నృత్యాలు చేశారు. హనుమతండ గ్రామపంచాయతీలో మాజీ సర్పంచ్ తరావత్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో హెూలీ వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా అన్ని గ్రామ పంచాయతీల్లో కల్లూరు పట్టణంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి సంఘటన జరగకుండా ఎస్సై ఎస్‌కే.షాకీర్ ఆధ్వర్యంలో ఆ గ్రామాల్లో పోలీసు నిఘాలు పెట్టి పండగ వేడుకలు ప్రశాంతంగా జరిగే విధంగా చూశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు ధరావత్ మోహన్, ధరావత్ రవికుమార్, గూగుల్ శరత్ బాబు, భాను, శ్రీను, బాలు, గూగుల్ అశోక్, ధరావత్ శ్రీకాంత్, ధరావత్ శివాజీ, డి. హరి, బానోత్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి : మండల వ్యాప్తంగా హెూలీ వేడుకలు సోమవారం సంబరంగా నిర్వహించారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో హెూలీ పండుగను రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. మహిళలు, చిన్నారులు, యువతీ, యువకులు, రంగులు చల్లుకుంటూ డాన్స్ చేశారు. యువకులు మోటర్ బైక్‌లపై వీధుల్లో కేరింతల కొడుతూ రంగుల జల్లుకుంటూ హెూలీ వేడుకలు నిర్వహించారు.

కారేపల్లి : హోలీ వేడుక కారేపల్లి మండలంలో సోమవారం సందడిగా సాగింది. యువత రంగులు చల్లుకుంటూ రోడ్లపై కేరింతలు కొడుతూ, నృత్యాలు చేస్తూ జరుపుకున్నారు. మోటర్ సైకిళ్ల పై తిరుగుతూ తోటి మిత్రులకు రంగులు చల్లుతూ కోడి గ్రుడ్లు కొడుతూ యువత అనందోత్సవాలతో అల్లరి చేశారు. తండాల్లో హెూలీ వేడుకలలో మహిళలు ఉత్సహంగా పాల్గొన్నారు. బంజారా మహిళలు సాంప్రదాయ నృత్యాలు చేస్తూ వరసైనా వారిని అటపట్టిస్తూ సరదాగా జరుపుకున్నారు. బీక్యాతండా వేడుకలో బీఆర్ఎస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి, భాగ్యనగర్‌తండాలో సొసైటీ డైరక్టర్ బానోత్ హిరాలాల్, కాంగ్రెస్ నాయకులు బోడా సెట్‌రాం పాల్గొని యువతను, మహిళలను ఉత్సహపరిచారు. బీసీ కాలనీ మహిళలు పెద్ద ఎత్తున కదిలి రంగులు చల్లుకుంటూ సంబురాలు జరిపారు. ప్రతి ఏడాది హెూలీ వేడుకను రెండు రోజులు చేస్తున్నారు. పంచాగం అనుసరించి సోమవారం చంద్రగ్రహణం ఉందంటూ కొన్ని గ్రామాల్లో ఆదివారమే హెూలీ జరుపుకున్నారు. దేవుడి పెళ్ళిల్లు సైతం జరిపారు.

తిరుమలాయపాలెం : మండల పరిధిలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం, బచ్చోడు, సుబ్లేడు, బీరోలు, జల్లేపల్లి, పాతర్లపాడు, సోలిపురం, కాకరవాయి, కొక్కిరేణి, జూపెడ, హస్నాబాద్ పలు గ్రామాల్లో సోమవారం ఆనంద ఉత్సవాల మధ్య హెూలీ ఉత్సవాలు నిర్వహించారు. చిన్నారులు రంగులు చదువుకొని ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటూ రంగేళి హెూలీ అంటూ గట్టిగా కేకలు వేస్తూ ఆనందోత్సవాల మధ్య హెూలీ పండుగను జరుపుకున్నారు.

ముదిగొండ : మండలంలోని వివిధ గ్రామాల్లో హెూలీ పండుగను పురస్కరించుకొని ప్రజలు, యువతి, యువకులు, చిన్నారులు మహిళలు హెూలీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద ఉత్సవాల మధ్య యువకులు చిన్నారులు మహిళలు రంగుల చల్లుకొని సంతోషాన్ని వెల్లబుచ్చారు.

మధిర : పట్టణంలోని స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో రంగుల కేళి హెూలీ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పల్లపోతు ప్రసాదరావు, ఆదూరి అబ్రహం, గండూరి రాంబాబు, చల్లా సత్యనారాయణ, జింకల కోటేశ్వరరావు, హనుమ, వేముల నవీన్ కుమార్, బజాజ్ సాంబిరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, ఊట్కూరి భాస్కరరావు, రంగిశెట్టి శ్రీనివాసరావు, తూమురి రాజా, పున్నయ్య, ప్రసాద్ రావు, సతీష్, నవీన్ (టీచర్), కంచిపోగు ఆదాం, దారా సుధాకర్, ఇన్ స్టైల్ రాము తదితరులు పాల్గొన్నారు.

బోనకల్ : మండల పరిధిలోని రావినూతల బోనకల్ గ్రామాలలో హెూలీ వేడుకలను సోమవారం గిరిజనులు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలో యువకులు రంగులు పూసుకుంటూ హెూలీ వేడుకలను జరుపుకున్నారు. మండలంలోని అనేక గ్రామాలలో రంగులు పూసుకుంటూ హెూలీ వేడుకలను నిర్వహించారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ తమ అభిమానాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేసుకున్నారు. ప్రధానంగా బోనకల్లు, రావినూతల గిరిజన కాలనీ వాసులు హెూలీ పండుగను రంగ రంగ వైభవంగా నిర్వహించుకున్నారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ కేకలు వేస్తూ ఆనందంతో గడిపారు. ఈ కార్యక్రమంలో గూగులోతు రామకృష్ణ, గూగులోతు శారద, గూగులోతు రాములు, పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.


సత్తుపల్లిలో...


ఖమ్మం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో...


కారేపల్లిలో


బోనకల్‌లో..


మధిరలో..


కామేపల్లిలో..


కల్లూరులో

మతోన్మాది మోడీని ఓడించడమే భగత్ సింగ్‌కి నిజమైన నివాళి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్



నవతెలంగాణ-ముదిగొండ

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద మోడీని ఓడించటమే భగత్ సింగ్‌కు అర్పించే నిజమైన నివాళిని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ అన్నారు. ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదంపై సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా, దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన విప్లవీరులన్నారు. ఈ దేశంలో కుల, మత, పేద, ధనిక అనే తారతమ్యాలు లేకుండా జీవించాలంటే సోషలిజమే మార్గమని చెప్పారన్నారు. భగత్ సింగ్ ఆశయ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భగత్ సింగ్ చిత్రపటానికి పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించి మచ్చా వీరయ్య భవనం నుండి ప్రధాన సెంటర్ వరకు నినాదాలు ఇస్తూ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బోడ వెంకట్, గోపి, సమీర్ తిలక్, పోనుకుల చరణ్, సంతోష్, బాబు, అభిరామ్ వినయ్, రాజు, మహేష్, చందు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్
- గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలి
- డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు మాజీ నర్రా రమేష్



నవతెలంగాణ-ఖమ్మం

క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ అన్నారు. సోమవారం ఖమ్మంలోని ఎన్ఎస్టీ రోడ్‌లోని గ్రౌండ్లో డీవైఎఫ్ఐ ఖమ్మం టూ టౌన్ కమిటీ, స్ఫూర్తి అకాడమీ ఆధ్వర్యంలో క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గ్రామీణ ప్రాంత క్రీడలలో ముందుండాలని, క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. మాజీ రాష్ట్ర నాయకులు నర్రా రమేష్ మాట్లాడుతూ యువత మతోన్మాదం వైపు కొట్టుకుపోకుండా దేశభక్తి గల భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బుర్రి వెంకట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఎన్నికల్లో...
యునైటెడ్ లెఫ్ట్ ప్యానెల్ విజయం

- మతోన్మాద, ఫాసిస్టు బీజేపీకి చెంపపెట్టు
- పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్



నవతెలంగాణ-ఖమ్మం

దేశ రాజధాని న్యూఢిల్లీలో ఉన్న ప్రతిష్టాత్మక యూనివర్సిటీ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో యునైటెడ్ లెఫ్ట్ ప్యానెల్ విజయం సాధించడం పట్ల పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి, దానికి వత్తాసు పలుకుతున్న ఏబీవీపీకి చంపపెట్టు అని తెలిపారు. నకిలీ దేశభక్తి జాతీయత పేరుతో పచ్చి కార్పొరేట్ విధానాలను 10 సంవత్సరాల పాలనా కాలంలో బీజేపీ అవలంబించిందని, కార్పొరేట్ కంపెనీలకు 25 లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేసి, పేద ప్రజలపై పనుల భారాన్ని మోపిందని, నిత్యవసర సరుకుల ధరలను పెంచిందని, దేశ ప్రజల జీవన ప్రమాణాలు తగ్గుతుంటే రామాలయం నిర్మాణం, భారీ విగ్రహాలను నెలకొల్పి ప్రజల మధ్య మతోన్మాదాన్ని, భావోద్వేగాలను రెచ్చగొట్టి వీరి విధానాలపై ఐక్యం కాకుండా కుట్రలు చేస్తుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గెలవడానికి రాజ్యాంగబద్ధ సంస్థలైన ఐటీ, ఈడీ, ఎన్ఐఏలను ప్రయోగించడం, ప్రతిపక్ష పార్టీల బ్యాంకు ఎకౌంట్‌లను నిలిపివేయడం ద్వారా తన ఫాసిస్టు చర్యలను వేగవంతం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి జేఎన్‌యూ విద్యార్థులు తమ ప్రతిష్టాత్మకమైన తీర్పు ద్వారా బీజేపీకి బుద్ధి చెప్పారని తెలిపారు. గెలిచిన యునైటెడ్ లెఫ్ట్ ప్యానెల్‌కు అభినందనలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఇదే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా విద్యార్థులు బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

వామపక్ష కూటమి విజయం పట్ల హర్షం



నవతెలంగాణ-ఖమ్మం

ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో వామపక్ష కూటమి విజయదుందుభి మోగించింది. పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ ఏబీవీపీ విద్యార్థి సంఘాన్ని ఓడించి తమ సత్తా చాటిందని, అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎన్నికల్లో వామపక్ష కూటమి ఘన విజయం సాధించడం పట్ల ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ జేఎన్‌యూ ఎన్నికల్లో వామపక్ష కూటమి విజయం సాధించడం సంతోషకరమన్నారు. ఈ విజయం మతోన్మాద శక్తులకు స్థానం లేదని సంకేతమిచ్చిందన్నారు. రానున్న కాలంలో మతోన్మాద శక్తులు ఆగడాలను అడ్డుకుంటామన్నారు. ఈ తీర్పు మతోన్మాద శక్తులకి చెంపచెట్టు లాంటిదని, రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా కూడా అన్ని విద్యాసంస్థల్లోని విద్యార్థి లోకం మతోన్మాద విద్యార్థి సంఘాలను తరిమికొట్టాలన్నారు. ప్రజాస్వామ్య విలువల కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు పోరాటాలు నిర్వహిస్తున్నాయన్నారు. జేఎన్‌యూ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ధనంజయ్, ఉపాధ్యక్షుడిగా అవిజిత్ ఘోష్, ప్రధాన కార్యదర్శిగా స్వాతి, సంయుక్త, కార్యదర్శిగా మహమ్మద్ సాజిద్‌లు ఘన విజయం సాధించారని తెలిపారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు తమ ఓటుతో బుద్ధి చెప్పారని, జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీజేపీ ప్రభుత్వాన్ని గద్ద దించడంలో విద్యార్థి యువత కీలకపాత్ర పోషించాలన్నారు. యూనివర్సిటీలలో విద్యార్థులపై ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని బలవంతగా రుద్దుతున్నారని, వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ, కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విభజన రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థి లోకం జేఎన్‌యూ విద్యార్థులు ఇచ్చిన తీర్పును ఆదర్శంగా తీసుకొని విద్య కాషాయికరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని విద్యార్థి, యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సందీప్, రాజు, పవన్, మనోజ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | మార్చి 26, 2024 | www.navatelangana.com





పసుపు కొట్టి...తలంబ్రాలు కలిపి

భద్రాద్రి రామయ్య పెండ్లికొడుకాయనే...

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పాల్గొ వసంత పంచమి శుభసమయాన భద్రాద్రి సీతా రాముల కల్యాణం మహోత్సవ కృతువుని భద్రాచలం దేవస్థాన వైదిక సిబ్బంది వైష్ణవ సంప్రదాయంలో వైభవంగా ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి వచ్చిన రామయ్య భక్తజన సమక్షంలో వసంత పంచమి రోజైన సోమవారం నాడు ఆలయ ఈఓ బి.రమాదేవి నేతృత్వంలో ఆలయ అర్చకులు ముత్తైదులతో కలిసి పసుపు కొమ్ములను దంచి రామయ్య పెండ్లి పనుల కొంకురార్పణం చేశారు. భద్రాద్రి రామయ్య తిరు కల్యాణ మహోత్సవానికి వినియోగించే గోటితో ఒలిచిన తలంబ్రాలను పసుపు కుంకుమ సుగంధంతో వివాహ తలంబ్రాలుగా కలిపారు.



ముందుగా ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఉత్తర ద్వార దర్శనం వైపు మేళ తాళాలతో తీసుకురాగా ఉత్సవ మూర్తులని పంచామృతాలతో అభిషేకించిన అనంతరం వేదమంత్రోత్సవాల మధ్య శ్రీరామనవమి పనులు హట్టహాసంగా ప్రారంభించారు. తిరు కల్యాణ మహోత్సవంలో భాగంగా భద్రాద్రి రామయ్యను పెండ్లి కొడుకును చేసి వసంత పంచమి హెూలీ వేడుకలను నిర్వహించారు. నేటి నుండి సీతారాముల పెండ్లి తంతుని నిర్వహిస్తారు.

సీతారాముల కల్యాణం టిక్కెట్లు విడుదల

ఏప్రిల్ 17న జరిగే సీతారాముల తిరు కల్యాణ మహోత్సవం 18న జరిగే రామయ్య పట్టాభిషేక మహోత్సవాన్ని నేరుగా తిలకించేందుకు టిక్కెట్లు ఆన్‌లైన్ ద్వారా దేవాదాయ శాఖ వారు విడుదల చేశారు. స్వామివారి కల్యాణ మహోత్సవ టిక్కెట్లు ఉభయ దాతల టికెట్ ధర రూ.7500 కాగా ఈ టికెట్ పై ఇద్దరికీ ప్రవేశ అవకాశాన్ని కల్పించారు. అదేవిధంగా సెక్టార్ టిక్కెట్లు రూ.2500/2000/1000/300/150లతో కొనుగోలు చేసి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. అదేవిధంగా ఏప్రిల్ 18న జరిగే పట్టాభిషేక మహోత్సవానికి కూడా ఆన్‌లైన్ ద్వారా టికెట్లు కొనుగోలు చేసే అవకాశాన్ని దేవస్థానం వారు కల్పించగా వాటి వివరాలు రూ.1500/500/100 నిర్ణయించారు. ఆన్లైన్ ద్వారా ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకుని బ్రహ్మాండర్ నాయకుడి కల్యాణ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశాన్ని పొందాలని ఆలయ ఈఓ బి.రమాదేవి కోరారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో
హోలీ వేడుకలు

నవతెలంగాణ-పాల్వంచ

హోలీ పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన హోలీ వేడుకల్లో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ దంపతులు, పిల్లలతో కలిసి పాల్గొన్నారు. రంగుల పండుగ రావడంతో ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాల్లో మునిగి తేలారు. చిన్న పెద్ద తేడా తెలియకుండా రంగులతో ఆడుకున్నారు. కలెక్టర్, పీఓ దంపతులు పిల్లలతో, సిబ్బందితో సరదాగా నృత్యాలు చేస్తూ రంగుల పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ స్నేహపూర్వక వాతావరణంలో ఆయనకు రంగులు కాకుండా సహజమైన రంగులను వాడి హెూలీ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ హెూలీ పండుగ అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని అన్నారు. జిల్లా ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ హోలీ వేడుకల్లో మహిళా శిశు సంక్షేమ అధికారి విజేత, పరిపాలనాధికారి గన్యా, కలెక్టరేట్ సూపరింటెంట్ రమాదేవి, కార్యాలయ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



తిరుపతిరావు కుటుంబాన్ని పరామర్శించిన
సీపీఐ(ఎం) జాతీయ నాయకులు

- దేశంలో లౌకిక శక్తులు కలిస్తే బీజేపీకి ఓటమి ఖాయం

నవతెలంగాణ-మణుగూరు

ప్రముఖ వైద్యులు, సీపీఐ(ఎం) పార్టీ సానుభూతిపరులు కామ్రేడ్ డాక్టర్ తిరుపతిరావు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మార్చి 22వ తారీకు మరణించారు. వారి కుటుంబాన్ని సీపీఐ(ఎం) జాతీయ నాయకులు బి.వెంకట్, ఎం.సాయిబాబా, పోతినేని సుదర్శన్ సోమవారం కుటుంబాన్ని సందర్శించి, కుటుంబానికి సంతాప సానుభూతి తెలిపారు. మచ్చలేని మహా నాయకుడు కమ్యూనిస్టు భావాజాలం ప్రజల్లో తీసుకెళ్లే మానవతవాది డాక్టర్ తిరుపతిరావు లేకపోవడం వారి కుటుంబానికి పార్టీకి, ఈ ప్రాంత పేద ప్రజలకు తీవ్రమైన నష్టమని అన్నారు. వారి కుటుంబ సభ్యులు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం తిరుపతిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించినారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీపీఐ(ఎం) పార్టీకి వెన్నంటి ఉన్నారని అన్నారు. ప్రజా సమస్యలే లక్ష్యంగా స్వతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యంగా లౌకిక శక్తులను ఏకం చేస్తూ భారతదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటూ ముందుకెళ్తుందని అన్నారు. ఈ మధ్యకాలంలో ఆర్ఎస్ఎస్ కనుసన్నలలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తీసుకొని వస్తూ ప్రభుత్వ ఆస్తులు మొత్తం ప్రైవేటుపరం చేస్తూదేశాన్ని లూటీ చేస్తుందన్నారు. దేశంలో ఈడీని చేతిలో పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తుందని రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందన్నారు. దేశంలో మతసిచ్చు కులాలు, మతాల మధ్య పెడుతుందని, దేశ ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజల తీర్పుతో బీజేపీకి బుద్ధి చెప్పాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.బ్రహ్మాచారి, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కొడిశాల రాములు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు సత్ర పల్లి సాంబశివరావు, సీఐటీయూ కన్వీనర్ ఉప్పతలనరసింహారావు ముసకల ఉత్తం నందం, ఈశ్వరరావు, హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.





నిరుపేదలకు అండగా చేయూత ట్రస్ట్

నవతెలంగాణ-బూర్గంపాడు

నిరుపేదలకు అండగా చేయూత ట్రస్ట్ నిలబడుతుందని ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మోరంపల్లి గ్రామంలో చేయూత ట్రస్ట్ నూతనంగా రిజిస్ట్రేషన్ పొందడంతో గౌరవ అధ్యక్షులు కే.వెంకటేశ్వర్లు రిజిస్ట్రేషన్ పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేయూత ట్రస్ట్ ఒక లక్ష్యంతో ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు. ప్రధానంగా విద్య వైద్యరంగాలను ఎంచుకొని నిరుపేద కుటుంబాలను గుర్తించి అవసరమైన చోట హార్దికంగా సహకారాలు అందిస్తూ చెయ్యి పట్టుకొని నడిపిస్తూ భవిష్యత్ తరాలకు చేయూత సేవలు ప్రతి ఒక్కరిలో సహాయం చేసే గుణం బయటకు వచ్చే విధంగా చేయూత ట్రస్ట్ అడుగులు వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నిరుపేద కుటుంబం అనారోగ్యంతో ఆసుపత్రి పాలైనప్పుడు వారికి అండగా నిలబడి ఆర్థిక సహాయం చేయడంతో పాటు పలువురి దాతల సహకారం కూడా అందే విధంగా చేయుత ట్రస్ట్ మార్గం చూపుతుందన్నారు. గత ఏడాదిగా చేయూత ట్రస్ట్ చేస్తున్న సేవలు పట్ల ఎంతో ఆత్మ సంతృప్తి కలిగించిందన్నారు. భవిష్యత్తులో కూడా చేయూత ట్రస్ట్ సేవలు జిల్లా స్థాయిలో కొనసాగిస్తామని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీ నారాయణ రెడ్డి, కే.నాగిరెడ్డి, ప్రధాన కార్య దర్శి జెక్కిరెడ్డి మల్లారెడ్డి, సహాయ కార్యదర్శి గాదె నర్సిరెడ్డి, ట్రెజరరీ పుట్టి రాజేష్, గౌరవ అధ్యక్షులు కైపు రామ చంద్రారెడ్డి, కైపు చిన్న నాగిరెడ్డి, కార్యవర్గ సభ్యులు కామిరెడ్డి వెంకటరెడ్డి, మేడ లక్ష్మిరెడ్డి, శనగ మల్లే శ్వరరావు, మూల లక్ష్మిరెడ్డి, మోహన్ బాబు, కిషన్, బాలు, కామసాని సాయి శ్రీనాథ్, కే. నరసింహారెడ్డి, డా.రాజశేఖర్ రెడ్డి, అనీఫ్, సాయిబాబు, వెంకటరమ ణారెడ్డి, కామిరెడ్డి వెంకట నాగిరెడ్డి, దినేష్ రెడ్డి, ఆవు ల రవీందర్ రెడ్డి, నిమ్మల గణేష్, బొబ్బల వెంకట రామిరెడ్డి, బిజ్జం వెంకటరామిరెడ్డి, వి.వి.వి. సత్యనా రాయణ, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రెడ్డి సంక్షేమ సమాఖ్య వారి ఆధ్వర్యంలో హోలీ సంబురాలు

నవతెలంగాణ-మణుగూరు

రెడ్డి సంక్షేమ సమాఖ్య మణుగూరు వారి ఆధ్వర్యంలో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. సోమవారం పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లుకి రంగులు చల్లి హెూలీ శుభాకాంక్షలు తెలియ జేశారు. రెడ్డి సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు నాసిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, సామ శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్ పార్టీ నాయకులు) గుర్రం వెంకటరెడ్డి సామ శ్రీనివాసరెడ్డి (రైస్ మిల్), సరెడ్డి రాఘవ రెడ్డికి రంగులు చల్లి హెూలీ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆలేటి అశోక్ రెడ్డి, అవినాష్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్యామల అశోక్ రెడ్డి, దేవిరెడ్డి ఆదిరెడ్డి, శ్యామల ఆదినారాయణ రెడ్డి, బంక్ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగుల పండుగ రంగోలి

- నీటిలో మునిగిపోతున్న యువకులను కాపాడిన పోలీసులు

నవతెలంగాణ-మణుగూరు

రంగుల పండుగ రంగోలి హెూలీ వేడుకల్లో ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు క్యాంపు కార్యాలయంలో హోలీ వేడుకలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో సరదాగా తిరుగుతూ అందరిని పులకరిస్తూ సామాన్యుడిలా హెూలీ వేడుకల్లో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలలు అందరితో కలిసి చాయ్ తాగారు. చిన్నపిల్లలు రంగులు చల్లుకుంటూ సరదాగా గడిపారు. మహిళలు, యువకులు తారతమ్య బేధాలు లేకుండా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. మణుగూరు మండలం రామానుజవరం పంచాయతీ పరిధిలోని రుక్మిణి, సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి కల్యాణ నేపథ్యంలో తహసీల్దార్ రాఘవరెడ్డి పట్టు వస్త్రాలు ప్రసాదించారు. ఈ దేవాలయంలో ప్రతి సంవత్సరం హెూలీ వేడుకలు ఘనంగా జరుగుతాయి. చుట్టుపక్క గ్రామాల ప్రజలు ఎడ్లబండ్లపై ప్రభలను కట్టుకొని వస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుండి కల్యాణ వేడుకల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొంటారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు వేణుగోపాల స్వామి టెంపుల్‌లో పూజలు నిర్వహించారు.



నీటిలో మునిగిపోతున్న యువకులను కాపాడిన పోలీసులు

హోలీ అనంతరం కొండాయిగూడెం గోదారి తీర ప్రాంతంలో హోలీ పండుగ నేపథ్యంలో స్నానానికి వెళ్లి మునిగిపోతున్న ముగ్గురు యువకులను పోలీసులు రక్షించారు. ఈ యువకులు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్ గ్రామానికి చెందినవారు. ప్రమాదం నుండి కాపాడిన టీఎస్‌పీ కానిస్టేబుల్ వినయ్ ధైర్యసహసాలతో ముగ్గురు యువకులను కాపాడారు. అక్కడే ఉన్న ప్రజలు వారి ధైర్య సాహసాలను మెచ్చుకొని అభినందించారు.



15 బోరింగ్ పంపులు ఏర్పాటు

- రూ.7.50 లక్షలతో పనులు ప్రారంభం

నవతెలంగాణ-బూర్గంపాడు

షిలోహు మినిస్ట్రీస్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో బోరింగ్ పంపుల ఏర్పాటు పనులను షిలోహు మినిస్ట్రీస్ వ్యవస్థాప కులు పాస్టర్ మోజెస్ ముసక ప్రారంభించారు. ఏజెన్సీ ప్రాంతాలలోగల ప్రార్థనా మందిరాల్లో నీటి వసతుల సదుపాయం నిమిత్తం షిలోహు మిని స్ట్రీస్ ఆధ్వర్యంలో 15 బోరింగ్ పంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రార్థన మందిరాలలో తోపాటు ఆయా కాలనీలో గ్రామస్తులకు నీటి సమస్యను తీర్చాలని బోరింగ్ పంపులు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ 15 బోరింగ్ పంపులకు రూ.7.50 లక్షలు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాలైన కుక్కునూరు, వేలేరుపాడు, విఆర్ పురం, కూన వరం, ఎటపాక, పినపాక, అశ్వాపురం, కరక గూడెం, బూర్గంపాడు తదితర ప్రాంతాలలో ఈ బోరింగ్ పంపులు ఏర్పాటుతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో షిలోహు మినిస్ట్రీస్ హైదరాబాదు బృందం సభ్యులు బ్రదర్ చింతల ప్రవీణ్ కుమార్, బ్రదర్ స్టీవ్ ఎలియట్ ముసక, బ్రదర్ షాలోమ్ రాజు, భద్రాచలం బూర్గంపాడు పాస్టర్లు మోతుకూరి సైమన్, డి.పెద్దారావు, టి.మహిమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ బంకర్ పనులలో సీనియారిటీని ప్రామాణికంగా తీసుకోవాలి

- టీబీజీకేఎస్

నవతెలంగాణ-మణుగూరు

కొండాపురం నందు కొత్తగా నిర్మించిన బొగ్గు లోడింగ్ బంకర్ పనులలో గని నందు సీనియారిటీ ప్రామాణికంగా తీసుకొని సీనియర్‌గా ఉన్న వారికే చైన్ బంకర్ పనులలో అవకాశం కల్పించాలని టీబీజీకేఎస్ నాయకులు నాగెళ్ళి వెంకట్ సోమవారం గని అధికారులను కోరారు. సీనియారిటీ, అర్హత, నైపుణ్యతతో సంబంధం లేకుండా నాయకులు సూచించి వారు ఎంపిక చేసిన వారిని మాత్రమె సంబంధిత అధికారులు చైన్ బంకర్ పనులకు పంపడం సరికాదని తెలిపారు. అనర్హులను చైన్ బంకర్ పోస్టులకు అర్హులు లాగా చేసి వారిని మాత్రమె ఆ పనులకు పంపడం దానికి గని అధికారులు కూడా ఆమోద ముద్ర వేసే లాగా ప్రయత్నించడం సరికాదని తెలిపారు. గని నందు నియమ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగ పోస్టులు పంచుకొని సీనియర్లను పక్కన పెట్టడం సరైన శాస్త్రీయమైన పద్ధతి కాదన్నారు. ముందుగా కంపెనీలో చేరి కంపెనీ వృద్ధిలో భాగస్వామ్యం వహించిన సీనియర్స్‌కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చి స్నేహ పూర్వక పారిశ్రామిక సత్సంబంధాలు నెలకొల్పి మైన్ పురోగతికి తోడ్పాటు అందించాలని అధికారులను కోరారు. అండర్ గ్రౌండ్ మజ్దూర్, సర్ఫేస్ మజ్దూర్ అనే తేడా లేకుండా అసక్తి గల కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించి సీనియారిటీ ప్రామాణికంగా తీసుకుని చైన్ బంకర్ పనులకు పంపటం వల్ల గని నందు పని చేస్తున్న వారందరికీ తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.



శ్రీ రేణుక ఎల్లమ్మ-శ్రీ నాగులమ్మ సుంకు జాతర ప్రారంభం

- లక్ష్మీ కాలనీ గుట్టలపై మూడు రోజులపాటు ఘనమైన పండుగ

నవతెలంగాణ-చర్ల

మండల పరిధిలోని లక్ష్మీ కాలనీ గుట్టలపై తరతరాలుగా వెలసియున్న శ్రీ రేణుక ఎల్లమ్మ-శ్రీ నాగులమ్మ సుంకు జాతర ఈ నెల 26 నుండి 28 వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ పూజారి మడకం దేవయ్య తెలిపారు. 26వ తారీకు సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారు గద్దెల పైకి రావడం జరుగుతుందని 27 బుధవారం ఉదయం 8 గంటల నుండి శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ప్రధాన పూజా పట్టణం వేయడం జరుగుతుందని, మధ్యాహ్నం నుండి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం కలదని దలపతి మడకం నాగేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా చివరి రోజు 28వ తారీకు గురువారం తెల్లవారుజామున 5 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు, అనంతరం వనదేవతలు వనంలోకి ప్రవేశిస్తాయని ఆలయ పూజారి వివరించారు.



అయ్యప్పస్వామి జయంతి వేడుకలు

నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ రాష్ట్రంలోనే పేరొందిన అయ్యప్పస్వామి దేవాలయంగా కీర్తింపబడుతున్న పాల్వంచ అయ్యప్పస్వామి దేవాలయంలో ఫాల్గుణ మాసం, ఉత్తర నక్షత్రం జన్మనక్షత్రం సందర్భంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు సోమవారం తెల్లవారుజామునుండే దేవాలయం పూజారులు మాధవన్ నంబుద్రి, బృందావనం నర్సింహమూర్తి ఆధ్వర్యంలో గణపతిహెూమం, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ ప్రత్యేక పూజల్లో జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మెన్, ఆలయ కమిటీ సభ్యులు కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బందెల శ్రీనివాస్, కనగాల రాంబాబు, వేమారెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.





వెంకటేశ్వర స్వామి కళ్యాణ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలోని బండ్లసిరిగుట్ట గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి 18వ వార్షిక కల్యాణ మహోత్సవ వేడుకలో సోమవారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని స్వామివారి కల్యాణ వేడుకలను తిలకించారు. అదేవిధంగా గొందిగూడెం నెల్లిపాక గ్రామాల్లో సైతం పాల్గొని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్ళూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, వాసు, షరీఫుద్దీన్, ఎస్కే ఖదీర్ బేతం రామకృష్ణ, రవి, వేములపల్లి రమేష్, ఓరిగంటి రమేష్ , భూ రెడ్డి వెంకట్ రెడ్డి, వీరమాచినేని రాజశేఖర్, పాయం సర్వేశ్వరరావు, నరేష్, తెల్లం వీరభద్రం, ఆవుల రవి పాల్గొన్నారు.



రోడ్డుకి ఇరువైపులా పొదలు తొలగింపు

నవతెలంగాణ-అశ్వారావుపేట

గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో చేపట్టాల్సిన బుష్ కటింగ్ పనులు నిర్వహిస్తున్నారు. మండలంలోని వాగొడ్డుగూడెం నుంచి పండువారిగూడెం వెళ్లే మార్గం, అశ్వారావుపేట శివారు నుంచి వినాయకపురం వెళ్లే ప్రధాన రహదారుల ఇరువైపుల పిచ్చి మొక్కలు, ఏపుగా పెరిగి రోడ్లను కమ్మేశాయి. దాంతో ఈ పిచ్చి మొక్కల్ని తొలగించాలని చాలా కాలం నుంచి వాహనదారులు, రోడ్లు భవనాలు శాఖ అధికారులు మొర పెట్టుకున్న పట్టించుకోలేదు. కాగా ఎట్టకేలకు గడిచిన కొద్ది రోజులుగా ఆయా మార్గాల్లో జే.సీ.బీలు, బ్లేడ్ ట్రాక్టర్లతో ముమ్మరంగా పొదలను, మొక్కల్ని తొలగించి, శుభ్రం చేసే పనులు చేపట్టారు.

ఉత్సాహంగా హెూలీ వేడుకలు

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలో సోమవారం హెూలీ వేడుకలను ఉత్సాహకర వాతావరణంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుండే చిన్నారులు, పెద్దలు రంగులు పూసుకొని హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హెూలీ పండుగ సందర్భంగా గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో అధికారులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేశారు. హెూలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ముందస్తుగానే వివిధ రకాలుగా ప్రచారాలు నిర్వహించడంతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.



జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా హెూలీ వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో హెూలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా జిల్లా పోలీస్ అధికారులంతా కలిసి ఎస్పీ క్యాంప్ కార్యాలయానికి వెళ్లి హెూలీ వేడుకలకు ఎస్పీ రోహిత్ రాజుని ఆహ్వానించారు. అక్కడ అధికారులు, సిబ్బంది రంగులు జల్లుకుంటూ సందడి చేశారు. అనంతరం ఎస్పీతో కలిసి అధికారులంతా హేమచంద్రాపురం నందు గల పోలీస్ హెడ్ క్వార్టర్స్‌నకు చేరుకున్నారు. పోలీస్ బ్యాండ్ చప్పుళ్లకు నత్యాలు చేశారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది హెడ్ క్వార్టర్స్ నందు ఆనందోత్సవాల మధ్య కేరింతలతో హెూలీ వేడుకలను జరుపుకున్నారు. ఈ ఉత్సవాల్లో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, ట్రైనీ ఐపిఎస్ విక్రాంత్ సింగ్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మసేవా సమితి నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం కమ్మసేవా సమితి నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం జరిగిన కమిటీ సమావేశంలో 2024-25, 2025-26 సంవత్సరానికి గాను నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా బిక్కసాని నాగేశ్వరరావు, వైస్ ప్రసిడెంట్ పివి.వర్ధన్‌రావు, ఎం.ప్రసాద్, జి.వీరేంద్ర చౌదరి, ఇ.రవింద్ర కుమార్, కార్యదర్శిగా ఎం.కోటేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీగా వి.సాంబశివరావు, పి.కృష్ణమోహన్, సిహెచ్.కృష్ణయ్య, ట్రెజరర్‌గా జి.శ్యామ్ సుందర్, సభ్యులు సజ్జ ప్రసాద్, జి.మహేంద్రరావు, కె.నాగేశ్వరరావు, ఎం.సురేష్‌బాబు, పి.రాధాకృష్ణమూర్తి, ఎస్.షాజీరావు, సిహెచ్.మధుసూదన్, వి.గణేష్‌బాబు, కె.ప్రసాద్, పి.మాధవరావు, వి.రమేష్, బి.మాధవరావు, పి.రామ కోటేశ్వరరావు, వి.శేషగిరిరావు,వి.మల్లిఖార్జునరావు, కె.జగన్నాధరావు, జెవిఎస్.చౌదరి, టివి.చౌదరి, కె.భాగ్యలక్ష్మీ, కె.దీపికలు ఎన్నికయ్యారని నూతన అధ్యక్షులు బిక్కసాని నాగేశ్వరరావు వెల్లడించారు.

అనారోగ్యంతో దొడ్డ చిన్న వెంకటేశ్వరరావు మృతి

- నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట



దమ్మపేట మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దొడ్డ రమేష్ తండ్రి దొడ్డ చిన్న వెంకటేశ్వరరావు సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. మొద్దులగూడెంలో వెళ్ళిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చిన్న వెంకటేశ్వరరావు భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటిసి పైడి వెంకటేశ్వరరావు, దొడ్డ శ్రీను, వెంపాటి భరత్, దొడ్డ నాగేశ్వరరావు, సాయిల రామారావు, అబ్దుల్‌జిన్నా పాల్గొన్నారు.

పర్ణశాల రామయ్య పెళ్ళికొడుకాయనే..

- ఘనంగా డోలోత్సవం, వసంతోత్సవం

నవతెలంగాణ -దుమ్ముగూడెం



భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయంలో పాల్గుణ, పౌర్ణమి సందర్భంగా డోలోత్సవం, వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం లక్ష్మీ పూజ విశేష పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ముత్తయిదువుల చేత పసుపు కొట్టే కార్యక్రమం, తలంబ్రాలు కలిపే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మూలవర్లకు ఉత్సవమూర్తులకు వసంతోత్సవం, సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం పర్ణశాల రామయ్యను పెళ్లికొడుకుగా ముస్తాబు చేశారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి తిరువారాధన, ఏడు గంటలకు స్వామివారి తిరువీధి సేవ నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిండెంట్ కిషోర్, ఫెస్టివల్ ఇంచార్జ్ అనిల్, ఆలయ ఇంచార్జ్ ప్రసాద్, అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, అమరవాది వెంకట్రామన్, భార్గవాచార్యులు, ఆలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



చుక్కల్లో జీతాలు

చిక్కుల్లో జీవితాలు

నవతెలంగాణ-పాల్వంచ

నెలకు రూ.40 వేలు జీతం వస్తుందని కానీ ఇంటికి తీసుకు వచ్చేది రూ.5, 6 వేలు మాత్రమే. ఈ కాస్త డబ్బుతో కుటుంబం గడవడం కష్టం అవుతుంది. వారం తిరక్క ముందే రుణ దాతలకేసి చూడాల్సి వస్తుంది. ఇదో కేటీపీఎస్ కార్మికుని భార్య ఆవేదన. పేరుకు ఉద్యోగుల పిల్లలం.. కళాశాలలో ఫీజులు కూడా కట్టలేక పోతున్నాం. ఏటీఎం కార్డులు కుదువ పెట్టుకుని అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నాం. వడ్డీలకు వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.. నిరంత మా వాళ్లు కష్టపడి పనిచేసిన డబ్బాంతా వడ్డీలకే చెల్లించాల్సి వస్తుంది. మరో కేటీపీఎస్ కార్మికుని కొడుకు ఆక్రోశం రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటైన కేటీపీఎస్ ఉద్యోగులకు అధిక వేతనాలు అందుతున్నాయి. అయితే వీరిలో కొందరు దుర్వేసనలకు బానిసలై ఆర్థిక క్రమశిక్షణ పాటించక జీవితంలో ఛిద్రం చేసుకుంటున్నారు.

అధిక జీతభత్యాలు వస్తున్నా ఆ కుటుంబాలన్నీ సిరి సంపదలతో తులతూగాల్సి ఉండగా ఆ స్థానంలో దరిద్రం కొట్టుమిట్టాడుతోంది. ఫలితంగా ఉద్యోగుల కుటుంబాల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఉద్యోగుల తీరు ఇలాగే కొనసాగితే వారి పిల్లల జీవితాల్లో అంధకారం నెలకొంటుంది. కేటీపీఎస్ 5, 6 దశ కేటీపీఎస్ దశలో సుమారు రూ.3 వేల అన్ని రకాల కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.40 వేలు మొదలుకొని రూ.60 వేల వరకు నెలసరి జీతం వస్తుంది. అయితే కొందరు వచ్చిన వేతనాన్ని పొదుపుగా వాడుకుంటూ కుటుంబం భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకుంటుండగా ఎక్కువమంది జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు ఉన్న కార్మికుల్లో సుమారు 60 శాతం మంది అప్పుల ఊబీలోనే కురుకుపోతున్నారు. జీవితాల్లో కోలుకోలేనంతగా వీరు అప్పుల్లో మునిగిపోయి ఉన్నారు.

ఏటీఎం కార్డులు పాసుబుక్కులు తాకట్టు పెట్టుకుని..

కేటీపీఎస్‌లో పనిచేసిన ఉద్యోగులకు అప్పిస్తున్న ఫైనాన్సర్లు పాల్వంచలోని సుమారు 200 మంది ఉంటారని అంచనా. వీరిలో వందమంది కేటీపీఎస్ ఉద్యోగులే ఉండడం గమనార్హం. మరో వందమంది స్థానికంగా ఉంటున్న వడ్డీ వ్యాపారులు. అప్పిస్తున్న కేటీపీఎస్ ఉద్యోగులు వడ్డీ వ్యాపారుల తమ డబ్బు వడ్డీ భద్రంగా వచ్చేలా ఏర్పాట్లు చేసుకుంటారు. అప్పు తీసుకుంటున్న ఉద్యోగి జీతానికి సంబంధించిన ఏటీఎం కార్డు, పాస్‌బుక్‌లు తాకట్టు పెట్టుకుని అప్పు ఇస్తారు. నెలగడిచే సరికి అప్పు తీసుకున్న ఉద్యోగులు ఫైనాన్షియర్ దగ్గరికి వెళ్తారు. వడ్డీ వ్యాపారులు తానిచ్చిన డబ్బుకు వడ్డీని తీసుకొని మిగిలిన జీతాన్ని ఉద్యోగులకు ఇస్తారు. మళ్ళీ ఏటీఎం కార్డు, పాస్ బుక్కులు తమ వద్దనే ఉంచుకుంటారు. ముందుగానే అగ్రిమెంట్లో ఫోన్ పే గాని గూగుల్ పే నుంచి డ్రా చేయకుండా జీతాలు పడిన వెంటనే వడ్డీ వ్యాపారులు లాగేసుకుంటున్నారు. ఎవరైనా ఫోన్ పే ద్వారా గాని గూగుల్ పే ద్వారా గాని డ్రా చేస్తే వడ్డీ వ్యాపారి ఇంటికి వెళ్లి హంగామా సృష్టిస్తారు. ఇలా ఒక్కొక్క వ్యాపారి దగ్గర 50 నుంచి 100 ఏటీఎం కార్డులు ఉన్నాయి.

అప్పుల ఊబిలో కూరుకుపోతున్న తీరు

అధిక వేతనాలు పొందుతున్న ఉద్యోగులు చేతినిండా డబ్బు కనబడే సరికి మొదటగా జల్సాలకు అలవాటు పడుతున్నారు. మద్యం తాగడం, పేకాట ఆడడంతో ఈ తతంగం మొదలవుతుంది. సరదాగా మొదలైన ఈ దుర్వేసనలకు కార్మికులు బానిసలు అవుతున్నారు. వచ్చిన జీతం అంత వాటికే పెడుతూ ఇల్లు, ఒళ్ళు గుళ్ళు చేసుకుంటున్నారు. మళ్లీ అప్పుల కోసం చేయి చాచాల్సి వస్తుంది. వీరి అవసరాన్ని వడ్డీ వ్యాపారాలు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో అసలు చెల్లించలేక వడ్డీలకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా చితకబోతున్నారు.

పరిష్కార మార్గాలు : ప్రతి ఉద్యోగి ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి

ముఖ్యంగా దుర్వేసనలకు దూరంగా ఉండాలి. వీటికి బానిసలు అనే కార్మికులకు కౌన్సెలింగ్ ఇప్పించి మంచి మార్గంలో ప్రయాణింపజేయాలి. వచ్చిన వేతనాన్ని బట్టి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి బడ్జెట్ను రూపొందించుకోవాలి. అప్పు అవసరమైతే ప్రభుత్వ బ్యాంకులో ఉద్యోగుల క్రెడిట్ సొసైటీలను ఆశ్రయించాలి. తప్ప అధిక వడ్డీ లాగుతున్న వడ్డీ వ్యాపార దగ్గర తీసుకోకూడదు. సరదాలు, పార్టీల పేరుతో విచ్చలవిడిగా డబ్బులు వృథా చేయొద్దు. ఉద్యోగుల దుస్థితికి అద్దంపట్టే కొన్ని చేదు నిజాలు అప్పుల పాలైన ఓ అసిస్టెంట్ ఇంజనీర్స్ కు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్‌గా పదోన్నతి లభించిన విధుల్లో చేరడం లేదు. ఉద్యోగానికి వెళ్లడం లేదు. ఇతను పదవి విరమణ అయిన తర్వాత వచ్చే డబ్బంతా అప్పుడు వరకు సరిపోయేలా ఉంది.

కేటీపీఎస్ లో పనిచేస్తూ కాలనీలో నివాసం ఉంటున్న ఓ కార్మికులు అప్పులకు వడ్డీలను కట్టేందుకు ఉద్యోగంతో పాటు తీరికలలో ఆటో నడుపుతున్నాడు. అప్పుల ఊబిలో నుంచి బయటపడటానికి పలువురు కార్మికులు విధి నిర్వహణ సమయం పూర్తయిన తర్వాత పార్టాయంగా పలు దుకాణాల్లో ప్రైవేటు ఉద్యోగులుగా చేస్తున్నారు.

ఉచితంగా ఇసుక ఇవ్వడం పట్ల హర్షం

టీపీసీసీ, ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ తెల్లం నరేష్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పేదవాడి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఇసుక ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని టీపీసీసీ ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ తెల్లం నరేష్ అన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్లకు సైతం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి పేదవాడికి న్యాయం జరిగేలా అద్భుత మైన నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పేదవాడి ఇందిరమ్మ ఇంటి కళ నెరవేరే సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పేదవాడి ఇంటి నిర్మాణానికి ఇసుక ఉచితంగా అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి కలెక్టర్ లకు ఉత్తర్వులు జరీ చేయటం జరిగిందని, ఇసుక ఉచితంగా ఇవ్వటం పట్ల ఎంతోమంది నిరుపేదలకు, ప్రజలకు పెద్ద పెను భారం తగ్గి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఇంటి నిర్మాణం కోసం పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఇక నుంచి పేద ప్రజలకు మంచి రోజులు రాబోతున్నాయని అయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం తో ఉన్నారని మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో



గెలిపించాలంలని కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయటమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కన్నులపండువగా శ్రీసంతాన వేణుగోపాలస్వామి తిరుకల్యాణం



- భక్తులకు అన్నదానం

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో గోదావరి నదీతీరాన కొలువైన సంతాన వేణు గోపాల స్వామి తిరుకల్యాణం సోమవారం కన్నులపం డువగా జరిగింది. వేదపండితులు, అర్చకుల మంత్రోచ్ఛ రణలు, మేళతాళాలు, భాజాభజంత్రీల నడుమ అభిజిత్ లగ్నంలో మధ్యాహ్నం 12.06 గంటలకు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. తాళ్ళూరి. రాజాశ్రీకష్ణ -గాయత్రీ, తాళ్ళూరి జయశేఖర్-నీలిమ దంపతుల సౌజన్యంతో నిర్వహించిన ఈ కల్యాణంలో తాళ్ళూరి ట్రస్టు చైర్మన్ తాళ్ళూరి పంచాక్షరయ్యతో పాటు ఎన్నారైలు డాక్టర్ అనితారాణి-గొట్టిపాటి ప్రవీణ్ కుమార్, ట్రస్టు డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకష్ణ- విజయ రేణుక దంపతులు కుటుంబసభ్యులు పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు వైభవంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారికి తాళ్ళూరి కుటుంబీకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణానికి వచ్చిన భక్తులకు భారీగా అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మాజీ సర్పంచ్ కొర్సా లక్ష్మి, తాళ్ళూరి రాధా కష్ణ, తాళ్ళూరి రమేష్, చేకూరి ప్రసాద్, మదపాటి ప్రకాష్, మోహనరావు, తాళ్ళూరి జగన్నాధరావు, మహంకాళి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జిన్నెలగూడెంలో కాటురం యూత్ ఫెస్టివల్ టోర్నమెంట్స్

- ప్రారంభించిన ఎంపీపీ రేసు లక్ష్మి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండల పరిధిలోని జిన్నెలగూడెం గ్రామంలో నాలుగు మండలాల స్థాయి కాటురం యూత్ ఫెస్టివల్ క్రికెట్ టోర్నమెంట్స్ సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ టోర్నీలను ఎంపీపీ రేసు లక్ష్మి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించగా, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణమూర్తి బ్యాటింగ్ చేసి ఆటలు ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ క్రీడలు స్నేహభావంతో పాటు యువత దేహదారుఢ్యాన్ని పెంపొందించే విధంగా ఉంటాయని అన్నారు. గ్రామస్థాయిలో ఉన్న క్రీడాకారులు ఇటువంటి టోర్నమెంట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులు ఐక్యత భావంతో స్నేహపూర్వక మైన పోటీని కొనసాగించి గెలుపు ఓటములను హుందాగా స్వీకరించాలని అన్నారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని క్రీడాకారులు తగుజాగ్రతలు పాటిస్తూ టోర్నమెంట్‌ను విజయవంతంగా కొనసాగే విధంగా మేనేజ్మెంట్ వారు అన్ని జాగ్రత్తలు పాటిస్తూ కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు తునికి కామేష్, ప్రచార కమిటీ అధ్యక్షులు దామెర్ల శ్రీనివాసరావు, టోర్నమెంట్ నిర్వాహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హెూలీ వేడుకలు

- పాల్గొన్న జెడ్పీటీసీ కుటుంబం

నవతెలంగాణ-బూర్గంపాడు



మండల పరిధిలోని లక్ష్మీపురంలో హెూలీ పర్వదినాన్ని బూర్గంపాడు జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత సోమవారం కుటుంబసభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి హెూలీ రంగులు చల్లి సందడి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాన్ని హెూలీ వేడుకలు చాటి చెబుతాయన్నారు. దేశంలో మనం జరుపుకునే పండుగలు ఎంతో గొప్పవని, వీటన్నింటికీ ఓ విశిష్టత ఉంటుందన్నారు. మండలంలో ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. ఆదేవిధంగా మండలంలో హెూలీ వేడుకలను నిర్వహించారు.

దమ్మపేటలో హోలీ సందడి

నవతెలంగాణ-దమ్మపేట

మండల వ్యాప్తంగా రంగుల పండుగ హెూలీని ఆనందోత్సావాల నడుమ సోమవారం ఘనంగా జరుపుకున్నారు. సాంప్రదాయబద్ధంగా కోలాహలంగా ఒకరిపై మరొకరు ప్రకతి రంగులు చల్లుకొని ఆనందాన్ని పంచుకున్నారు. పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు గ్రామాల్లో గ్రామస్థులందరూ కలిసికట్టుగా హెూలీ పండుగను జరుపుకోవడం జరిగింది. చిన్న, పెద్ద, యువతీ యువకులు, రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. నృత్యాలు చేస్తూ మిఠాయిలు తినిపించుకున్నారు. దీంతో హెూలీ సందడి నెలకొంది. దమ్మపేట బంజారా కాలనీలో దమ్మపేట మాజీ సర్పంచ్ ఆంగోతు బాలాజీ ఆధ్వర్యంలో హెూలీ వేడుకలను బంజారా సాంప్రదాయ పద్ధతిలో పూజలు చేసి ఘనంగా జరిపారు.

వైభవంగా రంగోలి వేడుకలు

నవతెలంగాణ - అశ్వారావుపేట



ప్రతి ఒక్కరికీ ఇష్టమైన పండుగ హెూలీ అటువంటి రంగోలి పండుగ వేడుకలను మండల వ్యాప్తంగా సోమవారం హర్షాతిరేకాలు మధ్య కేరింతలు కొడుతూ ఉత్సాహంగా జరుపుకున్నారు. పట్టణంలోని పలు వీధుల్లో యువతీ, యువకులతో పాటు చిన్నారులు, పెద్దలు సైతం ఉదయమే రకరకాల రంగులను సిద్ధం చేసుకుని ఒకరిపై ఒకరు చల్లుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. సంతోషానికి ప్రతీకగా నిలిచే ఈ హెూలీ పండుగ వేడుకను ఉత్సాహంగా జరుపుకోవటం సంతోషంగా ఉందని పలువురు పేర్కొన్నారు. కల్మషం లేని మనస్సుతో ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించాలనే ఉద్దేశమని ఇటువంటి పండుగను హానికరం కాని కాలుష్యం లేని రంగులతో జరుపుకోవాలని మన పూర్వీకులు ఆలోచించారు.



కనీస వేతనాలు పెంచాలి: సీఐటీయూ

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి ఏరియాలో షెడ్యూల్డ్ కార్మికులలో పెరిగిన ధరలు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ అన్నారు. శుక్రవారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం సీఐటీయు అధ్వర్యంలో సిఎస్‌పీ బస్తీ, సీహెచ్‌పీ పని ప్రాంతాల లారీ అడ్డాలు, ఎస్ అండ్ పీసీ ఆఫీసులలో మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మార్కెట్లో పెరిగే ధరలకు అనుగుణంగా, సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం శాస్త్రీయంగా వేతనాలు కనీస 26000 వేల రూపాయలు తగ్గకుండా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఏరియా సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం బ్రాంచ్ నాయకులు, సిఐటియు మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ, కోల్ లారీ డ్రైవర్‌లు, క్లీనర్లు, మెకానిక్, హెల్పర్లు, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | మార్చి 26, 2024 | www.navatelangana.com

అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-కల్లూరు



పట్టణంలోని కనకగిరి శివాలయం ఆవరణలో మల్లాది బసవయ్య కమిటీ సభ్యులు సహకారంతో అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సై ఎస్కే. షాకీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

రంగుల హోలీ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

- డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ



రంగు రంగుల హోలీ తెలంగాణా ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలనిని ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల డీసీఎంఎస్ చైర్మెన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. హోలీ పండుగ సందర్భంగా సోమవారం పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో కాంగ్రెస్ కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ అధర్మంపై ధర్మం విజయానికి ప్రతీకగా రంగులు చల్లుకుంటారన్నారు. ఈ రంగుల హోలీతో అందరి జీవితాలు సంబురలమయం కావాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పెండ్లి కొడుకుగా రామయ్య ముస్తాబు

- రామ భక్తులకు నారసింహుని ఆతిధ్యం
- గోటి తలంబ్రాలతో భద్రాద్రికి వచ్చిన భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ
- 2000 మందికి అన్నదానం చేసిన నృసింహ సేవా వాహిని

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం ప్రతి నిత్యం ఆధ్యాత్మిక, సామాజిక సేవల్లో తరిస్తున్న నృసింహ సేవా వాహిని నేడు భద్రాద్రి రామయ్యకు గోటి తలంబ్రాలు ప్రతి సంవత్సరం హెూలీ పార్వదినాన ప్రతి గడప రామయ్య కల్యాణం కోసం ఈ తలంబ్రాలను రామ నామం చెపుతూ గోటితో వలిచి తేవడం ఆనవాయితీ. ఈ సంవత్సరం అనేక మంది భక్తులు పాదయాత్రగా భద్రాద్రికి వచ్చారు. రామయ్య సేవలో మనవంతు సేవలు అందించాలని నృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో నడిచి వచ్చే భక్తుల కోసం అనేక ప్రాంతాలలో మజ్జిగ పంపిణీ చేసి వారి దాహార్తిని తీర్చడమే కాకుండా సుమారు రెండువేల మందికి అన్నప్రసాదాన్ని అందించి భక్తుల పాలిట పెన్నిధిగా నిలిచింది శ్రీనృసింహ సేవా వాహిని సంస్థ. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డా.కృష్ణ చైతన్య స్వామి మాట్లాడుతూ రాముడు నడయాడిన ఈ పుణ్య భూమిలో రామ కార్యం కోసం వచ్చే భక్తులకు మా వంతు సేవలందించడం మా అదృష్టంగా భావిస్తున్నామని ప్రతి హెూలీ పర్వ దినాన మజ్జిగ మంచినీరు, పానకం, అన్న ప్రసాదం అందిస్తూ వస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సంబురంగా హోలీ వేడుకలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండల వ్యాప్తంగా రంగుల కేళి హోలీ పండుగ సంబరాలు సోమవారం అంబరాన్ని అంటయి. ఆయా గ్రామాల్లో చిన్న పెద్ద తేడా లేకుండా, చిన్నారులు, యువతులు మహిళలు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా కేరింతలు కొడుతూ రహదారుల వెంబడి మధ్యాహ్నం వరకు రంగులు చల్లుకున్నారు. సెల్ ఫోన్‌లో సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. ఏది ఏమైనా మండల వ్యాప్తంగా హెూలీ పండుగ సంబరాలు అంబరాన్ని అంటాయని చెప్పవచ్చు.



మణుగూరు : పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు క్యాంపు కార్యాలయంలో హోలీ పండుగ సంబురాలు అంబరాన్ని అంటాయి. సోమవారం క్యాంపు కార్యాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలతో శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు హెూలీ సంబరాలలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ సోదర ప్రేమకు రంగుల పండుగ హెూలీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు

మణుగూరు : లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో హెూలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం లయన్స్ క్లబ్ సభ్యులు రంగులతో ఆడి ఒకరినొకరు రంగులమయం చేసుకున్నారు. శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ గాజుల పూర్ణచంద్రరావు, సెక్రటరీ షేక్ మీరా హుస్సేన్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ పిల్లారిశెట్టి హరిబాబు, ట్రెజరర్ ఆడబాల నాగేశ్వరరావు, ముత్తం శెట్టి నాగేశ్వరరావు, కూరాకుల శ్రీనివాసరావు, తారా ప్రసాద్, కముజు చంద్రమోహన్, గాజుల రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి పల్లి : మండలంలోని రెగళ్లలో ఎంపీపీ భూక్యా సొన దంపతుల



ఆధ్వర్యంలో ఘనంగా హెూలీ రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలియజేస్తూ, బంజారా పాటలు పాడుతూ ఘనంగా హోలీ సాంప్రదాయంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నునావత్ సూర్యా భూక్య సుధాకర్, నునావత్ హరి, నునావత్ మంగ్య, భూక్య సాయిరాం, నునావత్ వినోద్, నునావత్ అశోక్, లావుడియా బాసు, భూక్య మతిలాల్, విజయ్, రేడియ, అశోక్, శీను, యువతీ, యువకులు, ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.



జూలూరుపాడు : మండల పరిధిలోని పాపకొల్లు గ్రామపంచాయతీ నందు సోమవారం అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో హోలీ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాపకొల్లు గ్రామ ప్రధాన కూడలి నందు గల శ్రీ ఉమా సోమలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా చైర్మెన్ నవీన్ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి కోదుమూరి కోటేశ్వరరావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యాస నరేష్, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి గూగులోత్ శ్రీనివాసరావు, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు అరిగేల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ సభ్యులు

హెూలీ పండుగ సందర్భంగా సుజాతనగర్ మండల కేంద్రంలో హెూలీ సంబరాలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలతో కలసి టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు రంగులు చల్లుకుంటూ సంబరంగా జరుపుకున్నారు. యువత బ్యాండ్ మేళాలతో నత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు సాంప్రదాయ రంగులు చల్లి హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



హోలీ వేడుకలు

నవతెలంగాణ-ముదిగొండ

మండలంలోని వెంకటాపురం గ్రామంలో హోలీ వేడుకలు యూత్ సభ్యులు, చిన్నారులు, మహిళలు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా కేరింతలు కొడుతూ ఘనంగా నిర్వహించుకున్నారు. సెల్ ఫోన్‌లో సెల్ఫీలు దిగుతూ యువత సరదాగా గడిపారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లి హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సూర్యం కుటుంబానికి పోతినేని పరామర్శ

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని అంజనాపురం మాజీ సర్పంచ్ తేజావత్ సూర్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ సోమవారం అంజనా పురంలోని ఆయన నివాసానికి వచ్చి కుటుంబసభ్యు లను ఆయన పరామర్శించి సంతాపం తెలిపారు. సూర్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈసందర్భంగా పోతినేని మాట్లాడుతూ మోరం పల్లి బంజర్ ఉమ్మడి పంచాయతీలో సర్పంచ్ గా పనిచేసి ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన అన్నారు.ఆయన అలాంటి వ్యక్తి సేవలను ప్రతిఒక్కరూ సూర్యం గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర నాయకులు సాయిబాబా, సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటే శ్వర్లు, జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.



శ్రీ రుక్మిణీ సహిత శ్రీ సంతాన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం

నవతెలంగాణ-జూలూరుపాడు

స్వస్తిశ్రీ చాంద్రమానేన శోభకృత్ శ్రీ సం.ర ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సోమవారం రాత్రి 7-30 నిమిషాలకు మండల పరిధిలోని కాకర్ల గ్రామము నందు పాలగుట్టపైన స్వయంభుగా వెలసిన శ్రీ రుక్మిణీ సహిత శ్రీ సంతాన వేణుగోపాలస్వామి వారి కళ్యాణ మహెూత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు శ్రీ కృష్ణ సేవా సమితి నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గం.6-00లకు స్వామి వార్లకు సుప్రభాత సేవ, మంగళ తోరణములు, గం.7-00లకు స్వామివార్లకు "అభిషేక కార్యక్రమము (గోత్ర నామార్చన), గం.8-00లకు అలంకారం, సర్వదర్శనం, గం.11-00లకు "నీరాజనం", మంత్రపుష్పం", తీర్ధ ప్రసాద వినియోగం, సాయంత్రం గం. 6-30 ని.ల నుండి రాత్రి 9-00 గం.ల వరకు స్వామివారి దర్శనం, గం 7-30 ని.లకు దేవరుల స్వామి కళ్యాణ మహెూత్సవము, గం.9-00లకు "నీరాజనం మంత్ర పుష్పం", మహా నైవేద్యం, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్త మహాజనులు విచ్చేసి శ్రీ స్వామివారి కళ్యాణ మహెూత్సవమును తిలకించి స్వామి వారి దర్శనం చేసుకొని తీర్థప్రసాదములు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు. స్వామి వారి కల్యాణం అనంతరం రాత్రి 9:00 గం.లకు నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా శ్రీ ఆదిశేషవతార వెంకటేశ్వర స్వామి తిరు కల్యాణ మహోత్సవం

నవతెలంగాణ -దుమ్ముగూడెం



మండలంలోని సున్నం బట్టి గ్రామంలో పవిత్ర గోదావరి నది తీరాన వెలసిన శ్రీ ఆదిశేష అవతార వెంకటేశ్వర స్వామి వారి తిరు కల్యాణ మహెూత్సవాన్ని సోమవారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం 3:30 గంటలకు స్వామి వారి సుప్రభాత సేవ, నాలుగున్నర గంటలకు పంచామృత అభిషేకములు, ఎనిమిది గంటలకు విశేష పూజా కార్యక్రమాలు, అంకురార్పణ విశ్వక్షేణ పూజ, వంటి విశేష పూజల అనంతరం ఉదయం 11 గంటలకు ఎదుర్కోలు మహెూత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు జిలకర వీరయ్య ఆధ్వర్యంలో పురోహితులు వెంకటేశ్వర స్వామి తిరుకల్యాణ మహెూత్సవాన్ని శాస్త్రక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరు కళ్యాణ మహెూత్సవాన్ని తొలగించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొండ కృష్ణ బాబు, పిన్నింటి స్వాతి, ఎంబడి అర్జునరావు, నాగరాజు, ప్రభాకర్, శివరావు, నరేష్ కుమారస్వామి పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

అకారణంగా దాడిచేసిన ఇరువురిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఈ.రతీష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండల పరిధిలోని బోడాయికుంట గ్రామానికి చెందిన కొమరం నాగేశ్వరావు అనే వ్యక్తి గత శనివారం రాత్రి 11 గంటల సమయంలో అదే గ్రామంలో జరిగే ఎడూళ్ల రామ్మూర్తి, కుంజ శ్రావణిల పెళ్ళి పెద్ద మనిషిగా ఉన్నారు. బోడాయికుంట గ్రామానికి పెళ్లి కూతురిని తీసుకుని వెళ్ళే క్రమంలో సమీపాన గల పెద్దూరు గ్రామం వద్ద ఆగిన సమయంలో మేళతాళాలు కాసేపు ఆపమని నాగేశ్వరరావు చెప్పినందుకుగాను, పెద్దూరు గ్రామానికి చెందిన కొమరం లక్ష్మయ్య కొమరం రామయ్యలు ఇరువురు మద్యం మత్తులో ఉండి అకారణంగా పెద్ద మనిషి అని చూడకుండా ఎవరు చెప్పినా ఆగకుండా నాగేశ్వరరావును కొట్టారు. అంతే కాకుండా అడ్డుపడిన ఎడూళ్ల సుధాకర్‌ను సైతం అసభ్యంగా తిట్టి, కొట్టి, చంపుతానని బెదిరింపులకు పాల్పడటంతో, వారితో ప్రాణాలకు ముప్పు ఉందని భావించిన నాగేశ్వరరావు గత ఆదివారం పెళ్ళి కార్యక్రమాలు పూర్తి అవడంతో సోమవారం తన ఫిర్యాదు మేరకు లక్ష్మయ్య, రామయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం



కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డి. వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనాల క్యాంపెన్‌లో భాగంగా సోమవారం పట్టణంలో ఉన్నటువంటి అన్ని పెట్రోల్ బంకులలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి వీరన్న మాట్లాడారు. బంకుల్లో పనిచేస్తున్న కార్మికులు సరైన వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు జీవులను వెంటనే విడుదల చేసి అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో స్క్రాప్ చోరీ

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఓ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. నియోజక వర్గం కేంద్రమైన అశ్వారావుపేట మండలంలోని పేరాయిగూడెం పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో గల స్టోర్ రూం తాళం ధ్వంసం చేసి అందులో ఉన్న నాలుగు పాత మెంటార్‌లు, 11 గేట్ వాల్‌లు, మరో నాలుగు చేతి పంపు మెటీరియల్‌ను అపహరించుకుపోయారు. చోరీకి గురైన సామగ్రి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి కోటమర్తి శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ విషయంపై ఎస్‌హెచ్‌ఓ ఎస్ఐ శ్రీరాముల శ్రీనును వివరణ కోరగా పిర్యాదు అందిందని, విచారణ చేస్తున్నామన్నారు.

మండల వ్యాప్తంగా హోలీ వేడుకలు

- వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న ఎస్సై

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



హోలీ పండుగను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రముఖ వ్యాపారస్తులు, యువతీ, యువకులు సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్ మర్కోడు, ఆళ్ళపల్లి గ్రామాల్లోని పలువురితో హోలీ పండుగ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలందరూ రంగులతో ఆడుకుంటూ ఆనందించే ఏకైక పండుగ హెూలీగా అభివర్ణించారు. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు ఈ హెూలీ పండుగ జరుపుకుంటామని వివరించారు. హెూలీ పండుగనే హెూలికా పూర్ణిమ అని కూడా పిలుస్తారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ హెూలీ సందడి వాతావరణం ఉంటుందని, అదేవిధంగా మండలంలో సైతం చూసినా అదే రంగులు కనిపిస్తున్నాయని, చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రంగులు పూసుకుని ఎంతో ఆనందంగా పండుగ జరుపుకోవడం హర్షణీయమన్నారు. జీవితాల్లో ఆనందాన్ని నింపడమే ఈ పండుగ ముఖ్య ఉద్దేశమని వ్యాఖ్యానించారు. అనంతరం రంగులతోనే కాకుండా డీజే పాటలకు ప్రజలతో మమేకమై ఎస్సై సరదాగా గడిపారు. ఈ వేడుకల్లో ప్రముఖ వ్యాపారస్తులు తాళ్లపల్లి రామ్మూర్తి, అనుమోల వెంకటేశ్వర్లు (మర్కోడు), తాళ్లపల్లి నాగేశ్వరరావు, బూరుగడ్డ రాములు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, కన్నయ్య యువత పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ పోలీసుల జాయింట్ ఆపరేషన్

- అబార్షన్లు చేయిస్తున్న వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ- ఖమ్మం



దంపతులకు ఒక ఆడపిల్ల పుట్టి, రెండవ సారి గర్భం దాల్చి స్కానింగ్ ద్వారా మరోసారి అడపిల్లని తెలిసినా, ఇద్దరు ఆడపిల్లలు కలిగి...మూడోసారి కూడా మగపిల్లాడు కాకుండా అడపిల్లని తెలియగానే కొన్ని హాస్పిటల్స్ నిర్వాహకులు అబార్షన్ చేస్తున్నారు. సోమవారం ఖమ్మంలోని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ సీఐ బాలాజీ బృందం టాస్క్ ఫోర్స్ ఏసీపీ సి.మల్లయ్య, సీఐ రామకృష్ణ, ఎస్సైలు వెంకటేష్, సురేష్‌లు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. ఖమ్మంలోని వైరా రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్ నిర్వాహకుడు గర్భం దాల్చిన మహిళ నెలలు బట్టి వెల కట్టి నగరం నడి బొడ్డున యథేచ్ఛగా అబార్షన్లు చేస్తున్న కేటుగాడిపై పోలీసులు ఆధారాలతో రెడ్ హ్యాండెడ్‌గా నిందితుడిని పట్టుకున్నట్లు సమాచారం. పట్టుబడ్డ నిందితుడు ఖమ్మం టూ టౌన్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. మహిళల నెలలు బట్టి వెల కట్టే మరికొన్ని హాస్పిటల్స్ పైన దృష్టిసారించాల్సిన అవసరం ఎంతయినా ఉందని, ప్రజలు సంబంధిత శాఖల అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో స్పెషలైజేషన్ డాక్టర్లు లేకుండా, అనుభవం కలిగిన నర్సులతో అర్ధగంటలో అబార్షన్ చేసి ఇంటికి పంపే హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లింగ నిర్ధారణ నేరమని తెలిసి కూడా, స్కానింగ్ తీసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు, మహిళ సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని హాస్పిటల్స్ ప్రసూతి హాస్పిటల్ పేరుతో గైనిక్ డాక్టర్‌తోనే అబార్షన్లు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మహిళలను చెకప్ పేరుతో కర్టన్ వేసి స్కానింగ్ చేయడం బరితెగింపుకు నిదర్శనంగా చెప్పొచ్చు. వీరిపై కూడా నిఘా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పసిగుడ్డును కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా గ్రామీణ వైద్యులు గర్భం తీసేయలనుకున్న కుటుంబాలను గుర్తించి, వారిని బ్రోకర్లకు అప్పగిస్తే...వారు అబార్షన్లు చేసే హాస్పిటల్స్‌కు రిఫర్ చేయడం బాధాకరం. గర్భం దాల్చిన కుటుంబాల బలహీనతను బట్టి అక్రమ సంపాదనకు హాస్పిటల్ నిర్వాహకులు తెరలేపారు. సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవడంలో ఒక్క హాస్పిటల్‌కు మాత్రమే పరిమితం కాకుండా మిగతా హాస్పిటల్స్‌పై సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మజ్జిగ, ఫ్రూట్స్ పంపిణీ

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్(ISGF) ఉమెన్స్ గిల్డ్ భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీ రామ భక్తులకు సేవా కార్యక్రమం నిర్వహించారు. కొత్తగూడెంలోని శ్రీ విజయవిఘ్నేశ్వర స్వామి దేవాలయం నుంచి శ్రీరామనవమి సందర్భంగా గోటి తలంబ్రాలు తీసుకొని భద్రాచలం వెళ్లే భక్తులకు ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉమెన్స్ గిల్డ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో సింగరేణి గెస్ట్ హౌస్ రోడ్డు ఎదురుగా పోచమ్మ గుడి వద్ద (నియర్ సెంట్రల్ పార్క్) మజ్జిగ ప్యాకెట్లను, అరటి పళ్ళు పంపిణీ చేశారు. మత సామరస్యం వెల్లి విరిసే విధంగా తొలిసారిగా ఉమెన్స్ గిల్డ్ ఈ కార్యక్రమం ను ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులు లోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాసీంల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమెన్స్ గిల్డ్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ నూరి మెహరున్నిసా, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్వేత, కోశాధికారి సోనా, జిల్లా ముఖ్య సలహాదారులు కనకదుర్గ, ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ స్కూల్ హెచ్‌ఎం, ఉమెన్స్ గిల్డ్ ముఖ్య సలహా దారు ఎం. జ్యోతిరాణి పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో అపశ్రుతి

- వాగులో దిగి ప్రాణాలు కోల్పోయిన యువకుడు

నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి



హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని పలువురు యువకులు ఘనంగా సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ క్రమంలోనే నలుగురు యువకులు మండల పరిధిలోని సాటువారిగూడెం గ్రామ సమీపంలో రంగులు కడుక్కుందామని వాగులో దిగారు. మోకాళ్ళ రాంబాబు (25) యువకుడు కాలుజారి వాగులో పడి మృతి చెందారు. రంగులు పూసుకుని అనంతరం స్నానం ఆచరిద్దామని రాంబాబు ఇంటికి వెళ్లారు. ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్న రాంబాబు ఇంటి వద్దకు మరో ముగ్గురు యువకులు వచ్చారు. వారితో పాటు రాంబాబు కూడా మద్యం సేవించి అనంతరం ఒంటి మీద ఉన్న రంగులను కడుక్కుందామని సమీపంలో ఉన్న వాగు వద్దకువెళ్ళాడు. మద్యం మత్తులో ఉన్న రాంబాబు వాగులో దిగడంతో బండపై కాలు జరి పడడంతో గుంతలో పడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే లక్ష్మీదేవి పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్థాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ-మణుగూరు



ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షలకు అనారోగ్య కారణాలతో హాజరుకాకపోయిన నేపథ్యంలో మనస్థాపానికి గురైన మణుగూరు మండల పరిధిలోని సమితి సింగారం విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి...గ్రామానికి చెందిన యాప శ్రావన్ కుమార్ (16) ఇంటర్ పరీక్షల్లో గైర్హాజైన కారణంగా మనస్థాపంతో ఇంట్లో తల్లి లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని సమితి సింగారం పంచాయతీ పరిధిలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద నివాసం ఉంటున్న యాప శ్రావన్ కుమార్ ఇటీవల ఇంటర్ విద్య పూర్తి చేశారు. సోమవారం మధ్యాహ్నం తన గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రావన్ ఉరివేసుకున్న సమయంలో అతడి సోదరుడు, అమ్మమ్మ ఇంట్లో ఉన్నప్పటికీ సమయానికి గుర్తించలేకపోయారు. గడి తలుపులు వేసి ఉండటంతో శ్రావన్‌ను తలుపులు తీయాలని కొట్టినప్పటికీ స్పదించకపోవడంతో చుట్టుపక్కల వారి పిలువగా తలుపు తెరిచే సమయానికి శ్రావన్ మృతదేహమై కనిపించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మణుగూరు ఎస్సై ప్రసాద్ తెలిపారు.



పర్ణశాల రామయ్యను దర్శించుకున్న ఆర్డీవో దామోదర్‌రావు

నవతెలంగాణ -దుమ్ముగూడెం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామివారిని ఇటీవల భద్రాచలం ఆర్డీవో బాధ్యతలు చేపట్టిన ఆర్డిఓ దామోదర్ రావు సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేక స్వాగతం పలికి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సీత కుటీర ప్రదేశంతో పాటు, నార చీరెల ప్రాంతాలను సందర్శించి పర్ణశాల ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. వచ్చేనెల 17వ తేదీన జరిగే శ్రీరామ కళ్యాణ ఏర్పాట్ల గురించి ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

కట్టుకథల ప్రచారానికి తెర

- మోసగాళ్లకు వరంగా మారిన ఏఐ





న్యూఢిల్లీ : ఎన్నికల సీజన్ వచ్చేసింది. కట్టు కథలతో తప్పుడు సమాచారం కొత్త రూపు సంతరించుకుంటోంది. అది ఓటర్లతో ముచ్చటించగలదు. వారిని ఆకర్షించి బుట్టలో వేసుకోగలదు. దీనిని కనిపెట్టడం చాలా కష్టం. నియంత్రించడం మరింత కష్టం. 2019 ఎన్నికల్లో కూడా విద్వేష ప్రసంగాలు, తప్పుడు సమాచారంతో ప్రచారాలు నడిచాయి. అయితే సాంకేతిక పరిజ్ఞానం దినదినాభివృద్ధి చెందుతుండడంతో ఈ దుష్ప్రచారం కూడా వేగం పుంజుకుంటోంది. తప్పుడు వార్తలు, కట్టు కథలను అదుపు చేసేందుకు సామాజిక మాధ్యమ కంపెనీలు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. ప్రభుత్వం కూడా చట్టాలకు పదును పెట్టి తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేయడానికి కృషి చేస్తోంది. అయితే ఎవరెన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ప్రజలను మోసం చేయడానికి కొత్త దారులు కనిపెడుతూనే ఉన్నారు. 2019 ఎన్నికల్లో కూడా ఈ 'నకిలీ'ల బెడద ఎక్కువగానే కన్పించింది. గత సంవత్సరం కృత్రిమ మేథ (ఏఐ) బూమ్ పెరగడంతో వీడియోలను మార్ఫింగ్ చేయడం, తప్పుడు సమాచారాన్ని ప్రచారంలో పెట్టడం సులభమైంది.

ఈ ప్రక్రియ యావత్తూ చౌకగా, సమర్థవంతంగా పూర్తవుతోంది. ఒకప్పుడు వాట్సప్ ఫార్వర్డ్ సందేశాలు, ఐటీ బాట్-రన్ అకౌంట్లు బాగా వ్యాప్తి చెందాయి. ఇవి భౌతిక హింసకు దారితీశాయి కూడా.ఇప్పుడు ఏఐ సాయంతో మాటలను సెకండ్ల వ్యవధిలో యూనిక్ ఇమేజ్‌గా మార్చడం సులభమైంది. ఇది నేరగాళ్లకు వరంగా మారింది. బలహీనవర్గాలను లక్ష్యంగా చేసుకొని తప్పుడు ప్రచారాలతో మోసగిస్తున్నారు. హక్కుల సంఘాలు దీనిపై ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నాయి. గతంలో కంటే ఎక్కువగా గళం విప్పి వారిని చైతన్యపరుస్తున్నాయి. ఏదేమైనా ఈ తప్పుడు ప్రచారం కారణంగా సగటు భారతీయ ఓటరు ఎక్కువగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. వాస్తవమేమిటో, ఏఐ సాయంతో కల్పించింది ఏమిటో తెలుసుకునే పరిజ్ఞానం వారిలో అంతగా ఉండదు మరి.

నగరంలో విస్తృత తనిఖీలు

- భారీగా పట్టుబడుతున్న నగదు
- మద్యం, విలువైన వస్తువులు
- హైదరాబాద్ జిల్లాలో ఇప్పటివరకు రూ.2.24కోట్లు సీజ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు జీహెచ్ఎంసీ, పోలీస్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశాలతో హైదరాబాద్ నగర వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.2.24కోట్లను స్వాధీనం చేసుకున్నారు. గత శనివారం వరకు జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు రూ.1,73,60,800ను సీజ్ చేయగా, రూ.23,61,964 విలువైన ఇతర వస్తువులు, 314.45 లీటర్ల అక్రమ మద్యంను పట్టుకున్నారు. సోమవారం రూ.4,60,000 సీజ్ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు హైదరాబాద్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, జీహెచ్ఎంసీ అధికారులు తనిఖీలు చేశారు. రూ.4,60,000, రూ. 3,06,193 విలువ గల వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.3,45,000 సీజ్ చేయగా, పోలీస్‌ల ద్వారా రూ.1,15,000 పట్టుకున్నారు.

నగదు, ఇతర వస్తువుల రవాణాపై 22 ఫిర్యాదులు రావడంతో అధికారులు వాటిని పరిశీలించారు. 20 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఇక 360.90 లీటర్ల మద్యాన్ని పట్టుకున్న పోలీసులు, 20 మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. ఎన్నికల నిబంధనలను ఎవరు అతిక్రమించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ హెచ్చరించారు. ఇదిలావుండగా, ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.2 కోట్ల 24 లక్షల 81 వేల 800, 32 లక్షల 91 వేల 571 రూపాయల విలువైన వివిధ వస్తువులు,1045.065 లీటర్ల మద్యం పట్టుబడింది. 61 మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

వామపక్ష విద్యార్థుల విజయం మనువాదులకు చెంపపెట్టు

- జేఎన్‌యూ విద్యార్థులకు జేజేలు:ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో వామపక్ష విద్యార్థుల విజయం మనువాదులకు చెంపపెట్టు లాంటిదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పేర్కొంది. దేశ రాజధాని ఢిల్లీలో మతోన్మాద ఏబీవీపీని ఓడించి వామపక్ష విద్యార్థి సంఘాలను గెలిపించిన ఆ వర్సిటీ విద్యార్థులకు జేజేలు తెలిపింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతున్నదనీ, కార్పొరేట్ వర్గాలకు మేలు చేసేలా అమెరికా, ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేస్తున్నదని విమర్శించారు. నూతన విద్యావిధానం-2020ని తెచ్చి విద్యారంగంలో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేయాలని చూస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను ఒకే గొడుగు కిందకు తేవాలనే పేరుతో సీయూఈటీని తెచ్చిందని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ కోసం ఎన్‌టీఏను ఏర్పాటు చేసి ఫీజులు దండుకుంటున్నదని విమర్శించారు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని నాశనం చేస్తూ కావాలనే నిధులు కేటాయించకుండా ఫీజులను భారీగా పెంచి ఇప్పుడిప్పుడే కింది వర్గాల నుంచి ఉన్నత చదువుల కోసం వర్సిటీలకు వస్తున్న విద్యార్థులపై భారాలను మోపుతున్నదని తెలిపారు.

వారిని ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర దాగి ఉన్నదని పేర్కొన్నారు. జేఎన్‌యూలో మతోన్మాదులను ఎలాగైనా గెలిపించేందుకు ఏబీవీపీకి అనుకూలంగా జేఎన్‌యూ వర్సిటీ పరిపాలనా విభాగం పనిచేసిందని విమర్శించారు. అందులో భాగంగానే లెఫ్ట్ కూటమి ప్రధాన కార్యదర్శి అభ్యర్థిని పోలింగ్‌కు రెండురోజుల ముందు అనర్హులుగా ప్రకటించారని తెలిపారు. వర్సిటీలోకి ఆర్ఎస్ఎస్ వ్యక్తులు, బీజేవైఎంకు చెందిన వ్యక్తులు ప్రవేశించి విద్యార్థులపై దాడులు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు డబ్బు, ఇతర ప్రలోభాలకు గురి చేశారని వివరించారు. అయినా దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత విశ్వవిద్యాలయ విద్యార్థులు తీసుకున్నారని తెలిపారు.

అందుకే వామపక్ష విద్యార్థి సంఘాలను విద్యార్థులు గెలిపించారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మోడీని కూడా ఓడించాలనీ, దేశంలో ప్రజాస్వామ్యం, విద్వేషాలు, విభజనలు లేని, స్వేచ్ఛ కోసం పోరాడాలని విద్యార్థి లోకానికి వారు పిలుపునిచ్చారు.

మెడికోస్ పాలిట.. సైకోస్

- విచారణ కమిటీకి సమాచారం ఇవ్వని వైనం
- విద్యార్థులకు మెస్ లేదు..
- కాంట్రాక్టు సిబ్బందికి సౌకర్యాలూ లేవు..
- అవినీతి అక్రమాలపై ఏసీబీకి ఫిర్యాదు..?



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మెడికల్ కళాశాల అవినీతి, అక్రమాలకు నిలయంగా మారింది. ఇటీవల కళాశాల ప్రిన్సిపాల్ వేధింపుల కారణంగా మెడికల్ విద్యార్థులు (మెడికోస్) రోడ్డెక్కి ఆందోళన చేసిన నేపథ్యంలో అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బట్టబయలు అవుతున్నాయి. కాలేజ్ ప్రిన్సిపాల్ విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, ద్వంద్వ అర్థాలతో మాట్లాడుతూ సైకోస్‌గా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు బహిరంగంగా మీడియాకు వెల్లడించడం దుమారం లేపింది. ప్రిన్సిపల్, సిబ్బంది వ్యవహార తీరుపై క్యాంపస్‌లో ఆందోళన నిర్వహించడంతో పాటు కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళ్లి కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశారు. దాంతో ఈ వ్యవహారంపై డాక్టర్ అమర్ నాయక్ ఆధ్వర్యంలో ఖమ్మం మెడికల్ కళాశాలకు చెందిన అధికారులతో రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రెటరీ విచారణ కమిటీని నియమించారు. రాష్ట్ర విజిలెన్స్ అధికారులూ మెడికల్ కళాశాలలో జరుగుతున్న పలు అక్రమాలు, అవినీతి, విద్యార్థుల వేధింపులపై సమాచారం సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు.

గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను మంజూరు చేసిన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ మెడికల్ కళాశాల ఏర్పాటైంది. మొదటి సంవత్సరం 149 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ద్వితీయ సంవత్సరం 150 మంది విద్యార్థులు చేరారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ సీట్లు పొందారు. మెడికల్ కళాశాల ప్రారంభం నుంచే ప్రిన్సిపాల్ అనేక అవినీతి అక్రమాలకు తెరలేపారని విమర్శలున్నాయి. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిన నియమించే ఉద్యోగుల భర్తీలో కోట్లాది రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల అండదండలతో ఔట్‌సోర్సింగ్ నియామకాలు నిర్వహించినట్టు తెలిస్తోంది. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.3 లక్షల వరకూ వసూలు చేసినట్టు వినికిడి. ఇలా ఉండగా మెడికల్ కళాశాలలో టెండర్ ప్రక్రియ లేకుండానే బస్సులూ ఏర్పాటు చేశారని ఆరోపణలున్నాయి.

విద్యార్థులకు మెస్ లేదు.. ఉద్యోగులకు సౌకర్యాలూ లేవు..

మెడికల్ కళాశాల హాస్టల్‌లో సుమారు 300 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సరైన భోజనం, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. కాలేజీ ప్రారంభంలోనే విద్యార్థుల నుంచి ఏక మొత్తంలో మెస్ ఫీజులు వసూళ్లు చేసి ప్రయివేటు వారికి అప్పగించారు. అయినా భోజనం రుచిగా లేకపోవడంతో రోజూ విద్యార్థులు బయటి నుంచి ఆహారాన్ని తెప్పించుకొని తింటున్నారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీలో మెస్ మూసివేశారు. మెడికల్ కళాశాలలో ప్రభుత్వమే బస్సులు ఏర్పాటు చేయాలి. కానీ, ఇక్కడ ప్రయివేటు బస్సులు ఏర్పాటు చేసి విద్యార్థుల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అంతేకాదు,కళాశాలలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ వివరాలు సక్రమంగా లేవని సమాచారం. కొనుగోళ్లపై జీఎస్టీ చెల్లింపుల్లో అక్రమాలు, అవకతవకలు.. తదితర అంశాలపై విచారణ కమిటీ సమాచారం సేకరించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గతేడాది 32 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించగా.. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్టు సమాచారం.

మెడికోస్ పాలిట సైకో..

ఉన్నతమైన వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల కళాశాల ప్రిన్సిపాల్ సైకోలా వ్యవహరిస్తున్నారని యువతులు నేరుగా మీడియా ముందు బావురుమన్నారు. అర్ధరాత్రి పూట యువతలు ఉన్న హాస్టల్‌కు వెళ్లి వారు వేసుకున్న దుస్తులపట్ల ద్వంద్వ అర్థాలతో మాట్లాడేవారని, నైట్ డ్రస్‌ల మీద ఉన్న వారిని ఫొటోలు, వీడియోలు తీసేవారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నేరుగా హాస్టల్‌కి రావడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో విద్యార్థులు కన్నీటి పర్యంతంగా బహిరంగంగా మీడియా ముందు చెప్పడం చర్చనీయాంశంగా మారింది. అసభ్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విచారణ కమిటీని లెక్కచేయని ప్రిన్సిపల్..?

కొత్తగూడెం మెడికల్ కళాశాలలో అవినీతి అక్రమాలపై రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు అందిన నేపథ్యంలో డాక్టర్ అమర్‌నాయక్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ కళాశాలను సందర్శించింది. ప్రిన్సిపాల్‌ను సంబంధిత అధికారులు సమాచారం కోరినప్పటికీ ఏమాత్రం స్పందించలేదని, విచారణ కమిటీని లెక్కచేయలేదని సమాచారం. కాలేజీలోకి రాకుండా విచారణ కమిటీ అధికారులను అడ్డుకున్నారని తెలిసింది. ఎలాంటి సమాచారమూ ఇచ్చేది లేదని బెదిరింపులకు పాల్పడ్డారని వినికిడి. సుమారు 25 అంశాలతో కూడిన సమాధానాలు సేకరించాలని ప్రయత్నించగా కేవలం 5 సమాధానాలు మాత్రమే ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఖమ్మం మెడికల్ కళాశాల అధికారులు కమిటీగా వచ్చి విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. దాంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిఘా విభాగం (ఇంటిలిజెన్స్) మెడికల్ కళాశాలలో జరుగుతున్న వివాదాలపై నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించినట్టు సమాచారం. కాగా, కొత్తగూడెం సర్వజన ఆస్పత్రి గత సూపరింటెండెంట్ డాక్టర్ కుమారస్వామి హెల్త్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు చర్చ నడుస్తున్నది.

పర్యాటకం పేరుతో గిరిజనంపై వేటు

- ప్రపంచ రక్షిత ప్రాంతాలను రెట్టింపు చేయాలనే లక్ష్యం.. గిరిజనులకు ప్రమాదం
- ఇది వారి జనాభాను దెబ్బ తీస్తుంది
- సామాజిక కార్యకర్తలు, నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ : పర్యాటకం పేరుతో రక్షిత ప్రాంతాలను ప్రయివేటీకరించటం స్థానిక తెగల ఉనికికి అత్యంత తీవ్రమైన సవాలుగా పరిణమించింది. అక్కడ నివసించే ఆదివాసీలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని సామాజికవేత్తలు, పర్యావరణ నిపుణులు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా రక్షిత ప్రాంతాలను దాదాపు రెట్టింపు చేయటం ద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడే ప్రయత్నం భారత్‌లోని గిరిజన జనాభాను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్చి 22 న యునైటెడ్ స్టేట్స్‌లోని అరిజోనా విశ్వవిద్యాలయం నిర్వహించిన స్వదేశీ సంఘాల హక్కులపై జరిగిన సింపోజియంలో నిపుణులు ఈ మేరకు హెచ్చరించారు.

యూఎన్ కున్మింగ్-మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్ ప్రపంచ భూభాగంలో రక్షిత ప్రాంతాలను ప్రస్తుత 16 శాతం నుంచి 30 శాతం వరకు పెంచే లక్ష్యాన్ని అనుసరిస్తే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్థానిక ప్రజలు నష్టపోతారని నిపుణులు అంటున్నారు. దేశంలోని 106 నోటిఫైడ్ నేషనల్ పార్క్‌లలో 89 వారు నివసించిన ప్రాంతాలలో స్థాపించబడ్డాయనీ, ఈ కారణంగా భారత్‌లోని షెడ్యూల్డ్ తెగలు ఈ విస్తరణ భారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. అంటే.. భారత్‌లోని 84 శాతం రక్షిత ప్రాంతాలు గిరిజన ప్రాంతాలతో అతివ్యాప్తి చెందుతున్నా యని న్యూఢిల్లీకి చెందిన హక్కుల కార్యకర్త సుహాస్ చక్మా 'పరిరక్షణ, జాత్యహంకారం మరియు మూలవాసుల మానవ హక్కులు' అనే అంశంపై జరిగిన సింపోజియంలో అన్నారు.



'అసమాన ప్రభావం'

మిగిలిన 17 నేషనల్ పార్క్‌లలో.. సౌత్ బటన్ ఐలాండ్ నేషనల్ పార్క్, రాణి ఝాన్సీ మెరైన్ నేషనల్ పార్క్(అండమాన్ మరియు నికోబార్ దీవులలో) సముద్ర ప్రాంతాలలో ఉన్నాయి. ఇక్కడ మానవ నివాసాలు లేవు. వాన్ విహార్, కాసు బ్రహ్మానంద రెడ్డి, మహావీర్ హరినా వనస్థలి, సలీం అలీలు జంతుప్రదర్శనశాలలు కాగా.. కల్నల్. షెర్జంగ్ సింబల్‌బరా, నియోరా వ్యాలీ, సింగలీలా, శిలాజలు కొంత గిరిజన జనాభాను కలిగి ఉన్నాయి. మరోవైపు, ఏడు జాతీయ పార్కులతో సాధారణ వర్గానికి చెందిన ప్రజలు మాత్రమే ప్రభావితమయ్యారని చక్మా చెప్పారు. "భారత్‌లోని మొత్తం జనాభాలో 8.6 శాత ఉన్న ఎస్టీలు కూడా రక్షిత ప్రాంతాల ద్వారా ప్రభావితమైన 84 శాతం కమ్యూనిటీలను కలిగి ఉన్నారు. ఇది ప్రపంచంలోని జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థను కాపాడటానికి స్థానిక ప్రజల అసమాన లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది. వారి జీవనశైలి, జీవనోపాధి పద్ధతులు వలసరాజ్యాల కాలం నుంచి అటవీ చట్టాలతో నేరంగా మారాయి "అనిచక్మా అన్నారు. ఇలాంటి చర్యలపై కేంద్రం తగిన చర్యలను తీసుకొని, గిరిజనులకు అండగా ఉండాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు.

నాగార్జునకొండకు వియత్నాం జర్నలిస్టులు

- బుద్ధవనమూ సందర్శన

నవతెలంగాణ-హైదరాబాద్

జర్నలిజం, ప్రజాసంబంధాలపై శిక్షణా కార్యక్రమానికి వియత్నాంకు చెందిన 26 మంది మీడియా నిపుణుల బందం హాజరైంది. దక్షిణ భారతదేశంలోని అత్యంత ధనిక బౌద్ధ అభ్యాస కేంద్రాలలో ఒకటిగా ఉన్న నాగార్జున కొండను సందర్శించింది. ఇండియన్ టెక్నికల్, ఎకనామిక్ కోఆపరేషన్ కార్యక్రమం కింద భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. మీడియా నిపుణులు మ్యూజియాన్ని సందర్శించి బుద్ధుని స్థూపాలు, సంబంధిత కథనాల సేకరణను చూసి ఆశ్చర్యపోయారు. బుద్ధుని విగ్రహానికి పూజలు చేశారు. బుద్ధవనం ప్రాజెక్టును సైతం మీడియా నిపుణులు సందర్శించారు. ప్రముఖ బౌద్ధ సన్యాసి పండితుడు ఆచార్య నాగార్జునకు సంబంధించిన వీడియోలను వారు వీక్షించారు. ప్రార్థనలు చేసి, వత్తిపరమైన, వ్యక్తిగత శ్రేయస్సు కోసం ఆచార్య నాగార్జున ఆశీర్వాదం కోరారు. బుద్ధుడు, ఆచార్య నాగార్జున జన్మస్థలం గురించి వారి తల్లిదండ్రుల నుంచి విన్నామని మీడియా నిపుణులు పేర్కొన్నారు. "నాగార్జున కొండ, మ్యూజియం , బుద్ధవనం ప్రాజెక్టులను సందర్శించడం అనేది విదేశాంగ మంత్రిత్వ శాఖ , డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల సంస్థ ద్వారా మాకు జీవితంలో ఒక్కసారి మాత్రమే లభించే అవకాశం" అని మీడియా పేర్కొన్నారు. ఈమేరకు డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవవనరుల సంస్థ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

జగిత్యాల గంజాయి కేసులో సంచలన విషయాలు

నవతెలంగాణ - జగిత్యాల టౌన్

జగిత్యాల జిల్లా కేంద్రంలో బాలికలకు గంజాయి అలవాటు చేసి ట్రాప్ చేసిన కేసులో సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఓ బాలికకు ముగ్గురు నిందితులు గంజాయి ఇచ్చి లైంగికదాడి చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా పలు విషయాలు బయటికి వచ్చాయి. అందులో ఒక వ్యక్తి బాలికను పెండ్లి చేసుకుంటానని నమ్మించి గంజాయి ఇచ్చి లైంగికదాడి చేసినట్టు పోలీసులు తెలిపారు. జగిత్యాల జిల్లా పోలీసులు సోమవారం పలు విషయాలను మీడియాకు ప్రకటన ద్వారా వెల్లడించారు.మల్యాల మండలం తక్కళపల్లి గ్రామానికి చెందిన ఆరెల్లి ప్రేమ్ కుమార్(25) జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో వాటర్ ప్రూఫింగ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు.

నెల్లోగా ప్రాథమిక నివేదిక వచ్చేనా !?

- లోతుగా అధ్యయనం
- కాళేశ్వరం బ్యారేజీల్లో అనేక లోపాలు: అధికారులు, ఇంజినీర్ల భేటీలో ఒక్కొక్కటిగా వెలుగులోకి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఒకటి కాదు, రెండు కాదు అనేక లోపాలు బయటపడుతున్నాయి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) నియమిత నిపుణల కమిటీ మలిదఫా పర్యటనలో సాంకేతిక అంశాలు కమిటీ దృష్టికొస్తున్నాయి. స్థలం మార్పిడి దగ్గర నుంచి మొదలెడితే నిర్మాణానికి అనుసరించాల్సిన మెథడాలజీలోనూ ఘోరమైన తప్పులు దొర్లినట్టు తెలిసింది. కమిటీ చైర్మెన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, సెంట్రల్ డిజైన్ బృందాలతో విడివిడిగా విచారిస్తున్న క్రమంలో ప్రాజెక్టు పనికి వస్తుందా ? రాదా ? అనే అనుమానాలు నిపుణుల కమిటీకి వచ్చినట్టు సమాచారం. కమిటీ మూడు రోజుల రాష్ట్ర పర్యటన గత శుక్రవారం ముగిసింది. రెండు రోజులు హైదరాబాద్‌లోని జలసౌధలో అధికారులతో సమావేశమయ్యారు. మాజీ ఈఎన్సీలు సి.మురళీధర్‌రావు, నల్లా వెంకటేశ్వర్లును సైతం విచారించింది. ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఈఎన్సీ జనరల్ బి అనిల్‌కుమార్‌తోనూ చర్చించారు. పర్యటనకు వచ్చిన తొలిరోజే సాగునీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోనూ భేటి అయ్యారు. వీరందరితోనూ సమావేశమై వివరాలు తెలుసుకున్న తర్వాత ప్రాథమిక నివేదిక నెలరోజుల్లో వచ్చే అవకాశాలు కనిపించడం లేదని సాగునీటి శాఖ అధికారులే అంటున్నారు. జలసౌధలో దీనిపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఒక్కొక్కటిగా విస్తుపోయే అంశాలు బయటకు వస్తుండటంతో నిపుణుల కమిటీ నెలరోజుల్లో నివేదిక ఇచ్చే విషయమై పునరాలోచిస్తున్నట్టు తెలిసింది. దాదాపు 19 రకాల సమాచారాన్ని ప్రభుత్వాన్ని అడిగిన విషయం విదితమే. ఇప్పటికే దాదాపు అంతా ఇచ్చినట్టు తెలిసింది. కాగా ప్రాజెక్టు నిర్మాణంలో ప్రాథమిక సూత్రాలను బీఆర్ఎస్ సర్కారు పాటించలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల మధ్య నిర్మాణంలో అనేక తేడాలు ఉన్నట్టు కమిటీ గుర్తించినట్టు సమాచారం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చోటుచేసుకున్న పొరపాట్లు, తప్పుల మూలంగా మొత్తం ప్రాజెక్టే ప్రశ్నార్థమయ్యే అవకాశాలు లేకపోలేదని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్నారు. సెంట్రల్ డిజైన్ ఇంజినీర్లతో భేటి సందర్భంగా కీలకమైన విషయాలు బయటకొచ్చాయని తెలిసింది. ఇదిలావుండగా విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ రాజీవ్‌రతన్‌తోనూ నిపుణుల బృందం భేటి అయింది. వాళ్ల దృష్టికొచ్చిన సాంకేతిక అంశాలను ఆరా తీసినట్టు సమాచారం. డీపీఆర్‌కు కేంద్ర జలసంఘం ఆమోదం లేకుండానే నిర్మాణ కంపెనీ ఒప్పందం చేసుకోవడం వెనుక కారణాలను అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. మూడు బ్యారేజీలకు చెందిన ఆపరేషన్, నిర్వహణ అంశాలపై చర్చించినట్టు సమాచారం.

24గంటల్లో 50మంది పాలస్తీనియన్లు మృతి

- నిర్బంధంలో మరో 15 మంది: రాఫాలో దారుణ పరిస్థితులు

గాజా : గాజా వ్యాప్తంగా గత 24గంటల్లో జరిగిన దాడుల్లో 50మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. సెంట్రల్ గాజాలోని డేర్ అల్ బాలాహ్ ప్రాంతంలో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో 22మంది చనిపోగా, రాఫా నగరంలో మరో 30మంది మరణించారు. ఇప్పటికే దాడుల్లో చాలా భాగం ధ్వంసమైన అల్ షిఫా ఆస్పత్రిని ఇజ్రాయిల్ బలగాలు దిగ్బంధించగా అక్కడ నుండి పారిపోయిన పాలస్తీనియన్లు ఆ దారుణ పరిస్థితులను గుర్తు చేసుకుని భయ కంపితులవుతున్నారు. ఇజ్రాయిల్ ట్యాంకులు, సాయుధ బుల్డోజర్లు నాలుగు మృత దేహాలపై, అంబులెన్సులపైనుండి వెళ్ళిపోయాయని వారు చెప్పారు. రాఫా నగరంలో ప్రతి క్షణమూ భయంతో గడపాల్సి వస్తోందని అక్కడి ప్రజలు పేర్కొంటున్నారు. భయకంపితులమవుతూ, ఆకలితో, నిలువ నీడ లేకుండా భవిష్యత్తు ఏమిటో తెలియకుండా అనిశ్చిత పరిస్థితుల్లో బతుకీడుస్తున్నామని వారు వాపోయారు. దక్షిణ గాజాలోని అల్ అమల్, నాసర్ ఆస్పత్రులను కూడా బలగాలు చుట్టుముట్టాయి. ఉత్తర గాజాలోకి ఇక ఎంతోకాలం ఐక్యరాజ్య సమితి ఆహార బృందాలను అనుమతించది లేదని ఇజ్రాయిల్ యూఎన్‌కి తెలియచేసింది. ఉత్తర గాజాలో ఇప్పటికే 70శాతానికిపైగా ప్రజలు తీవ్రమైన ఆహార కొరతతో కరువుబారిన పడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆ ప్రాంతానికి పెద్దఎత్తున ఆహార సరఫరాలు అందాల్సిందేనని గుటెరస్ స్పష్టం చేశారు. అది చాలా అత్యవసరమని వ్యాఖ్యానించారు. గతేడాది అక్టోబరు నుండి ఇజ్రాయిల్ విచక్షణారహితంగా జరుపుతున్న యుద్ధంలో ఇప్పటివరకు 32,333మంది మరణించగా, 74,694మంది మరణించారు.

"ఈ పిల్లలకు జయంతి ఒక అక్క. మాతృమూర్తి. ఈ పిల్లలను సొంతం చేసుకున్న తీరు చూస్తే సమాజ సేవకు జయంతి ఎంత నిబద్ధతగా పనిచేస్తుందో అర్థమవుతుంది" అని వాసంతి అన్నారు.

'జయంతి ధైర్యవంతురాలు, దయగల అమ్మాయి. గిరిజన బాలికలకు జర్నలిజంలో శిక్షణ ఇవ్వడం సమాజానికి గొప్ప ఆస్తి' అని బీబీసీ హిందీ మాజీ జర్నలిస్ట్, సీజీనెట్ స్వర వ్యవస్థాపకుడు శుభ్రాంశు చౌదరి కొనియాడారు.



గిరిజనుల జీవితాల్లో వెలుగు రేఖ..

గిరిజన మహిళలకు వెలుగు రేఖ ఆమె. అడవిలో తిరుగుతూ... జర్నలిస్టుగా మారి సోషల్ మీడియా వేదికగా గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపే ప్రయాణం సాగిస్తున్నది. ఆమే కోయ తెగకు చెందిన జయంతి బురుడ. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలోని ఆదివాసీ గ్రామం సెర్పల్లి ఆమె సొంతూరు.

జయంతి బురుడాకు 11 మంది తోబుట్టువులు. అందులో ఆమె తొమ్మిదో అమ్మాయి. ఆదివాసీ గ్రామమైన సెర్పల్లి చుట్టుపక్కల ఉన్న అడవుల్లో కట్టెలను సేకరించటానికి, పశువులను మేపడానికి, మహువా పువ్వులు కోయడానికి ఆమె తల్లి వెళ్లేది. తల్లికి సహాయంగా జయంతి కూడా అడవి బాట పట్టేది. చదువుపై ఆసక్తి కనబరచడంతో మల్కన్‌గిరి జిల్లా సెర్పల్లిలో ఉన్న ఒకే ఒక్క పాఠశాలలో చేర్చారు. పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులు ఆమెను ఎంతో ప్రోత్సహించారు. దీంతో ఆమెకు విద్యపై ఆసక్తి మరింత పెరిగింది. అంతే 10వ తరగతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఏకైక బాలికగా రికార్డు కెక్కింది.

జయంతి... పై చదువులు చదవాలని కలలుగన్నది. ఆమె తండ్రి వ్యతిరేకించినా.. పట్టుబట్టి మల్కన్‌గిరి పట్టణానికి వెళ్లింది. ఆర్థిక ఇబ్బందులూ ఆమెను వెంటాడాయి. అయినా తన కష్టాన్ని నమ్ముకుంది. క్లాసులు ముగిశాక... పొరుగున ఉన్న మురికివాడలోని కూలీల పిల్లలకు ట్యూషన్లు చెప్పటం ప్రారంభించింది. సామాజిక సేవలో సంతృప్తి ఉందని గ్రహించింది జయంతి. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో స్వచ్ఛందంగా పనిచేయాలని నిర్ణయించుకుంది.

జర్నలిజం చదవాలని..

సామాజిక సేవలో భాగంగా వివిధ కార్యాలయాలను సందర్శిస్తున్నప్పుడు పితృస్వామ్య ఆధిపత్యం సమాజంలో ఎంతలా వేళ్లూనుకుపోయిందో ఆమెకు అర్థమైంది. ఒక మహిళగా... ఆమె ప్రశ్నలకు లేదా అభ్యర్థనలకు ఉన్నత స్థానాల్లో ఉన్న పురుషుల స్పందన కరువైంది. అప్పుడే జర్నలిజం చదవాలని నిర్ణయించుకుంది. 'నేను జర్నలిజం చదవాలి. అప్పుడే ఈ వ్యక్తులు స్పందిస్తారు, నన్ను గౌరవిస్తారు, నా మాట వింటారు, నన్ను చూసి భయపడతారు...' అంటుంది జయంతి. ఎన్నో కష్టాలు పడి.. కోరాపుట్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో రెండేండ్ల జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ కోర్సును పూర్తి చేసింది. ఆ తర్వాత, భువనేశ్వర్‌లోని అజిరా ఒడిశా స్టూడియోలో ఓ నెల ఇంటర్న్‌షిప్ చేసింది. ఆ సమయంలో.. చిత్రనిర్మాత, జర్నలిస్ట్ బీరెన్ దాస్ వద్ద కెమెరా ట్రిక్కులు, ఇంటర్వ్యూలు ఎలా చేయాలో, వీడియోల ఎడిటింగ్‌లో మెళకువలను నేర్చుకుంది.

విశ్లేషణే ఆమె పని...

భువనేశ్వర్‌లోని ప్రాంతీయ వార్తా ఛానెల్‌లో ఉద్యోగం సంపాదించింది. మల్కన్‌గిరిలోని అరణ్యాలు, ప్రజా జీవితాలపై విశ్లేషణే ఆమె పని. అయితే.. అక్కడా ఆమెకు సరైన గుర్తింపు రాలేదు. మహిళలపై చిన్నచూపు, అణచివేత ఆమెను నిరాశపరిచింది. కానీ, అవేవీ ఆమె సంకల్పాన్ని మాత్రం బలహీనపరచలేదు. ఉన్న ఉద్యోగం పోయింది. స్నేహితులు ఆమెకు వివిధ సందర్భాల్లో ఆర్థిక, వసతి, ఇతర సహాయం అందించారు. అలాంటి వారిలో ఒకరు పికిల్ జార్ మీడియా వ్యవస్థాపకులు, సీఈఓ వాసంతి హరిప్రకాష్. 2016లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఓ సమావేశంలో జయంతిని కలిశారు ఆమె. గిరిజన తెగకు చెందిన మొదటి జర్నలిస్ట్ అని తెలుసుకుని ఆశ్చర్యపోయారు. వెంటనే నెట్‌వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా, ఎన్‌డబ్ల్యూఎమ్‌ఐ, ఇండియా-ప్రింట్, బ్రాడ్‌కాస్ట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు చెందిన మహిళల గ్రూపుతో ఆమెను జత చేశారు. అదే ఏడాది.. హైదరాబాద్‌లో జరిగిన ఎన్‌డబ్ల్యూఎమ్‌ఐ వార్షిక సమావేశానికి బురుడాను ఆహ్వానించారు. ప్రయాణ ఖర్చులు చెల్లించినప్పటికీ... ఎంతో ప్రయాసకోర్చి ఆమె ఈ సమావేశానికి హాజరయ్యారు. ఒక ప్రాంతం వరకూ నడుచుకుంటూ.. మరొక గ్రామానికి పడవలో... వైజాగ్‌కు బస్సులో ప్రయాణించింది. చివరకు విశాఖ నుంచి బుక్ చేసుకున్న విమానంలో హైదరాబాద్ చేరుకుంది. ఇక్కడ 500 మందికి పైగా



మహిళలను ఆమె కలుసుకుంది. తను వచ్చిన ప్రాంతం గురించి, డిజిటల్ విభజన, మౌలిక సదుపాయాల సమస్యలు ఎంత తీవ్రంగా ఉన్నాయో అక్కడకు వచ్చిన వారికి వివరించింది. జయంతి ఆ ఈవెంట్‌లో అందరి అభిమానాన్ని సంపాదించింది.

అవగాహన పెంచే ఉద్యమం

మహిళా జర్నలిస్టుల కోసం ఎన్‌డబ్ల్యూఎమ్‌ఐ ఏర్పాటుచేసిన మొదటి ఫెలోషిప్ (2017) ఆమెకు దక్కింది. ఆర్థిక సహాయంతో పాటు ఆమెకు ల్యాప్‌టాప్ కూడా ఇచ్చారు. 2018లో, 'బడా దీదీ యూనియన్'ను (ఎల్డర్ సిస్టర్ యూనియన్‌గా దీనిని అనువదించారు) ప్రారంభించింది. ఇది గిరిజన కమ్యూనిటీల్లోని మహిళలకు ఋతు పరిశుభ్రత, గర్భవతులకు ఆరోగ్యం, ఆహారంతోపాటు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచే ఉద్యమం. తన రిపోర్టింగ్ టూర్‌లలో గిరిజనులు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల లేమిపైనా దృష్టి పెట్టడమే కాదు వాటి పరిష్కారానికీ కృషి చేసింది. 'బడా దీదీ యూనియన్' ద్వారా గిరిజన మహిళల కోసం ఎన్నో అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించింది. చుట్టుపక్కల గ్రామాల పిల్లల్లో పఠనాశక్తిని ప్రోత్సహించేందుకు మల్కన్‌గిరిలో ఓ రోడ్డు పక్కన ఓపెన్ లైబ్రరీని కూడా ఆమె ప్రారంభించింది.

తన కమ్యూనిటీ సాధికారత కోసం 2023లో 'జంగిల్ రాణి' ప్రోగ్రాంను ప్రారంభించింది. మెయిన్ స్ట్రీమ్ మీడియాలోకి రాని ఆదివాసీ కథనాల కోసం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఇది. కొంత మంది గిరిజన మహిళలకు వీడియోలు తీయటంలో శిక్షణ నిచ్చింది. సంస్కృతి నుంచి తాము ఎదుర్కొంటున్న సమస్యల వరకు చేతిలోని సెల్‌ఫోన్‌తో వీడియో స్టోరీలు చేస్తున్నారు గిరిజన మహిళలు. ఈ స్టోరీలను 'జంగిల్ రాణి' ఫేస్‌బుక్ పేజీలో అప్‌లోడ్ చేస్తారు.

గిరిజన సమాజానికి, అడవులు, జీవన వైవిధ్యానికి ఉన్న సంబంధానికి అద్దం పట్టే సహజ కథనాలు ఇవి. ఎంతోమంది సాధారణ మహిళలలో అసాధారణ ఆత్మవిశ్వాసాన్ని నింపడంలో ఎంతో కృషి చేస్తున్నది జయంతి. 'మేం మా సొంత మీడియా హౌస్‌ను, సొంత ప్లాట్‌ఫామ్‌ను సృష్టించాలనుకుంటున్నాం. మా అడవి బిడ్డల కథనాలను ప్రపంచానికి చాటాలనుకుంటున్నాం' అని జయంతి చెప్పింది.

- లలిత



గిరిజనుల్లో చైతన్యం నింపుతూ..



గతేడాది నుంచి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ పరిధిలో భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీతోనూ అనుబంధమయ్యారు. గిరిజనుల హక్కుల కోసం, కమ్యూనిటీ అటవీ వనరులను రక్షించడం, వారి ప్రాథమిక మౌలిక అవసరాలను తీర్చడానికి, అభివృద్ధి ప్రయోజనాల కోసం అటవీ భూమిని కేటాయించడం వంటి సమస్యలపై గిరిజనులను చైతన్యం చేస్తున్నది. గిరిజన సలహా మండలి సభ్యురాలిగా, జయంతికి మల్కన్‌గిరి పట్టణంలో పీడబ్ల్యూడీ క్వార్టర్ ఇచ్చారు. అక్కడి నుంచి ఆమె తన సామాజిక కార్యక్షేత్రానికి మరింత చేరువవుతోంది. అంతేకాదు.. నలుగురు పేద పిల్లలను పోషిస్తున్నది. ఆరుగురు అనాథ బాలికలకు ఆశ్రయం ఇచ్చింది.

కోపం ఎక్కువగా వస్తోందా!

కోపం సర్వసాధారణమైన భావన. మనలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో కచ్చితంగా కోపం వస్తుంది. వినడానికి చిన్న సమస్యే అయినా కొన్ని సందర్భాల్లో కోపం వల్ల మానసిక ఆరోగ్యం కోల్పోవడమే కాక, బీపీ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతు



న్నారు. అయితే ఈ కోపానికి హార్మోన్లు కారణమని ఎంతమందికి తెలుసు? సాధారణంగా మనకు కోపం వచ్చినప్పుడల్లా.. శరీరంలోని రెండు ప్రధాన హార్మోన్లు, అడ్రినలిన్ కార్టిసాల్ అధిక మోతాదులో ఉత్పత్తి అవుతాయి. విపరీతమైన ఒత్తిడికి గురైనా లేదా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఈ హార్మోన్లను విడుదల అవుతాయి. వీటివల్ల హృదయ స్పందన రేటు పెరుగుతుంది. కండరాలు ఉద్రిక్తంగా మారతాయి. ఆరోగ్యానికి చేటు చేసే ఈ కోపాన్ని తగ్గించుకోవడం చాలా మంచిది.

ఎలా నియంత్రించుకోవాలంటే..

- కోపం రాగానే లోతైన శ్వాస తీసుకోని నెమ్మదిగా గాలిని బయటకు వదలాలి. ఇలా చేయడం వల్ల మనస్సుకు ప్రశాంతం లభిస్తుంది. దీనివల్ల మెదడుకు పుష్కలంగా ఆక్సిజన్ అందుతుంది.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడి, ఒత్తిడి తగ్గుతుంది. తద్వారా కోపం వచ్చే అవకాశాలు తగ్గిపోతాయి. మానసిక ప్రశాంతత కూడా తోడవుతుంది.
- తరచూ కోపానికి గురవుతుంటే మాత్రం, ఆ భావన ఎందుకు కలుగుతుందన్న విషయంపై లోతుగా ఆలోచించాలి. అంతలా ఇబ్బంది పెడుతోన్న అంశాన్ని తెలుసుకొని దాన్ని అధిగమించేందుకు ప్రయత్నించాలి.
- భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటే ఈ సమస్య నుంచి తేలికగా బయటపడవచ్చు.

ప్రయివేటు కోచింగ్ సెంటర్లు.. డమ్మీ పాఠశాలలు

(మొదటిపేజీ తరువాయి)

విధించిన నిషేధం వంటి పాఠ్యాంశాలన్నీ మటుమాయమయ్యాయి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 3, 6 తరగతుల విద్యార్థులకు కొత్త పాఠ్య పుస్తకాలు ప్రవేశపెట్టాలని ఎన్సీఈఆర్టీ నిర్ణయించింది. ఇప్పటికే 1, 2 తరగతులకు నూతన పాఠ్య పుస్తకాలు ప్రవేశపెట్టారు. మిగిలిన తరగతులకు మాత్రం హేతుబద్ధీకరించిన (తగ్గించిన) సిలబస్సే కొనసాగుతుందని తన అనుబంధ పాఠశాలలకు ఎన్సీఈఆర్టీ తెలిపింది.

వేరే దారే లేక...

సిలబస్‌ను తగ్గించడంతో ప్రయివేటు కోచింగ్ కేంద్రాలను ఆశ్రయించడం మినహా విద్యార్థులకు మరో మార్గం లేకుండా పోయిందని న్యూఢిల్లీలోని ఐటీఎల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధా ఆచార్య చెప్పారు. తగ్గించిన పాఠశాల సిలబస్‌కు, కాలేజీల ప్రవేశ పరీక్షల సిలబస్‌కు మధ్య అంతరం ఎక్కువగా ఉందని ఆమె తెలిపారు. పదో తరగతి తర్వాత విద్యార్థులు 'డమ్మీ' పాఠశాలలకు బదిలీ కోరుకుంటున్నారని అన్నారు. డమ్మీ పాఠశాలలు 10, 12 తరగతుల విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. వారు ప్రయివేటు కోచింగ్ కేంద్రాలకు వెళుతున్నప్పటికీ తమ సంస్థల్లో హాజరు వేస్తున్నాయి. ఈ కోచింగ్ కేంద్రాల్లో కొన్ని డమ్మీ పాఠశాలల తరగతి గదుల్లోనే నడుస్తుంటాయి. అవి విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తుంటాయి.

ప్రయివేటు కోచింగ్ ఖరీదైనదే అయినప్పటికీ ఆ కేంద్రాలకు వెళుతున్న విద్యార్థుల సంఖ్య రానురానూ పెరుగుతోందని ఓ ఉపాధ్యాయుడు చెప్పారు. కాగా 30 డమ్మీ పాఠశాలల అనుబంధ గుర్తింపును సీబీఎస్‌ఈ కొద్ది రోజుల క్రితమే ఉపసంహరించుకుంది.

గులాబీ పార్టీలో గుబులు..

(మొదటిపేజీ తరువాయి)

గద్వాల విజయలక్ష్మి త్వరలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్న నేపథ్యంలో... ఆయన కేసీఆర్ కుటుంబపైనా, బీఆర్ఎస్ పరిస్థితిపైనా చేసిన కామెంట్లు తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. 'బీఆర్ఎస్ ఓ కుటుంబ పార్టీ. ఆ పార్టీలో కేటీఆర్, హరీశ్, కవిత మాత్రమే ప్రచారంలో ఉంటారు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోవటం ఖాయం. కాంగ్రెస్ ఈ ఎలక్షన్లలో అత్యధిక సీట్లను గెలుచుకుంటుంది. సీఎం రేవంత్ పాలన బాగుంది...' అంటూ ఆయన వ్యాఖ్యానించటం గమనార్హం. దీన్నిబట్టి గులాబీ పార్టీ పట్ల కేకే వైఖరేంటో తెలిసిపోతోంది.

ఇలాంటి గందరగోళం, అయోమయ పరిస్థితుల నడుమే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్... హైదరాబాద్ లోక్‌సభ స్థానానికి సోమవారం అభ్యర్థిని ప్రకటించారు. ఆ స్థానానికి గడ్డం శ్రీనివాస యాదవ్ పేరును ఆయన ఖరారు చేశారు. దీంతో రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాలకు బీఆర్ఎస్ తన అభ్యర్థులను ప్రకటించింది. ఇక సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలకు బీఆర్ఎస్సే ఏడింటినీ గెలుచుకోవటంతో ఆ ఎంపీ సీటును కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ సారి ఆ స్థానాన్ని కచ్చితంగా దక్కించుకోవాలంటూ ఆయన నేతలను ఆదేశించారు. ఇందుకనుగుణంగా కార్యాచరణ రూపొందించాలంటూ దిశా నిర్దేశం చేశారు. అయితే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మారి, కాంగ్రెస్ కండువా కప్పుకోవటమేగాక ఆ పార్టీ నుంచి ఏకంగా సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో తక్షణమే ఆ స్థానంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించాలంటూ కేసీఆర్... వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదేశించారు. దీంతో మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సికింద్రాబాద్ ఎంపీ పరిధిలోని ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో కేటీఆర్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీకి సీనియర్ నేతలు పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాసయాదవ్‌తోపాటు ఇతర నాయకులందరూ హాజరుకానున్నారు.

ఐదు గ్యారంటీలే ఎజెండా

(మొదటిపేజీ తరువాయి)

నాయకుల నుంచి కాంగ్రెస్ అభిప్రాయాలను సేకరించింది. అదే విధంగా లోక్‌సభ ఎన్నికల్లోనూ రాష్ట్రాల వారీగా అభిప్రాయాలను స్వీకరించింది. వీటిపై పార్టీ ఉన్నత స్థాయిలో దశల వారీ అంతర్గత చర్చలు జరిపి పాంచ్ న్యాయ్‌తో పాటు మ్యానిఫెస్టోను ప్రజల ముందుకు తీసుకురానుంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమలు చేసిన మహాలక్ష్మి స్కీమ్ మహిళా సాధికారతకు కొత్త బాటలు వేసిందని ఆ పార్టీ చెబుతోంది. మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు ప్రకటించిన పథకాలు ఇంటింటికి ఆర్థిక బాసటనిస్తూ మహిళా ఓటర్లను కాంగ్రెస్‌కు మరింత దగ్గర చేశాయని అది భావిస్తున్నది. ఈ పథకాల స్ఫూర్తితో ప్రతి పేద కుటుంబంలో మహిళకు ఏడాదికి రూ.ఒక లక్ష ఆర్థిక సాయంతో పాటు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీ మహిళలను పెద్ద ఎత్తున ఆకట్టుకుంటున్నదని పార్టీ నేతలు చెబుతున్నారు.

రాష్ట్రంలో బీసీ కుల గణనకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూల ఫలితాలను ఇచ్చిందనే అంచనాకు ఆ పార్టీ వచ్చింది. దీంతో దేశమంతటా కుల గణన చేపట్టనున్నట్టు ఆ పార్టీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నది. అదే విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి అమల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని హామీ ఇచ్చి ఆ వర్గాలను కూడా ఆకట్టుకునే ప్రయత్నాలు మొదలు పెట్టింది. కుమరం భీం ' జల్ జంగల్ జమీన్ నినాదం ' స్ఫూర్తితో సాగు చేసుకుంటున్న అటవీ భూములపై హక్కుల కోసం పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్లను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు పరిష్కరిస్తామని ఈ ఎన్నికల్లో హామీ ఇవ్వడం గమనార్హం.

పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత, అప్పుల బాధ నుంచి రైతులకు ఉపశమనం కల్పించేందుకు శాశ్వత రైతు రుణమాఫీ కమిషన్, పంట నష్టపోయిన రైతులకు 30 రోజుల్లో బీమా పరిహారం చెల్లిస్తామనే గ్యారంటీలు.. ఈ ఎన్నికల్లో కీలకంగా మారతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలోనూ రోజుకు కనీస కూలీ రూ.400 ఇవ్వాలని తీర్మానించడం, గ్రామీణ పేదల కోసం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు పట్టణ ప్రాంతాలకూ దాన్ని పథకం అమలు చేస్తామని ప్రకటించడమూ ఆయా వర్గాలను పెద్ద ఎత్తున తమ వైపునకు నడిపిస్తాయని కాంగ్రెస్ భావిస్తోంది.

రైతులు బ్యాంకు అప్పులు కట్టొద్దు

(మొదటిపేజీ తరువాయి)

పడుతున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలప్పుడు ఏం చెప్పారు...ఇప్పుడు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్‌పార్టీకి లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పార్టీ గేట్లు తెరవడంపై ఉన్న శ్రద్ధ, ప్రాజెక్టుల గేట్లు తెరవడం మీద లేదని ఆరోపించారు. వరుసగా మూడు రోజులు క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ శ్రేణులు పంటపొలాలకు వెళ్లి పరిస్థితుల్ని సమీక్షించి, నివేదికల్ని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పంపాలని తమ అధినేత కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం తక్షణం ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన అన్ని వేదికలపైనా పోరాడతామన్నారు. పంటనష్టం వివరాలు సేకరించి, రైతులకు ఆర్థిక సహకారం అందించాలనీ, దీనికి ఎలక్షన్ కోడ్ అడ్డు కాకూడదని అన్నారు. యాసంగి వడ్లకు రూ.500 బోనస్ ధర ఇచ్చి కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తే కలెక్టర్ కార్యాలయాలు ముట్టడిస్తామన్నారు.

హోలీ వేడుకల్లో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాడు. నీటిలో ఒకరు మునిగిపోతుండగా మరొకరు.. ఇలా ఒకరి తర్వాత ఒకరు నలుగురూ మునిగిపోయారు. అది గమనించి బయట ఉన్న సంతోష్ కాపాడండి అంటూ అరుస్తుండగానే నలుగురూ నీటిలో మునిగిపోయారు. దాంతో సంతోష్ పరుగుపరుగున వెళ్లి కొంతమందిని తీసుకొచ్చాడు. ఈత వచ్చిన వారు నీటిలో దిగి గాలించినా ఫలితం లేకపోయింది. ఎలుములె ప్రవీణ్‌కు వివాహమై ఏడాది కుమారుడు, భార్య ఉన్నారు. ఉప్పుల సంతోష్ స్థానిక రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా, పనాస కమలాకర్ డ్రైవర్‌గా, ఆలం సాయి ఇటీవల డిగ్రీ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. సీఐ సాదిక్‌పాషా వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నాడు. తాటిపెల్లి గ్రామానికి చెందిన గజ ఈతగాళ్లను తీసుకొచ్చి గాలించారు. ఈతగాళ్లు నాటుపడవ సాయంతో నీటిలోకి వెళ్లి నలుగురి మృతదేహాలను బయటకు తీశారు. ఎదిగిన కొడుకులు ఇలా అర్థాంతరంగా ప్రాణం కోల్పోవడంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామస్తులు ఘటనా స్థలానికి పెద్దఎత్తున చేరుకున్నారు. కుటుంబీకులతో పాటు గ్రామస్తులంతా వారితో గడిపిన క్షణాలను గుర్తు చేసుకొని కంటతడి పెట్టుకున్నారు.

మృతదేహాలను పరిశీలించిన ఎస్పీ

నలుగురు యువకుల మృతదేహాలను ఎస్పీ సురేష్‌కుమార్ సంఘటన స్థలంలో పరిశీలించారు. మృతికి కారణాలపై విచారణ చేపడతామని ఎస్పీ తెలిపారు. మితిమీరిన సరదాలతో యువత ప్రాణాల మీదికి తెచ్చుకోకూడదని, పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. సరదా జీవితంలో ఎప్పటికీ ఉంటుందని, కానీ ప్రాణం పోతే తిరిగి రాదని గమనించాలన్నారు. ఈ ఘటన చాలా బాధాకరమని, నాలుగు కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చిందన్నారు. ఈత రాకుండా నదిలోకి వెళ్లకూడదని సూచించారు. ఆయన వెంట ఏఎస్పీ దేవీసింగ్, డీఎస్పీ కరుణాకర్, ఎస్ఐ మధుకర్ ఉన్నారు.

దండేపల్లిలో..

జన్నారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన గోపులపురం కార్తీక్(18) హోలీ వేడుక అనంతరం స్నానానికెళ్లి మృతిచెందాడు. అమ్మమ్మ ఊరైన మామిడిపల్లి గ్రామానికి తరచూ వచ్చి వెళ్తూ ఉంటాడు. స్నేహితులు హోలీ వేడుకలకు రమ్మని పిలవగా సోమవారం వెళ్లాడు. ఈ క్రమంలో హోలీ వేడుకల అనంతరం స్నానం చేసేందుకు మండలంలోని తానిమడుగు వద్ద గల గూడెం ఎత్తిపోతల పథకం వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో నీటిలో గల్లంతయ్యాడు. స్నేహితులు ఎంత వెతికినా కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. చివరకు కార్తీక్‌ను గాయాలతో స్థానిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే యువకుడు మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతుని తల్లి గోపులపురం అశ్విని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ స్వరూప్‌రాజ్ తెలిపారు.

కాలు జారి వాగులో పడి బాలుడి మృతి

ఆదిలాబాద్ రూరల్‌లో..

ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సమీపంలోని భీంసరి వాగులో కాలు జారి పడి బాలుడు మృతిచెందాడు. ఎస్‌హెచ్‌ఓ సునిత తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని జైజవాన్‌నగర్‌కు చెందిన హర్షిత్(12) హోలీ వేడుకల్లో పాల్గొని, స్నేహితులతో కలిసి భీంసరి వాగుకు స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో కాలు జారి లోతులోకి పడిపోవడంతో మునిగిపోయాడు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాంగ్రెస్ ఆరో జాబితా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

ప్రహ్లాద్ గుంజల్ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ముఖ్యమంత్రి వసుంధరరాజే సన్నిహితుడు గుంజల్‌కు పేరుఉంది. అలాగే, అజ్మర్ నియోజకవర్గం నుంచి రామచంద్ర చౌదరీని, రాజ్‌సమంద్ నుంచి సుదర్శన్ రావత్‌ను, భీల్వారా నుంచి దామోదర్ గుర్జార్‌ను కాంగ్రెస్ పోటీకి దింపింది. తమిళనాడులోని తిరునెల్వెలి నుంచి సి రాబర్ట్ బ్రూస్‌ను పోటీకి దింపింది. విలవంకోడ్ అసెంబ్లీ స్థానం నుంచి థరహై కుత్‌బెర్త్ బరిలోకి దింపింది.

30న మతోన్మాద వ్యతిరేక రాష్ట్ర సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. రాజ్యాంగ విరుద్ధంగా 'పౌరసత్వ సవరణ చట్టం-2019' (సీఏఏ)ను తెచ్చిందని వివరించారు. ఈ నేపథ్యంలోనే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత క్యాంపెయిన్‌కు కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన కవిత 10 రోజుల కస్టడీ

(మొదటిపేజీ తరువాయి)

పది రోజుల కస్టడీ కోరింది. దాదాపు మూడు గంటలపాటు సాగిన ఇరువైపు వాదనలను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం కవితకు 7 రోజుల కస్టడీ విధించింది. ఈ నెల 23తో ఆ కస్టడీ ముగియడంతో... మరోసారి కోర్టులో ప్రవేశపెట్టిన ఈడీ అధికారులు 5 రోజుల కస్టడీ పొడిగించాలని కోరారు. తాజాగా ఈడీ ఈ కేసులో సాధించిన పురోగతి, కవిత మేనల్లుడు మేక శ్రీ శరణ్ పాత్రకు సంబంధించి 17 పేజీల అప్లికేషన్ దాఖలు చేసింది. ఇదే టైంలో బెయిల్ పిటిషన్ ను ఆమె తరపు న్యాయవాది రాణా కోర్టుకు అందజేశారు. ఈడీ కస్టడీ ముగియగానే ఈ పిటిషన్‌పై వాదనలు చేపట్టాలని కోరారు. అయితే... కవితకు మరో 3 రోజుల కస్టడీని పొడిగించిన న్యాయస్థానం ఈరోజు (మంగళవారం) ఉదయం 11 గంటల లోపు తమ ముందు హాజరుపరచాలని ఈడీకి ఆదేశించింది. కవితను ప్రవేశపెట్టే సమయంలో ఆమె కస్టడీ పొడిగించాలని ఈడీ మరోసారి కోరనున్నట్టు సమాచారం. ఒకవేళ కస్టడీ పొడిగింపునకు కోర్టు అనుమతించకపోతే... కవిత బెయిల్ పిటిషన్ పై ఆమె తరపు న్యాయవాదులు వాదనలు వినిపించనున్నట్టు తెలిసింది.

బీజేపీలోకి గాలి జనార్ధన్ రెడ్డి

బెంగళూరు : మైనింగ్ వ్యాపారి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి సోమవారం బీజేపీ లో చేరారు. తన సొంత పార్టీ కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష (కెఆర్‌పిపి)ను బీజేపీ లో విలీనం చేశారు. బెంగళూరులో యెడ్యూరప్ప సమక్షంలో జనార్ధన్ రెడ్డి తన భార్య అరుణ లక్ష్మి, ఇతర మద్దతుదారులతో కలిసి బీజేపీ లో చేరారు. ఎలాంటి షరతులు లేకుండా తన పార్టీని బిజెపిలో విలీనం చేస్తున్నానని, ఒక సాధారణ కార్యకర్తగా పని చేస్తానని ఈ సందర్భంగా గాలి జనార్ధన్ రెడ్డి తెలిపారు. నిజానికి గాలి జనార్ధన్ రెడ్డి బీజేపీ కి చెందిన వ్యక్తే. అయితే గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ పారీని వీడి సొంతంగా పార్టీ పెట్టుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచారు. మళ్లీ ఇప్పుడు బీజేపీ లోనే చేరారు.

రష్యాపై దాడికి ఉక్రెయిన్‌ని నిందించొద్దు : మక్రాన్

పారిస్ : రష్యాలో 130మందికి పైగా మృతి చెందడానికి కారణమైన దాడి చేసింది ఇస్లామిక్ స్టేట్ అని తమ వద్ద సమాచారం వుందని, ఆ దాడికి కారణం ఉక్రెయిన్ అంటూ నిందలు వేయడం ద్వారా ఈ దాడిని ఉపయోగించుకోవద్దని ఫ్రాన్స్, రష్యాని హెచ్చరించింది. ఈ మేరకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మక్రాన్ విలేకర్లతో మాట్లాడుతూ వ్యాఖ్యలు చేశారు. ఈ దాడికి కుట్ర పన్నింది, అమలు చేసింది ఇస్లామిక్ స్టేట్ అని ఫ్రాన్స్ వద్ద నిఘా వర్గాల సమాచారముందని అన్నారు. ఫ్రాన్స్‌లో కూడా ఈ తీవ్రవాద గ్రూపు అనేక దాడులకు పాల్పడిందన్నారు. ఈ దాడిని, సందర్భాన్ని ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా ఉపయోగించుకోవాలని రష్యా భావిస్తే అందుకు వ్యతిరేకమైన ఫలితాలే వస్తాయని రష్యా అది గుర్తించాలని మాక్రాన్ హెచ్చరించారు.



ఐపీఎల్‌లో నేడు
చెన్నై X గుజరాత్
వేదిక : చెన్నై, రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..





జోరు సాగేనా?!

సూపర్‌కింగ్స్‌తో టైటాన్స్ పోరు నేడు

నవతెలంగాణ-చెన్నై

2023 ఐపీఎల్ ఫైనల్ రీ మ్యాచ్ కాస్త ఆలస్యమైనా.. తొలి వారంలోనే అభిమానుల ముందుకొచ్చింది. గత సీజన్ ఫైనలిస్టులు చెన్నై సూపర్‌కింగ్స్, గుజరాత్ టైటాన్స్ నేడు చెపాక్ వేదికగా ముఖాముఖి తలపడనున్నాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై విజయంతో చెన్నై సూపర్‌కింగ్స్... ముంబయి ఇండియన్స్‌కు షాకిచ్చి గుజరాత్ టైటాన్స్ సీజన్ తొలి మ్యాచుల్లో విజయారంభం అందుకున్నాయి. ఇప్పుడు రెండో మ్యాచ్‌లోనూ గెలుపు జోరు కొనసాగించాలని ఇరు జట్లు సిద్ధంగా ఉన్నాయి. చెన్నైలోని ఎం.ఏ చిదంబరం స్టేడియంలో సూపర్‌కింగ్స్, టైటాన్స్ మ్యాచ్ నేడు.

అతడు బ్యాట్ పడతాడా? : సూపర్‌కింగ్స్ అభిమానులకే కాదు క్రికెట్ ప్రియులు అందరూ ఈ సీజన్‌లో మహేంద్రసింగ్ ధోని విన్యాసాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎం.ఎస్ ధోని ఆఖరు ఐపీఎల్ సీజన్‌గా భావిస్తున్న ఏడాదిలో అతడు బ్యాట్‌తో మునుపటి మహిని తలపిస్తే చూడాలని అభిమానులు స్టేడియానికి పోటెత్తుతున్నారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌తో మ్యాచ్‌లో ఎం.ఎస్ ధోని బ్యాట్ పట్టాల్సిన అవసరం రాలేదు. లోతైన బ్యాటింగ్ లైనప్ కలిగిన సూపర్‌కింగ్స్‌కు ధోని టెయిలెండర్లతో పాటు వస్తున్నాడు. గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లోనైనా ధోని బ్యాటింగ్‌కు వస్తే అభిమానులకు అదే పండుగ!. ఇక కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్ తొలి మ్యాచ్‌లోనే ఆకట్టుకున్నాడు. రచిన్ రవీంద్ర, డార్లీ మిచెల్, శివం దూబె సహా రవీంద్ర జడేజా తొలి మ్యాచ్‌లో ఆకట్టుకున్నారు. ముస్తాఫిజుర్ రెహమాన్, దీపక్ చాహర్‌లతో కూడిన పేస్ దళం బాగుంది. అచ్చొచ్చిన చెపాక్ స్టేడియంలోనే మ్యాచ్ కావటంతో సహజంగానే చెన్నై సూపర్‌కింగ్స్ హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుంది.

టైటాన్స్‌కు సవాల్ : గుజరాత్ టైటాన్స్ తొలి రెండు సీజన్లు ఫైనల్స్‌కు చేరి ఐపీఎల్ అగ్రజట్లలో ఒకటిగా నిలిచింది. ముంబయి ఇండియన్స్‌తో మ్యాచ్‌లో టైటాన్స్ ఓటమి కోరల్లోంచి బయటకొచ్చి మరీ విజయం సాధించింది. బ్యాట్‌తో, బంతితో టైటాన్స్ వాస్తవానికి అంచనాలు అందుకో లేదు. కానీ బౌలర్లు డెత్ ఓవర్లలో ఆకట్టుకున్నారు. ఒత్తిడి కనిపించినా.. బ్యాటర్లను క్రమం తప్పకుండా వెనక్కి పంపారు. ఆఖరు ఓవర్లోనూ ఉమేశ్ యాదవ్‌పై ఒత్తిడి పడినా.. మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఆఖరు వరకు పోరాడేతత్వమే టైటాన్స్‌ను విజేతగా నిలిపింది. ఇదే ఫార్ములాను నేడు చెన్నై సూపర్‌కింగ్స్‌తోనూ టైటాన్స్ పాటించనుంది. స్పిన్ ప్రభావం చూపే చెపాక్‌లో మాయగాడు రషీద్ ఖాన్ టైటాన్స్‌కు కీలకం కానున్నాడు. శుభ్‌మన్ గిల్, స్పెన్సర్ జాన్సన్, డెవిడ్ మిల్లర్, సాయి సుదర్శన్‌లు గుజరాత్ కీలక ఆటగాళ్లు.



మెరిసిన ధావన్

రాణించిన శశాంక్, కరన్ పంజాబ్ కింగ్స్ 176/6

నవతెలంగాణ-బెంగళూర్

యువ ఆటగాడు శశాంక్ సింగ్ (21 నాటౌట్, 8 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) చెలరేగాడు. డెత్ ఓవర్లలో దంచికొట్టిన శశాంక్ సింగ్ పంజాబ్ కింగ్స్‌కు మెరుగైన స్కోరు అందించాడు. కెప్టెన్ శిఖర్ ధావన్ (45, 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), జితేశ్ శర్మ (27, 20 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), శామ్ కరన్ (23, 17 బంతుల్లో 3 ఫోర్లు), ప్రభుసిమ్రన్ సింగ్ (25, 17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సమిష్టిగా రాణించారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పేసర్ మహ్మద్ సిరాజ్ (2/26), గ్లెన్ మాక్స్‌వెల్ (2/29), యశ్ ధయాల్ (2/23) రాణించారు.

శశాంక్ ధనాధన్ : సొంతగడ్డపై టాస్ నెగ్గిన బెంగళూర్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. పంజాబ్ కింగ్స్‌కు ఓపెనర్లు మరోసారి ఆశించిన ఆరంభం ఇవ్వలేదు. జానీ బెయిర్‌స్టో (8) నిరాశపరిచాడు. కెప్టెన్ శిఖర్ ధావన్ (45, 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. ప్రభు సిమ్రన్ సింగ్ (25)తో కలిసి రెండో వికెట్‌కు 55 పరుగులు జోడించిన ధావన్ పంజాబ్ కింగ్స్‌కు మంచి స్కోరు అందించేలా కనిపించాడు. అర్థ సెంచరీ ముంగిట ధావన్ నిష్క్రమించగా.. లియాం లివింగ్‌స్టోన్ (7) ఓ సిక్సర్, ఫోర్‌తో సరిపెట్టాడు. 89/4తో పంజాబ్ కింగ్స్ స్వల్ప స్కోరుకు పరిమితం అయ్యేలా కనిపించింది. ఈ దశలో శామ్ కరన్ (23), జితేశ్ శర్మ (27) విలువైన భాగస్వామ్యం నమోదు చేశారు. ఈ ఇద్దరు ఐదో వికెట్‌కు 34 బంతుల్లో 52 పరుగులు జోడించారు. డెత్ ఓవర్లలో కరన్, జితేశ్ వికెట్ కోల్పోగా.. ముగింపు బాధ్యత శశాంక్ సింగ్ (21 నాటౌట్) తీసుకున్నాడు. రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో 8 బంతుల్లోనే 21 పరుగులు పిండుకున్నాడు. దీంతో పంజాబ్ కింగ్స్ 176 పరుగులు చేసింది. బెంగళూర్ బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (2/26), గ్లెన్ మాక్స్‌వెల్ (2/29) రాణించారు. అల్జారీ జోసెఫ్ ఆరంభంలో ఆకట్టుకున్నా.. చివర్లో పరుగుల నియంత్రణ కోల్పోయాడు. యశ్ ధయాల్ (1/23) సైతం ఆకట్టుకున్నాడు.



ఆ రూల్‌తో బౌలర్లకు ఊరట!

ఓవర్లో రెండు బౌన్సర్లపై గవాస్కర్



అహ్మదాబాద్ : ఆధునిక క్రికెట్ పూర్తిగా బ్యాటర్ల స్వర్గధామం. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా బ్యాటర్లు క్రికెట్‌ను శాసిస్తున్నారు. ఆటలో ఆధిపత్యం చెలాయించేందుకు బౌలర్లకు అవకాశాలు స్వల్పం!. ఇక టీ20 ఫార్మాట్‌లో బౌలర్ల ఆగచాట్లకు ఓ లెక్కంటూ లేదు అనటం అతిశయోక్తి కాదు. పూర్తిగా బ్యాటర్లు శాసిస్తున్న పొట్టి ఫార్మాట్ ఐపీఎల్‌లో తీసుకొచ్చిన కొత్త నిబంధన గేమ్ ఛేంజర్‌గా మారుతోంది. ఐపీఎల్ 17లో ఇప్పటివరకు ఆరు మ్యాచులే ముగిశాయి. అయినా, ఈ అంశంపై ఓ నిర్ధారణకు రావటం తొందరపాటు కాదేమో!. ఓ ఓవర్లో రెండు బౌన్సర్లు సంధించే స్వేచ్ఛతో బౌలర్లకు ఊరట దక్కిందని, బ్యాటర్లకు ఇది కష్టతరంగా మారిందని లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. 'ఓ ఓవర్లో రెండు బౌన్సర్లు సంధించవచ్చనే నిబంధన ఐపీఎల్ పోటీలో బ్యాటర్ల ఆధిపత్యానికి గండి కొట్టింది. ఈ రూల్‌తో మ్యాచ్ కాస్త బౌలర్లకు అనుకూలంగా మారుతుంది. రెండు బౌన్సర్ల నిబంధనకు తోడు బౌండరీ పరిధులను కొన్ని మీటర్లు పెంచితే.. మిస్ హిట్‌లు పేస్ సాయంతో సిక్సర్లుగా మారకుండా బౌండరీ ఇవతలే ఫీల్డర్లకు క్యాచులుగా దక్కుతాయి. ఈ విషయంలో గ్రౌండ్స్‌మెన్ బాధ్యత తీసుకోవాలి' అని సునీల్ గవాస్కర్ అన్నాడు.

చెన్నైలో టైటిల్ పోరు

మే 26న ఐపీఎల్17 ఫైనల్ | పూర్తి షెడ్యూల్ విడుదల చేసిన బీసీసీఐ

నవతెలంగాణ-ముంబయి



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 పూర్తి షెడ్యూల్ వచ్చేసింది. మార్చి 22న చెపాక్‌లో మొదలైన ఐపీఎల్ 17 సీజన్.. మే 26న చెపాక్‌లోనే టైటిల్ పోరుతో ముగియనుంది. సుమారు 12 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత చెన్నైలోని ఎం.ఏ చిదంబరం స్టేడియం ఐపీఎల్ టైటిల్ పోరుకు ఆతిథ్యం ఇవ్వనుంది. 2011, 2012 ఐపీఎల్ ఫైనల్స్‌కు వేదికగా నిలిచిన చెపాక్ మళ్లీ తుది పోరుకు ఆతిథ్యం ఇవ్వలేదు. ఫైనల్‌తో పాటు మే 24న రెండో క్వాలిఫయర్‌కు చెన్నై వేదిక కానుంది. తొలి క్వాలిఫయర్ మే 21న జరుగనుండగా, ఎలిమినేటర్ మే 22న జరుగుతుంది. ఈ రెండు మ్యాచులకు అహ్మదాబాద్‌లోని మొతెరా మైదానం వేదిక కానుంది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో భద్రతా పరంగా ఎటువంటి సమస్యలు ఎదురుకాకుండా.. నిర్వాహకులు సోమవారం ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ విడుదల చేశారు. తొలి దశ షెడ్యూల్‌లో 17 రోజుల్లో 21 మ్యాచులు షెడ్యూల్ చేయగా.. తాజా షెడ్యూల్‌లో ప్లే ఆఫ్స్ సహా 52 మ్యాచులు చోటుచేసుకున్నాయి.

రెండు గ్రూపులుగా : ఐపీఎల్ ఫార్మాట్ గత సీజన్ మాదిరిగానే ఉంది. లీగ్‌లో పోటీపడుతున్న పది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో ఐదేసి జట్లు చోటుచేసుకున్నాయి. గ్రూప్-ఏలో ఐదుసార్లు చాంపియన్ ముంబయి ఇండియన్స్, మాజీ చాంపియన్లు రాజస్థాన్ రాయల్స్, కోల్‌కత నైట్‌రైడర్స్ సహా ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్‌జెయింట్స్ ఉన్నాయి. గ్రూప్-బిలో ఐదుసార్లు టైటిల్ విజేత, డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్, మాజీ చాంపియన్లు సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ సహా రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, పంజాబ్ కింగ్స్ ఉన్నాయి. ప్రతి జట్టు తమ గ్రూప్‌లోని ఇతర నాలుగు జట్లతో రెండు మ్యాచుల్లో ఇంటా, బయటా ఫార్మాట్‌లో ఆడుతుంది. ఇతర గ్రూప్‌లోని నాలుగు జట్లతో ఓ మ్యాచ్‌లో ఢీకొంటుంది. డ్రా ప్రకారం ఇతర గ్రూప్‌లోని మరో జట్టుతో రెండు సార్లు తలపడనుంది. దీంతో ప్రతి జట్టు గ్రూప్ దశలో 14 మ్యాచుల్లో తలపడనుంది. గ్రూప్ దశ మ్యాచుల అనంతరం టాప్-4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2లో నిలిచిన జట్లకు ఫైనల్‌కు చేరుకునేందుకు రెండు అవకాశాలు ఉండగా.. 3, 4వ స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌లో చావోరేవో తేల్చుకోవాల్సి ఉంటుంది.

ఆ మూడు స్టేడియాల్లో.. : ఈ సీజన్‌లో ఐపీఎల్ ఫ్రాంచైజీలు బహుళ హోమ్ గ్రౌండ్‌ను ఎంచుకున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్‌కు విశాఖపట్నం తొలి రెండు మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వనుండగా.. పంజాబ్ కింగ్స్‌కు ధర్మశాల, రాజస్థాన్ రాయల్స్‌కు గువహటి గ్రౌండ్‌లు హోమ్ స్టేడియాలుగా ఉండనున్నాయి. గ్రూప్ దశ చివరి మ్యాచ్ మే 19న గువహటిలో పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ నడుమ జరుగనుంది. ధర్మశాల, విశాఖపట్నం, గువహటి రెండేసి మ్యాచులకు వేదికగా నిలువనున్నాయి.

ఉప్పల్‌లో ఏడు మ్యాచులు : ఐపీఎల్ 17 సీజన్‌లో హైదరాబాద్ మెగా మ్యాచులకు వేదిక కానుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంత మైదానం ఉప్పల్‌లో ఈ సీజన్‌లో ఏడు మ్యాచులు ఉండనున్నాయి. తొలి మ్యాచ్ బుధవారం ముంబయి ఇండియన్స్‌తో ఉండగా.. ఏప్రిల్ 5న చెన్నై సూపర్‌కింగ్స్, ఏప్రిల్ 25న రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌తో సన్‌రైజర్స్ ఇక్కడే ఢీకొట్టనుంది. మే 2న రాజస్థాన్ రాయల్స్, మే 8న లక్నో సూపర్‌జెయింట్స్, మే 16న గుజరాత్ టైటాన్స్, మే 19న పంజాబ్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ మ్యాచులు సైతం ఉప్పల్‌లో జరుగుతాయి.

ఐపీఎల్ 2024 గ్రూపులు

గ్రూప్-ఏ	గ్రూప్-బి
ఢిల్లీ క్యాపిటల్స్	చెన్నై సూపర్‌కింగ్స్
కోల్‌కత నైట్‌రైడర్స్	గుజరాత్ టైటాన్స్
లక్నో సూపర్‌జెయింట్స్	పంజాబ్ కింగ్స్
ముంబయి ఇండియన్స్	రాయల్ చాలెంజర్స్ బెంగళూర్
రాజస్థాన్ రాయల్స్	సన్‌రైజర్స్ హైదరాబాద్



రామ్‌చరణ్, సుకుమార్

'రంగస్థలం'తో తెలుగు సినిమా చరిత్రలో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్న రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్ మళ్లీ ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమైంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీస్ మేకర్స్ సంస్థ, సుకుమార్ రైటింగ్స్ అత్యంత భారీగా తెరకెక్కిస్తున్నట్టు ప్రకటించాయి. గ్రౌండ్ బ్రేకింగ్ కొలాబరేషన్‌కి రంగం సిద్ధమైంది అంటూ తమ సినిమా గురించి అనౌన్స్‌మెంట్ ఇచ్చాయి.

మరో బ్లాక్‌బస్టర్‌కి రెడీ

బ్లాక్‌బస్టర్ సక్సెస్ 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత గ్లోబల్ ఐకాన్‌గా గుర్తింపు పొందారు రామ్‌చరణ్. ఇటు 'పుష్ప' సినిమాతో తగ్గేదేలే అంటూ అందరివాడనిపించుకున్నారు దర్శకుడు సుకుమార్. వీరిద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ సినిమా మీద మన దగ్గరే కాదు జాతీయంగా, అంతర్జాతీయంగానూ ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఈ ఏడాదిలోనే షూటింగ్ మొదలు పెట్టి, 2025 లాస్ట్ క్వార్టర్‌లో సినిమాను విడుదల చేయనున్నారు. రామ్‌చరణ్, సుకుమార్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ కాంబినేషన్‌కి దేవిశ్రీ ప్రసాద్ పేరు తోడవడం ఫ్యాన్స్‌లో మరింత ఉత్సాహాన్ని పెంచింది.

మెప్పించే సరికొత్త కాన్సెప్ట్..



నరేన్ రామ

నాని మూవీ వర్క్స్, రామా క్రియేషన్స్ ఆధ్వర్యంలో విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. కొత్త కాన్సెప్ట్‌తో రాబోతోన్న ఈ మూవీకి కథ, డైలాగ్స్, స్క్రీన్ ప్లే, దర్శకత్వం రమాకాంత్ రెడ్డి వహించారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 29న రాబోతోంది. ఈ నేపథ్యంలో నటుడు నరేన్ రామ మీడియాతో ముచ్చటించారు.

- సీనియర్ నటుడు గుమ్మడి నాకు తాతయ్య వరుస అవుతారు. ఆయన ద్వారా మొదట్నుంచి సినిమాల మీద ఆసక్తి ఏర్పడింది. మా అమ్మానాన్నలు చెన్నైలో స్థిరపడటంతో తమిళ పరిశ్రమలో ప్రయత్నాలు మొదలుపెట్టాను. పలు యాడ్స్‌తోపాటు తమిళంలో మూడు సినిమాలు హీరోగా, ఒక సినిమాలో విలన్‌గా చేశాను. తెలుగులో ఈ సినిమాతో ఎంట్రీ ఇవ్వబోతున్నాను. ఈ సినిమాలో ఒక కీలక పాత్ర చేశాను.
- నేను ఛాన్సుల కోసం ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ సినిమా కో డైరెక్టర్, నా వెల్ విషర్ సాయి ఈ ఆఫర్ ఇప్పించారు. డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి నా ప్రొఫైల్ చూసి ఓకే చేసారు. నా పాత్ర బాగుంటుంది. నాకు కథ నచ్చింది. అందుకే ఈ సినిమా చేసాను. డైరెక్టర్ చాలా కూల్. తనకి కావాల్సినట్టుగా నా దగ్గర అవుట్‌పుట్ రాబట్టుకున్నారు. ఆయనతో మరో సినిమా చేయాలని ఉంది.
- హీరో విశ్వ కార్తికేయ ఇప్పటికే చైల్డ్ ఆర్టిస్ట్‌గా చాలా సినిమాలు చేసాడు. హీరోగా చేస్తున్నాడు. వర్క్ విషయంలో నాకు చాలా హెల్ప్ చేసాడు. సెట్‌లో మేమిద్దరం డిస్కస్ చేసుకుని యాక్ట్ చేసేవాళ్ళం. మా కాంబినేషన్ సీన్స్ చాలా బాగా వచ్చాయి. హీరోయిన్ అయుషీ మంచి అమ్మాయి. తన పాత్ర కూడా చాలా బాగుంటుంది. నిర్మాతలు నాని, మహేష్ బాగా క్లోజ్ అయ్యారు. బ్రదర్ లా ఉండేవారు. కెమెరామెన్ చరణ్ నన్ను చాలా బాగా చూపించారు. నాకు టైటిల్ సాంగ్, అమ్మ సాంగ్ బాగా నచ్చాయి. అజయ్ మంచి సంగీతం ఇచ్చారు.
- ఇదొక థ్రిల్లర్ మూవీ. అందరూ థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేస్తారు. ఇప్పటికే టీజర్, ట్రైలర్స్‌తో సినిమాకు మంచి బజ్ వచ్చింది. సినిమా చూసి, నచ్చిన వాళ్ళు ఇంకొంతమందికి చెప్పండి. అందరికీ రీచ్ అవుతుంది. మేజర్ సిటీలలో కాలేజీ టూర్స్‌కి వెళ్ళాం. అని చోట్ల మంచి రెస్పాన్స్ వస్తుంది. అందరూ వచ్చి చూస్తారని భావిస్తున్నాం. త్వరలో తెలుగులోనే 'హూ' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు మరోసారి రాబోతున్నా.

నవచిత్రం

కుటుంబాన్ని నిలబట్టే ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ స్టారే



మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ


హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' సినిమా నుంచి థర్డ్ సింగిల్ 'మధురము కదా..' లిరికల్ సాంగ్‌ను హైదరాబాద్‌లోని మై హోమ్ జెవెల్ గేటెడ్ కమ్యూనిటీలో హోలీ వేడుకల మధ్య గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మృణాల్ ఠాకూర్, నిర్మాత దిల్ రాజు పాల్గొన్నారు. ఈ సినిమా టీమ్‌కు మై హోమ్ జెవెల్ ఫ్యామిలీస్ హార్టీ వెల్‌కమ్ చెప్పారు. మూవీ టీమ్‌తో హోలీ ఆడుతూ, డ్యాన్సులు చేస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు.

నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, 'ఏప్రిల్ 5న ఈ సినిమా రిలీజ్‌కు వస్తోంది. తన కుటుంబాన్ని గొప్ప స్థాయిలో నిలబెట్టేందుకు కష్టపడే ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ స్టారే. ఇది మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ కథ. మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ ఎమోషన్స్ అన్నీ విజయ్ క్యారెక్టర్‌లో చూస్తారు. పాటలు, డైలాగ్స్, హీరోతో చెప్పించిన మానరిజమ్స్ అన్నీ రేపు థియేటర్స్‌లో మిమ్మల్ని మీరు చూసుకున్నట్లు ఉంటుంది' అని అన్నారు.

'మా 'ఫ్యామిలీ స్టార్' సినిమా చూసేందుకు థియేటర్స్‌కు రండి. మన లాంటి ఫ్యామిలీస్ నుంచి వచ్చిన ఒక పర్సన్ కథ ఇది. ఫ్యామిలీ గురించి ఆలోచించే వారి కథ' అని హీరో విజయ్ దేవరకొండ చెప్పారు.

'మధురము కదా..' పాటకు శ్రీమణి లిరిక్స్ అందించగా..శ్రేయా ఘోషల్ పాడారు. గోపి సుందర్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేశారు. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు.

ఇక థియేటర్లలో మోత..మోగాల్సిందే



విశ్వక్‌సేన్, అయేషా ఖాన్

యువ కథానాయకుడు విశ్వక్ సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. మాస్‌ని మెప్పించే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం సమకూరుస్తున్నారు.

ఇప్పటికే ఆయన స్వరపరిచిన ఆల్బమ్ నుండి విడుదలైన "సుట్టంలా సూసి" మెలోడీ సాంగ్ విశేషంగా ఆకట్టుకుంది. ఈ పాట యూట్యూబ్‌లో దాదాపు 50 మిలియన్ల వీక్షణలతో చార్ట్ బస్టర్‌గా నిలిచింది.

ఇప్పుడు చిత్ర బృందం ఈ సినిమా నుండి 'మోత' అనే మరో ఆకర్షణీయమైన పాటను విడుదల చేసింది. యువన్ శంకర్ రాజా తనదైన శైలిలో మాస్‌ని మెప్పించేలా ఈ పాటను స్వరపరిచారు. అభిమానుల్లో ఉత్సాహం నింపేలా ఉన్న ఈ పాట.. థియేటర్లలో మోత మోగించడం ఖాయం అనేలా ఉంది. గీత రచయిత చంద్రబోస్ సాహిత్యం ఈ పాటని మరోస్థాయికి తీసుకెళ్లింది. పాట సందర్భానికి తగ్గట్టుగా పదాల అల్లికతో మరోసారి మాయ చేశారు. అలాగే ఎం.ఎం.మానసి గాత్రం ఈ గీతానికి మరింత అందం తీసుకొచ్చింది.

హోలీ రోజున ఈ పాటను విడుదల చేసి పండగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చింది చిత్ర బృందం. ఇక అందాల తార అయేషా ఖాన్ ఈ ప్రత్యేక పాట కోసం విశ్వక్ సేన్‌తో కలిసి తెరను పంచుకోవడం అదనపు ఆకర్షణ. అయేషా ఖాన్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎనర్జీ సినీ ప్రేమికులందరికీ ప్రత్యేక ట్రీట్‌లా ఉండనుంది. ఈ చిత్రంలో నేహా శెట్టి కథానాయికగా నటిస్తుండగా, అంజలి కీలక పాత్ర పోషిస్తున్నారు.

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ సినిమాకి వెంకట్ ఉప్పుటూరి, గోపీ చంద్ ఇన్నమూరి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాకి కృష్ణ చైతన్య రచన, దర్శకత్వం వహిస్తున్నారు. చీకటి ప్రపంచంలో సామాన్యుడి నుంచి అసామాన్యుడిగా ఎదిగిన వ్యక్తి ప్రయాణంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమా మే 17న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.

ప్రియదర్శి- ఇంద్రగంటి సినిమా షురూ..



ప్రియదర్శి, రూప కొడువాయూర్

2016లో నానితో 'జెంటిల్ మన్', 2018లో సుధీర్ బాబుతో 'సమ్మోహనం' ఇప్పుడు ముచ్చటగా మూడోసారి మోహనకృష్ణ ఇంద్రగంటి - శ్రీదేవి మూవీస్ కాంబినేషన్లో ఓ చిత్రం ప్రారంభమైంది. ప్రియదర్శి, రూప కొడువాయూర్ ఇందులో హీరో హీరోయిన్లు. శ్రీదేవి మూవీస్ సంస్థలో ప్రొడక్షన్ నెంబర్. 15 గా రూపొందుతోన్న ఈ చిత్రం సోమవారం ఉదయం సంస్థ కార్యాలయంలో పూజా కార్యక్రమాలతో ఆరంభమైంది.

దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు దృశ్యానికి నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ సతీమణి అనిత క్లాప్ ఇవ్వగా, దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ సతీమణి ఉమా మహేశ్వరి కెమెరా స్విచ్ ఆన్ చేసారు.

ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, 'మోహనకృష్ణ ఇంద్రగంటితో 'జెంటిల్ మన్, సమ్మోహనం' చిత్రాల తర్వాత మళ్ళీ ఈ సినిమా చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. 'బలగం'తో హీరోగా ఎంతో పేరు తెచ్చుకున్న ప్రియదర్శికి హీరోగా యాప్ట్ సబ్జెక్ట్ ఇది. తెలుగమ్మాయి రూప కొడువాయూర్ ఇందులో కథానాయికగా నటిస్తున్నారు. ఇదో క్యూట్ ఫిలిం. స్వీట్ ఎంటర్టైనర్. చక్కటి వినోదంతో పాటు మంచి భావోద్వేగాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి ట్రెండ్‌లో జంధ్యాల సినిమా చేస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుందీ సినిమా. ఈ రోజు నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరణ మొదలైంది' అని తెలిపారు.

వి.కె. నరేష్. తనికెళ్ళ భరణి, అవసరాల శ్రీనివాస్, 'వెన్నెల' కిశోర్, 'వైవ' హర్ష, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, ప్రదీప్ రుద్ర, రమేష్ రెడ్డి, కల్పలత, రూపలక్ష్మి, హర్షిణి, కె.యల్.కె. మణి ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి పాటలు- రామజోగయ్య శాస్త్రి, ఫైట్స్- వెంకట్, ప్రొడక్షన్ డిజైనర్- రవీందర్, ఎడిటర్- మార్తాండ్ కె. వెంకటేష్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ- పి.జి. విందా, సంగీతం- వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్స్ -విద్య శివలెంక, లిపిక ఆళ్ల.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886